
# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఫిబ్రవరి
2022

వెల: రూ.
25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

**సంపుటి:** 15 **సంచిక:** 2

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా|| పులిగడ్డ విజయలక్ష్మి**

ఫొటోగ్రాఫర్:
**పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి: **సాయినాథ్**

డిజైన్: **రమేష్**



**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| తులసీ నమస్తుభ్యమ్ | 6 |
| నెలకో సూర్యుడు | 10 |
| దీప దాన మహిమ | 14 |
| మాఘ ఆదివార వ్రతం | 17 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 19 |
| రామాయణ రత్నాకరం | 25 |
| భక్త మీరాబాయి | 29 |
| శ్రీకాళహస్తి - చారిత్రక వైశిష్ట్యం | 32 |
| శ్రీ వేంకటేశ సహస్ర నామావళి | 34 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 36 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవ వైభవం | 40 |
| మహాభక్త నందనార్ | 43 |
| మీ ప్రశ్న - మా సమాధానం | 46 |
| అంత్యకాలములో భగవంతుని నామస్మరణ | 47 |
| శ్రీ వేంకటేశ్వర అష్టో త్తర శతనాలమావళి | 49 |
| శ్రీ వేంకటేశ్వర లీలా వైభవం | 51 |
| శ్రీ ఆదికేశవ పెరుమాళ్ కోవెల - తిరువట్టార్ | 55 |
| మన మహర్షులు - ఔర్వ మహర్షి | 59 |
| శ్రీ విష్ణు మహాపురాణం | 61 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |




# అనుకరించవలసిన హరిదాసు

మానవ జీవితములో ఆటుపోట్లు సహజము. కష్టాలను అనుభవించుటకే భూమిపై జన్మించామా? అనిపిస్తుంది అప్పుడప్పుడు. కష్టాలకు ఏమాత్రము వెరవక నా పని నేను చేసుకుంటూ పోతాననే దృఢనిశ్చయముతో ముందుకు సాగిపోవడమే మనిషి చేయవలసిన పని. ఈ భూమి మీద ప్రతి మనిషి ఒక హరిదాసు మాదిరిగా జీవించాలని పెద్దలంటారు. హరిదాసు ఎల్లవేళల చాలా ప్రశాంత వదనముతో, ఎంతో ఆనందంగా హరినామ స్మరణ చేయుచు తనకు తాను మధురానుభూతిని అనుభవిస్తుంటాడు. హరిదాసు హరినామ కీర్తనల ద్వారా తను ఆనందాన్ని అనుభవించుచు, తన చుట్టుప్రక్కల ఉండే జనాలను కూడా ఆనందపరవశులనుగా మార్చుటకు ప్రయత్నించుచుంటాడు. హరిదాసులు ఎంతో స్థితప్రజ్ఞత కలిగి జీవిస్తుంటారు. నిజానికి హరిదాసులు వారి వారి జీవనోపాధి కొరకు ఊరూరా తిరుగుచున్నప్పటికీ భిక్షం వేసిన వారివద్ద, భిక్షం వేయనివారి వద్ద మరియు చీదరించుకునేవారి వద్ద ఒకేరకమైన హరినామ స్మరణ, హరి కీర్తన చేస్తూ ఉంటారు. చీదరించుకునే వారివద్ద కూడా ఎలాంటి ప్రతికోపమును గాని, అసహనమును గాని ప్రదర్శించక అంతే ఓపికతో హరికీర్తనను అతి మధురముగా ఆలపించుచుందురు. నా పని నేను చేయుచున్నాను, భిక్షం వేయడం, వేయకపోవడం నీ ఇష్టం అనే విధంగా ప్రవర్తిస్తారు. భిక్షం పైన వారికి ఆసక్తి ఉన్నప్పటికీ హరి దయ ఉంటేనే భిక్షం లభిస్తుంది, లేకుంటే లేదు అనే నమ్మకంతో జీవిస్తుంటాడు. భిక్షం లభించినప్పుడు సంతోషించడు, దొరకనప్పుడు బాధపడడు. ఈలోకం హరి సంకల్పంతోనే హరి ఆజ్ఞానుసారం నడుచుచున్నదనే గొప్ప జ్ఞానము కలిగి ఉంటాడు. తనవల్ల హరి జ్ఞానామృతము విస్తృతపరచాలనే కోరిక అపారంగా కలిగి ఉంటాడు. తనను ఎంతమంది అభిమానించుచున్నారు, ఎందరు ద్వేషించుచున్నరనే విషయమును ఎంతమాత్రము పట్టించుకోడు. హరిదాసు ప్రతిరోజు ఎంతో అందంగా అలంకరించుకొని, కాళ్ళకు గజ్జెలు, నుదుట తిరునామాలు ధరించి తలపై తిరునామాలతో అలంకరించిన కలశమును పెట్టుకుని చేతిలో చిరుతలను ఆడించుచు తనకు తాను హరినామ స్మరణలో తన్మయమందుచు, చూచుటకు ఆనందము కలిగించే విధముగా విన్యాసాలు చేయుచు 'హరిలో రంగ హరి' అంటూ తాను పొందే ఆనందాన్ని మనకు ఆపాదించుటకు సర్వదా ప్రయత్నించుచుంటాడు. భూమిపై జీవించు ప్రతి మనిషికి భుక్తి అవసరము కావున ఈ హరిదాసు భుక్తిని సంపాదించుటలో హరినామ కీర్తన ఉపయోగించుట ఎంతో గొప్ప విషయము. హరిదాసును ఆదర్శంగా తీసుకొని ప్రతి మానవుడు జీవనము సాగించినచో ప్రతి వ్యక్తి ధన్యుడగుట నిస్సందేహము. హరిదాసులో ప్రతిది శుభప్రదమైన లక్షణములే ఉండును. ఉదయమే నిద్రలేచుట, స్నానాదులు ముగించి, శుచిగా అలంకరించుకొని, దైవప్రార్థనతో తన జీవనము మొదలవుతుంది. హరి భక్తులకు ఉండవలసిన అన్ని లక్షణములు ఈ హరిదాసు కలిగి ఉంటాడు. హరికి తాను సదా దాసుడననే భావమును కలిగియుండుట, స్థితప్రజ్ఞత కలిగి ఉండుట, ఎంత దొరికినా అది హరి కృపతోనే దొరికిందను భావమును కలిగియుండుట, హరికీర్తనలను, హరిబోధనలను వ్యాప్తి చేయుట, దొరికిన దానితో తృప్తి కలిగి ఉండుట మొదలగు గుణములను ప్రతివ్యక్తి వారి వారి జీవితములో అలవరచుకొనదగినవి. మానవులలో హరిదాసు ఒక విశిష్టమైన వ్యక్తిత్వం, హరి మెచ్చి, నచ్చే వ్యక్తిత్వం, జీవితం సఫలం చెందే వ్యక్తిత్వం కాబట్టి ప్రతి మనిషి హరిదాసును లక్ష్యంగా చేసుకొని జీవించుట ఉత్తమమైన జీవితం. హరి మెప్పు పొందగలిగే జీవితం.

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః |
సదా వేంకటేశం స్మరామి స్మరామి||

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. Editor: Pullagurla Saireddy: Cell : **93482 12354,** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 1 సం॥ | 250-00 |
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 3,000-00 |
| ☐ పోషకులు | 5,116-00 |
| ☐ రాజపోషకులు | 10,116-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో

చేరునట్లు ఏదేని పీఎన్బీ కాని, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________

______________________

చిరునామా:______________________

______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్:______________________

చందా వివరాలు:______________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

**చందాదారులకు స్వామివారి పవిత్ర పాదాలు (10"x8") ఉచితం**



# శ్రీ వేంకటేశ్వర స్తుతి

## 34. కన్నడ బంగాళం (తివడ)

శేషశయనా! నేమిటి వలన నీ చిత్తంబు వట్టెద
నా యాగంబులు కాంతా సంయోగంబులు
మా నియమంబులు రేపుమాపు నన్నపానంబు గొనుటలు
మా నిత్యకర్మంబులు సంసారకృత్యంబులు
మా వ్రతంబులు రాత్రుల నిద్రించుటలు
మా ధర్మంబులు శరీరభోగంబులు
మా పదములు బాల్యకౌమార యౌవనావస్థలు
మా గడనలు పుణ్యపాపంబులు
మా వేదపాఠంబు లన్యోన్యవాదధిక్కారంబులు
మా పంచయజ్ఞంబులు పంచేంద్రియ వ్యాపారంబు
లివి మా వర్తనలు నిన్ను నెంచి చూచిన సకలలోకోన్నతుండవు
నీకు నాకుం బరికించి చూచిన నంతర మహదత్తరంబు
లే గుణంబు నాలోనుండి రక్షింపుచున్నాఁడ వరుదయ్యెడిని
శ్రీవేంకటేశ్వరా!

తాత్పర్యం : నాగేంద్రశయనా! నేను దేనివలన ఏ రీతిగా నీ అనుగ్రహాన్ని సంపాదిస్తాను. భార్యతోడి సంగమాలే నా యాగాలు; రాత్రింబవళ్ళు భోజనం చేయడమే మాకు స్నానపాన శౌచ వేదభ్యాసాది నియమాలు; సంసార వ్యవహారాలే మాకు సంధ్యాజపాది హోమాది నిత్యకర్మలు; రాత్రులలో నిద్రించడమే మాకు కృచ్ఛ్రచాంద్రాయణాది వ్రతాలు; శరీర భోగాలే మాకు దమ క్షమాసత్యాది ధర్మాలు; బాల్య కౌమార యౌవన – అవస్థలే మాకున్న పదవులూ స్థానాలూ. పుణ్యపాపాలే మా సంపాదనలు. పరస్పరం వాదాలు పెట్టుకొని తిరస్కరించుకోవడాలే మాకు వేదపాఠాలు. పంచేంద్రియ వ్యాపారాలే మాకు దేవ, పితృ భూతాది పంచ యజ్ఞాలు. ఇవన్నీ మా ప్రవర్తనా విశేషాలు. ఆలోచిస్తే నీవేమో లోకాలన్నింటికీ అందనంత సమున్నతుడవు. పరిశీలిస్తే నీకూ నాకూ ఉన్నభేదాలు చాలా గొప్పవి. శ్రీవేంకటేశ్వరా! నీవు నాలోని ఏ సుగుణాన్ని చూచి, నాలో నిలిచి, నన్ను రక్షిస్తున్నావో ఆశ్చర్యంగా ఉన్నది.


తాను యాగ, నియమ, నిత్యకర్మ, వ్రత, ధర్మ వేదాభ్యాసాది వేదవిహిత ధర్మాలను నిర్వర్తించకున్నా, తనను రక్షిస్తున్న శ్రీవేంకటేశ్వరుని దయామహిమకు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నాడు పెదతిరుమలాచార్యుడు.

వ్యాఖ్యానం: డా॥ తిరుమల శ్రీనివాసాచార్య

# ముక్తిమార్గము



భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య



## లలిత

విజాతు లన్నియు – వృథా వృథా
అజామిళాదుల – కది యేజాతి? || పల్లవి ||

1. జాతిభేదములు – శరీర సుగుణములు
జాతి శరీరము – సరితోడనె చెడు,
ఆతుమ పరిశుద్ధం బెప్పుడును – అది నిర్దోషం బనాది
యీతల హరివిజ్ఞానపు దాస్యం – బిది యొక్కటె పో సుజాతి
|| విజా ||

2. హరి యిందరిలో – నంతరాత్ముఁడిదె
ధరణి జాతి భే – దము లెంచిన,
పరమయోగు లీభావ మష్టమదము – భవనికారమని మానిరి
ధరణిలోనఁ బరతత్త్వజ్ఞానము – ధర్మమూలమే సుజాతి
|| విజా ||

3. లౌకిక వైదిక – లంపటులకు నివి
కైకొను నవశ్య – కర్తవ్యంబులు,
శ్రీకాంతుఁడు శ్రీవేంకటపతి సే – సిన సంపాదన మిందరికి
మేకొని యిన్నియు మీరినవారికి – మీ నామమే సుజాతి
||విజా||



భావము : విశిష్టములైన (విభిన్నములైన) జాతులన్నియు వ్యర్థములు. వాటి వలన ప్రయోజన మిసుమంతయు లేదు. అజామిళుడు మున్నగు కులభ్రష్టులైన వారిదేమి జాతి? జాతులలో గల భేదము లన్నియు నశ్వరమైన శరీరమునకు మాత్రమే సంబంధించిన స్వభావములు. శరీరములు నశించినంతనే అవియు నశించుచున్నవి. కాని ఆత్మ మాత్రము సదా పరిశుద్ధమైనది. అది దోషము లేనిది, మరియు ఆది లేనిది. కాబట్టి దేహభావము వదలి ఆత్మ దృష్టి నలవరచుకొని ఆత్మలోని హరినెఱుంగుటకై చేయు దాస్య మొక్కటే ఉత్తమ జాతి చిహ్నమనదగి యున్నది.

అదిగో! శ్రీహరి అన్ని జీవులలో అంతరాత్ముడై యున్నాడు. ఆ పరమాత్ముని ధ్యానించు శ్రేష్ఠులైన యోగులు లోకములో జాతిభేదములను ప్రధానముగా పాటించు భావము అన్న మదము, అర్థమదము మున్నగు అష్ట మదములతో గూడిన దనియు, మాయామయమైన సంసారమునకు సంబంధించిన తిరస్కార భావమనియు నిశ్చయించి జాతి భేద దృష్టిని విడనాడిరి. కావున పరతత్త్వము నెఱుంగుట, అందుకవసరమైన ధర్మములను పాటించుట మాత్రమే ఉత్తమ జాతి లక్షణమగును.

లౌకిక కార్యములలోను, వైదికాచారములలోను తలమునకలై తపించువారికి మాత్రమే పై జాతి భేదములు తప్పక పాటింపదగినవై యున్నవి. ఇవి యన్నియు లక్ష్మీకాంతుడైన శ్రీవేంకటేశ్వరుడు తన మాయా ప్రభావముచే జీవులకు చేకూర్చి పెట్టిన సంపదలు. దేవా! యత్నపూర్వకముగా లౌకిక వైదిక కర్మకాండల నతిక్రమించి మాయను దాటి సదా మిమ్ము ధ్యానించువారికి మీ నామ సంకీర్తన మొక్కటే సుజాతి లక్షణము.

భూలోకపు కల్పవృక్షము తులసి. విష్ణువుకు ప్రీతిపాత్రమైన తులసి మహిమ అపారమైనది. హిందువుల చేత భక్తి శ్రద్ధలతో పూజలందుకుంటున్న దేవత తులసి. తులసిని స్పృశించిననూ, ధ్యానించిననూ, నామ సంకీర్తనము గావించిననూ, తులసి మొక్కను నాటిననూ, నిత్యమూ పూజా పునస్కారాలు గావించిననూ, తులసిమాత యందు అత్యంత భక్తి విశ్వాసముల కలిగి యున్ననూ యుగ కోటి సహస్రములు పుణ్యఫలములను అనుభవించెదరు. తులసి మొక్కను నాటిన తర్వాత అది శాఖోపశాఖలుగా వృద్ధి చెందినట్లు తులసిమొక్కను నాటినవారి వంశము కూడా వృద్ధి చెందడమే కాకుండా స్వర్గలోకమున కల్పాంతము వరకు సకల సుఖ సౌభాగ్యములు సంప్రాప్తించునని గర్గ సంహితలో పేర్కొనబడినది.



# తులసీ నమస్తుభ్యమ్

– చిల్లర సీతారామారావు

**శ్లో ॥ ''యదాస్పృష్టాధ వాధ్యాతా కీర్తితా నామభిః స్తుతా**
**రోపితా సించితా నిత్య పూజితా తులసీ దళైః**
**నవధా తులసీ భక్తిం యే కుర్వన్తి దినే దినే**
**యుగకోటి సహస్రాణి తేయాంతి సుకృతంశుభే!''**

శ్రీరాముడు రాక్షస సంహార నిమిత్తము సరయూ నదీ తీరాన తులసిమొక్కను నాటాడు. సీతాదేవి అశోకవనములో ఉన్నప్పుడు తులసిని ధ్యానించింది. తత్ఫలితముగా సీతాదేవి శ్రీరాముడిని చేరుకోగలిగింది. పార్వతీదేవి కూడా తన మనోభీష్టాలను నెరవేర్చుకోవడానికి తులసి మొక్కను హిమాలయ పర్వత ప్రాంతమున నాటింది. దేవాంగనలు, కిన్నరులు మున్నగు వారు తమ దుస్స్వప్న నివారణార్థము నందనవనమున తులసి మొక్కను నాటారు. దండకారణ్యమున శ్రీరాముడు హిత సాధన కొరకు తులసి మొక్కను నాటగా సీతాదేవి, లక్ష్మణుడు దానిని భక్తి శ్రద్ధలతో పెంచారు. శాస్త్రాలు గంగాదేవిని త్రిభువన వ్యాపిని అని కీర్తించాయి. అదేవిధముగా తులసి కూడా సంపూర్ణ చరాచర జగత్తునందు దృష్టి గోచరమవుతుంది. తులసిని ఆరాధించినవారి సమస్త పాతకములు తొలగిపోతాయి. తులసీదళము నుండి జాలువారు నీటి బిందువులను శిరస్సు మీద ధరించిన వారికి గంగాస్నానము, గోదానము యొక్క ఫలము ప్రాప్తిస్తుంది. ద్వాదశి నాటి రాత్రి జాగరణ చేసి తులసి స్తోత్రమును పఠించినవారి ముప్పది రెండు అపరాధములను

విష్ణువు క్షమిస్తాడు.

**శ్లో || ''యాదృష్టా నిఖిలాఘు సంఘశమనీ స్పృష్టావ పుష్పావనీ**
**రోగాణామభివందితా నిరసనీ సిక్తాన్త కత్రాసినీ**
**ప్రత్యాసత్తి విధాయినీ భగవతః కృష్ణస్య సంశోపితా**
**న్యస్తా తచ్చరణే విముక్తి ఫలదా తస్యై తులస్యై నమః''**

దర్శించినంతమాత్రముననే సమస్త పాప సముదాయమును నాశనము నొనరించునది; స్పృశించినంత మాత్రముననే శరీరమును పవిత్రము గావించునది, వందనమాచరించగానే రోగనివారణ గావించునది, నీటితో తడపగానే యమధర్మరాజుకు భయము కలిగించునది, నాటగానే శ్రీకృష్ణుని సమీపమునకు తీసుకొని పోవునది, భగవంతుడి పాదములపై పెట్టగానే మోక్షమును ప్రసాదించు చల్లని తల్లి తులసీ మాతకు వందనము. తులసి మాతకు ఎనిమిది నామములు ఉన్నాయని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

**శ్లో || ''వృందా వృందావనీ విశ్వపూజితా విశ్వపావనీ**
**పుష్పసారా నందినీ చ తులసీ కృష్ణజీవనీ''**

బృంద, బృందావని, విశ్వపూజిత, విశ్వపావని, పుష్పసార, నందిని, తులసి, కృష్ణజీవని అని తులసి అష్టనామములు.

తులసికి గుబురుగా వృద్ధి చెందు స్వభావము ఉండుట వలన బృందయని, మహారణ్యములాగా పెరుగు స్వభావము కలిగి యుండుట వలన బృందావనమని, పూర్వము దివ్యులకు దర్శనభాగ్యము కలిగించినందువలన బృందావనమని, బ్రహ్మాండములన్నిట పూజింపబడుతున్నది కావున విశ్వపూజితయని, పాపులను శుచులను గావించు గుణము గలది కావున విశ్వపావని యని, హరిని పూజించు పుష్పములందు అత్యంత ప్రాముఖ్యత కలిగి యున్నందున పుష్పసార యని, తులసి లభించగానే భక్తులకు అపరితమైన ఆనందము లభించును కావున నందిని యని, కృష్ణునకు ప్రాణాధికురాలు గావున కృష్ణజీవని యను పేర్లతో ప్రఖ్యాతి గాంచిన తులసి యొక్క సార్థకములైన ఈ అష్టనామావళిని స్మరించినవారికి సమస్త పాపములు తొలగుటయే కాక సకలైశ్వర్యములు సంప్రాప్తిస్తాయి. సర్వదా శుభమే కలుగుతుంది. అశ్వమేధ యజ్ఞ ఫలము చేకూరుతుంది.

తులసి గృహ దేవతగా ఆరాధింపబడుతున్నది. ఇంటి ఆవరణలో ముందు భాగమున గాని, వెనుక భాగమున గాని తులసి కోటను నిర్మించి అందులో తులసి మొక్కను నాటుతారు. ప్రతిరోజు ఆ మొక్కకు నీళ్ళు పోస్తారు. అది చక్కగా పెరుగుతూ ఉంటుంది. ప్రాతఃకాలముననే లేచి తులసి దర్శనము చేసుకొని, స్నానానంతరము పూజలు ప్రదక్షిణాలు మున్నగు కార్యక్రమాలు చేస్తుంటారు. సంధ్యా సమయపు వేళ దీపము వెలిగించి ప్రదక్షిణలు చేస్తారు. తులసి ఉన్న లోగిళ్ళు సుఖశాంతులతో పిల్లా పాపలతో కళకళ లాడుతుంటాయని భక్తుల విశ్వాసము.

తులసి ఆవిర్భావానికి సంబంధించిన కథలు వివిధ పురాణాల్లో వర్ణించబడ్డాయి. ''పీయూష జాహి తులసి, దేవ దేవ నమస్కృతా'' అని పద్మపురాణము పేర్కొన్నది. తులసి అమృతము నుండి పుట్టినది. దేవ దానవులు క్షీర సాగరము మథించగా అందుండి అమృతము పుట్టినది. అమృతమును చూచిన విష్ణువుకు ఆనందముతో నేత్రముల నుండి ఆనంద బాష్పములు వెలువడి అమృతము నందు పడినవి. వెంటనే తులసి ఆవిర్భవించింది. విష్ణువు లక్ష్మీదేవి, కౌస్తుభములతో పాటు తులసిని కూడా స్వీకరించి ఆపాదమస్తకము ధరించాడు. అమృతము నుండి పుట్టిన తులసి అన్ని పూజలకు పనికివస్తుంది. కాని వినాయకుడి పూజకు మాత్రము పనికిరాదు. దీనికి సంబంధించిన కథ బ్రహ్మవైవర్త పురాణము నందు ఉన్నది.

తులసి శ్రీమన్నారాయణుడిని స్మరించుకుంటూ తీర్థయాత్రలు చేస్తూ గంగానదీ తీరమున తపస్సు చేసుకుంటున్న వినాయకుడిని చూసింది. అతడి సౌందర్యానికి ఆకర్షితురాలైన తులసి వినాయకుడినే భర్తగా చేసుకోవాలనుకున్నది. అతడి దగ్గరకు పోయి పలకరించింది. ధ్యానములో లీనమైపోయిన వినాయకుడు స్పందించలేదు. చల్లని నీరు అతడి మీద చిలకరించింది తులసి. ఆ నీటి స్పర్శకు ధ్యానభంగమై కనులు విప్పి చూడగా ఎదురుగా తులసి కన్పించింది. ఆమెను ఎవరు నీవు? నీవు నా ధ్యానమును ఎందుకు భగ్నము కావించావు? అలా చేస్తే పాపము కలుగుతుందని తెలియదా? అయిననూ నీకు అశుభము కలగరాదని భగవంతుని ప్రార్థిస్తున్నాను అని పలికాడు వినాయకుడు. తులసి చిరునవ్వు నవ్వుతూ – నీ సౌందర్యానికి ముగ్ధురాలిని అయినాను. నిన్ను భర్తగా పొందాలనుకుంటున్నాను. అందుకే నీ ధ్యానమునకు భంగము కలిగించినాను. నా పేరు తులసి. నేను ధర్మధ్వజుడి కుమార్తెను. తమరు అనుగ్రహించి నాకు భర్తగా రమ్మని ఆహ్వానిస్తున్నాను అని పలికింది. వినాయకుడు హరిని స్మరించుకుంటూ తల్లీ! నాకు వివాహము మీద ఎటువంటి ఆసక్తీ లేదు. అన్ని అనర్థాలకు మూలం వివాహం. సమస్త దుఃఖాలకు ఆలవాలము వివాహము. అది తపస్సును సర్వనాశనము గావిస్తుంది. హరిభక్తికి దూరము గావిస్తుంది. కనుక భయంకరమైన ఈ వివాహ నరకమునకు నన్ను



ఆహ్వానించకుండా నీకు తగినవాడిని వేరొకరిని చూచుకొని వివాహము చేసుకొనుము అని పలికాడు. వినాయకుడి మాటలకు తులసి మనోవేదనకు గురై దుఃఖిస్తూ 'నీ భార్య అసాధ్వి అవుతుంది' అని శపించింది. తులసి శాపమునకు ప్రతి శాపమిస్తూ వినాయకుడు ఇలా అన్నాడు. దేవీ! నీవు అసురగ్రస్తురాలవు అవుతావు. తరువాత గొప్పవారి శాపము వలన నీవు చెట్టువైపోతావు. శాపమును విన్న తులసి రోదిస్తూ వినాయకుని ప్రార్థించింది. వినాయకుడు ప్రసన్నుడై "తులసీ! నీవు పుష్పాలలో సారభూతురాలవవుతావు. ఒక కళాంశముతో విష్ణువుకు ప్రియమైన దానివి అవుతావు. నిన్ను పూజించిన వారికి ముక్తిని ప్రసాదిస్తావు. కాని వినాయక వ్రతమున జరుగు పూజకు తప్ప మిగతా రోజులలో నీవు నా పూజకు పనికిరావు" అని పలికి తపస్సు చేసుకోవడానికి బదరి సన్నిధికి వెళ్ళిపోయాడు.

తులసి వనమున్న వారి ఇల్లు పుణ్య తీర్థముతో సమానము. తులసిని మించిన పవిత్రమైనే చెట్టు మరొకటి లేదు. తులసి చెట్టు మీద సకల దేవతలు నివాసముంటారు. మూల భాగమున అనగా వ్రేళ్ళయందు సర్వ తీర్థములు, మధ్య భాగమున సర్వదేవతలు, చివరి భాగమున అనగా అగ్రభాగమున సర్వవేదములు ఉన్నాయని ఒక ప్రసిద్ధమైన శ్లోకము ద్వారా తెలియుచున్నది.

**శ్లో ॥ "యన్మూలే సర్వతీర్థాని యన్మధ్యే సర్వదేవతా**
**య దగ్రే సర్వ వేదాంశ్చ తులసీంత్వాం నమామ్యహమ్"**

హిందువులొనరించు పూజలలో తులసికి అత్యంత ప్రాధాన్యమున్నది. తులసీదళాలతో హనుమంతుడిని పూజిస్తే సకల మనోభీష్టాలు నెరవేరుతాయి. దేవాలయాలలో కూడా భక్తులకు ఇచ్చే తీర్థమునందు తులసీదళములను వేసి తులసి తీర్థం శుభం పావనం అని పూజారులు భక్తులకు తీర్థాన్ని ఇస్తూ ఉంటారు. పవిత్రమైన తులసీ దళాలను పూజ కొరకు కోయునప్పుడు తప్పనిసరిగా స్నానమాచరించి శుచులు కావాలి. తులసీ దళాలను కోయునప్పుడు ఈ క్రింది మంత్రాలను చదువుతూ కోయాలి.

**శ్లో ॥ "తులస్యమృత జన్మాని సదాత్వం కేశవప్రియే**
**కేశవార్థం లునామిత్వా వరదాభవ శోభనే"**

ఓ తులసిమాతా! నీవు అమృతము నుండి పుట్టినదానవు. కేశవునకు ప్రియురాలవు. శ్రీమన్నారాయణుని పూజ నిమిత్తము నీ దళములను కోయుచున్నాను. నా తప్పును క్షమించి నన్ను అనుగ్రహించుము.

**శ్లో ॥ "మోక్షైక హేతోర్ధరిణి ప్రసూతే, విష్ణో స్సమస్తగురోః ప్రియేతే**
**ఆరాధనార్థం పురుషోత్తమస్య, లునామిపత్రం తులసీ క్షమస్వ"**

మోక్షమును ప్రసాదించుటకు అవతరించిన తులసీమాతా! పురుషోత్తముడి పూజ కొరకు పవిత్రమైన నీ దళములను కోయుచున్నాను. నా అపరాధమును మన్నించి నన్ను అనుగ్రహించుము.

**శ్లో ॥ "ప్రసీద మమ దేవేశి ప్రసీద హరివల్లభే**
**క్షీరోద మదనోద్భూతే తులసిత్వం ప్రసీదయే"**

క్షీరసాగర మథన సమయమున అవతరించిన తులసిమాతా! శ్రీహరి పూజ నిమిత్తము నీ దళములను కోయుచున్నాను. నన్ను క్షమించి నన్ను అనుగ్రహించుము.

తులసీ దళములను కోయడానికి కూడా కొన్ని నియమాలు ఏర్పాటు చేశారు పెద్దలు. మంగళ, శుక్ర, రవి వారములందు, ద్వాదశి, అమావాస్య, పూర్ణిమ – ఈ మూడు తిథులయందు, సూర్యాస్తమయము, చంద్రాస్తమయములందు, రాత్రి సమయములందు, జనన, మరణ శౌచములందు తులసీదళములను కోయుట మహాపరాధము. తులసీ దళము లేకుండా భగవంతుడి పూజ పూర్తి కాదు కనుక నిషిద్ధ సమయములలో తులసి మొక్కనుండి రాలిన దళములను ఏరుకొని పూజ కొరకు ఉపయోగించాలి. పాతనీరు, వాడిన పూలు పూజకు పనికిరావు. కాని గంగాజలము, తులసిదళాలు వాడిననూ పూజకు పనికివస్తాయి.

**శ్లో ॥ "వర్జ్యం పర్యుషితం పుష్పం వర్జ్యం పర్యుషితం జలమ్**
**నవర్జ్యం తులసీపత్రి నవర్జ్యం జాహ్నవీజలమ్"**

పూజ నిమిత్తము కోసిన దళములను పది రోజుల వరకు ఉపయోగించుకోవచ్చును.

తులసి ఆరోగ్య ప్రదాయిని. తులసి ఉన్నచోటకు యమదూతలు రారు. క్షుద్రశక్తుల ప్రయోగాలు పనిచేయవు.

పాములు, తేళ్ళు వంటి విషప్రాణులు రావు.

వైద్యపరముగాను తులసికి అత్యంత ప్రాధాన్యత ఉంది. కృష్ణతులసితో బొల్లివంటి చర్మవ్యాధులు అరికట్టవచ్చునని అధర్వణ వేదములో చెప్పబడింది. తులసి ఉన్నచోట్ల మలేరియా దోమలు రావు. కలుషిత వాయువు శుద్ధి చేసే గుణం తులసికి ఉంది. లక్ష్మితులసి దళ రసము లేక కషాయము కొద్దిగా చేదుగా, కారముగా ఉంటుంది. ఉష్ణము చేస్తుంది. జ్వరము, కఫము, వాతము, శ్లేష్మము, దగ్గు, క్రిమివ్యాధి మున్నగువాటిని పోగొట్టుతుంది. రుచిని పుట్టిస్తుంది. త్రిదోషములను హరించి ఆరోగ్యమును ప్రసాదిస్తుంది అని వస్తుగుణ ప్రకాశికలో తులసిని గురించిన వర్ణించడం జరిగింది. మరణాసన్న సమయములో తులసి తీర్థమును పుచ్చుకొనినవారు అన్ని పాపములనుండి విముక్తులై భగవస్సాన్నిధ్యమును చేరుకుంటారని ప్రజల విశ్వాసము. ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధులు తులసి ద్వారానే సంక్రమిస్తాయని శతానందుడు అను మునిపుంగవుడు నుడివినాడు.

తులసి ఒక రాక్షసుడిని వివాహమాడటం, తర్వాత వృక్షముగా మారిపోవటం, త్రిలోకముల చేత ఆరాధింపబడటం మున్నగు విషయాలకు సంబంధించి వివిధ పురాణాలు వివిధ రకాలుగా వర్ణించాయి. ఎక్కువగా ప్రాచుర్యాన్ని పొందిన ఒక కథ తులసికి సంబంధించింది ఇలా ఉంది.

తులసి గోలోకమున ఒక గోపిక. శ్రీకృష్ణుని ప్రియురాలు. శ్రీకృష్ణ గోపికల సాన్నిధ్యాన్ని, అనురాగాన్ని సహించలేని రాధ తులసిని భూలోకములో జన్మించమని శపించింది. అదే గోలోకములో సుదాముడు అనే గోప బాలకుడున్నాడు. అతడు తన చెలికత్తెలకు ఆగ్రహం తెప్పించాడని రాధ అతడిని భూలోకమున జన్మించమని శపించింది. రాధ శాపము ననుసరించి తులసి భూలోకమున ధర్మధ్వజుడు మాధవి అనే దంపతులకు కూతురిగా జన్మించింది. ఆమెకు తులసి అని నామకరణము గావించారు తల్లితండ్రులు. తులసి విష్ణువు పతిగా కావాలని అభిలషించింది. అందు నిమిత్తము బ్రహ్మను గురించి తపస్సు చేసింది. ఆమె తపస్సుకు ప్రసన్నుడైన బ్రహ్మ తులసి కోర్కెను విని ఇలా అన్నాడు. నీ కోర్కె ఈ జన్మలో నెరవేరదు. మరుసటి జన్మలో నీ కోర్కె నెరవేరుతుంది. శ్రీకృష్ణుని అంశచే అసుర వంశమున జన్మించిన శంఖచూడుడితో నీ వివాహము జరుగుతుంది. బ్రహ్మదేవుడి ప్రేరణతో తులసి వివాహము శంఖచూడుడితో జరుగుతుంది. శ్రీకృష్ణుడి అంశ వలన జన్మించిన శంఖచూడుడు బ్రహ్మను గురించి తపస్సు గావించి తులసి పతివ్రతగా ఉన్నంత కాలం శంఖచూడునకు మరణము సంభవించదు అన్న వరమును పొందాడు. బ్రహ్మ చేత వరము పొందిన శంఖచూడుడు వరగర్వితుడై దేవతలను గడ గడ లాడించసాగాడు. దేవతలు భయపడి శివుని దగ్గరకు వెళ్ళి తమను ఆ అసురుడి నుండి రక్షించవలసినదిగా ప్రార్థించారు. శివుడు వారికి అభయమిచ్చి శంఖచూడుడితో యుద్ధము చేయసాగాడు. తులసి పాతివ్రత్య మహిమ కారణము చేత మరణం శంఖచూడుడి దరిదాపులకు రావడము లేదు. తులసి పాతివ్రత్య భంగము ద్వారానే శంఖచూడుడి మరణం సంభవిస్తుందని తెలుసుకున్న విష్ణువు శంఖచూడుడి రూపములో వెళ్ళి తులసిని కలిశాడు. శంఖచూడుడు విజయంతో తిరిగి వచ్చాడన్న సంతోషముతో మారువేషమున ఉన్న విష్ణువును కలిసింది. కాని వచ్చినవాడు భర్త శంఖచూడుడు కాదని తెలుసుకున్న తులసి విష్ణువును శపించింది. తులసి శాపకారణముగా విష్ణువు ఒక రాయిగా మారిపోయాడు. దానినే సాలగ్రామము అంటారు. తులసి పాతివ్రత్య భంగము కారణముగా శంఖచూడుడు శివుడి చేతిలో హతమైనాడు. తనని శపించిన తులసితో విష్ణువు ఇలా అన్నాడు. తులసీ! నీవు నాకోసం తపస్సు చేశావు. ఈ శరీరాన్ని త్యజించు. త్యజించిన నీ శరీరం గండకీ నదిగా మారిపోతుంది. నీ కేశాలు తులసీదళాలుగా మారి నాకు ప్రీతికరములు అవుతాయి. నేను ఆ గండకీ నదీ తీరమున సాలగ్రామమునై అవతరిస్తాను. జనులకు ఆరాధ్యుడిని అవుతాను అని విష్ణువు తులసిని అనుగ్రహించాడు. తులసి భక్తి ప్రపత్తులతో శ్రీమన్నారాయణునకు నమస్కరించింది. మరుక్షణం ఆమె శరీరం నదిగా మారిపోయింది. గండకీ నదీతీరాన వెలసిన తులసి వృక్షమై తులసీమాతగా ఇంటింటా వెలసింది.

**శ్లో ॥ ''ధ్యాయేచ్చ తులసీ దేవీం, శ్యామాం కమల లోచనాం**
**ప్రసన్నాం పద్మవదనాం వరాభయ చతుర్భుజాం**
**కిరీట హార కేయూర కుండలాది విభూషణాం**
**ధవళాంకుశ సంయుక్తాం పద్మాసన విషేవితాం**
**ప్రియాంచ సర్వదా విష్ణో స్సర్వదేవ నమస్కృతామ్''**

తామర వంటి కన్నుల కలది, పద్మము వంటి మొగము గలది, వరముద్ర, అభయముద్, తెల్లని అంకుశము తాల్చిన నాలుగు భుజములు కలది, సర్వదేవతలచే నమస్కరింపబడునది, కిరీటము, కంఠహారము, భుజకీర్తులు, కుండలములు మున్నగు ఆభరణములు తాల్చినది, సర్వదా ప్రసన్న వదనము గలది, విష్ణు దేవునకు ప్రియురాలునగు తులసీదేవికి ప్రణామము.

(ఫిబ్రవరి 8 రథసప్తమి సందర్భంగా)



# నెలకో సూర్యుడు

- డా. ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు

**సకల జీవరాశులకు చైతన్య ప్రదాత –**
**ప్రతిరోజు మన కళ్ళ ఎదుట సాక్షాత్కరిస్తున్న ప్రత్యక్ష దైవం -**
**ఈ జగత్తు అంతటికీ ఆత్మ- సూర్యుడు!**
**కాంతిని, శక్తిని ప్రసాదించే కాలచక్ర నిర్వహణ చేస్తున్న సర్వదేవతా మయుడైన సూర్యభగవానుడు ఈ చరాచర ప్రకృతిని, అందులోని జీవరాశులకు చైతన్యాన్ని ఆరోగ్యాన్ని ప్రసాదించే ప్రత్యక్ష నారాయణుడు! సూర్యుడు లేని ఈ లోకాన్ని ఊహించడం కష్టం. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల వారికి వివిధ జాతుల వారికి ఎవరి దేవతలు వారికి ఉన్నప్పటికీ అనాది నుంచి అందరిచే కొలువబడుతున్న దైవం -సూర్య భగవానుడు. అందుకే ఈ ప్రపంచానికి సూర్యుడు నేత్రం. సూర్యుడు- జగచ్ఛక్షువు. అటువంటి శ్రీ సూర్యభగవానుడు ద్వాదశాత్ముడు.**

సూర్యుడు ఒక్కోనెలలో ఒక్కో పేరుతొ సంచరిస్తూ ఉంటాడు. సూర్యుడుపన్నెండు నెలల్లో పన్నెండు పేర్లతో పన్నెండు రూపాలలో సంచరిస్తూ ఉండడం వల్ల సూర్యభగవానునికి ద్వాదశాత్ముడు అని పేరు వచ్చింది. సూర్యుడితో పాటు ఋషులు, గంధర్వులు, అప్సరసలు, నాగులు, యక్షులు, రాక్షసులు కూడా సూర్యుడితో పాటు సంచరిస్తూ ఉంటారు. 12 నెలలలోనూ సూర్యుడిని ఒక్కొక్క నెలలో ఒక్కొక్క మంత్రంతో ఆరాధిస్తూ నైవేద్యాలు సమర్పించడం వల్ల విశేషమైన ఫలితాలు కలుగుతాయని శాస్త్రవచనం.

**చైత్రమాసం - ధాత**


చైత్రమాసంలో సూర్యభగవానునికి ధాత అని పేరు. పులస్త్యఋషి, తుంబురగంధర్వుడు, కృతస్థలి అప్సరస, వాసుకిసర్పం, రథకృతయక్షుడు, హేతిరాక్షసుడు చైత్రమాసంలో సూర్యుడి వెంట ఉంటారు. చైత్ర మాసంలో సూర్యుడు రక్త వర్ణంతో ఎనిమిదివేల కిరణములతో ప్రకాశిస్తూ ఉంటాడు. ధాత అంటే బ్రహ్మ. ధాతను చైత్రమాసం లోని ఆదివారాల్లో భానవే నమః అనే మంత్రాన్ని పఠిస్తూ పూజించి నెయ్యి, పూరీలు, దానిమ్మ పండ్లను నైవేద్యంగా సమర్పించి కేవలం పాలను మాత్రమే స్వీకరించి ఉపవాసం ఉండడం వల్ల సూర్యభగవానుని అనుగ్రహం కలిగి ఆరోగ్యాభివృద్ధి కలుగుతుంది.

**వైశాఖమాసం - ఆర్యమా**

వైశాఖమాసంలో సూర్యుడికి ఆర్యమా అని పేరు. పులహమహర్షి, నారద గంధర్వుడు, పుంజికస్థల అప్సరస, కచ్ఛవీర సర్పము, ఉర్జ యక్షుడు,ప్రహేతి రాక్షసుడు వైశాఖమాసంలో సూర్యుడి వెంట ఉంటారు. పీతవర్ణంతో పదివేల కిరణాలతో ప్రకాశిస్తూ వాయు రూపంలో తన ప్రభావాన్ని చూపిస్తూ ఉంటాడు. ఆర్యమా పితృ దేవతలకు అధిపతి. వైశాఖమాసంలో ఆర్యమా సూర్యుడిని ఆదివారం రోజున తపనాయ నమః అనే మంత్రంతో పూజించాలి. మినుములు, ద్రాక్ష నెయ్యిలను నైవేద్యంగా సమర్పించి బ్రాహ్మణులకు భోజనం పెట్టి దక్షిణ తాంబూలాలను ఇవ్వడం వల్ల పితృ దేవతల ద్వారా సంక్రమించిన వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

**జ్యేష్ఠ మాసం – మిత్ర**

జ్యేష్ఠ మాసంలో సూర్యునికి మిత్ర అని పేరు. ఈ మాసంలో సూర్యుడు వెంట అత్రిమహర్షి, ఆహా గంధర్వుడు, మేనక అప్సరస, తక్షకసర్పం, రథస్వుడు అనే యక్షుడు పౌరుషేయ రాక్షసుడు వెంట ఉంటారు. మిత్ర నామధేయం కలిగిన సూర్యుడు అరుణ వర్ణాన్ని కలిగి ఏడువేల కిరణాలతో ప్రకాశిస్తూ ఉంటాడు. జ్యేష్ఠ మాసంలోని ఆదివారాలలో మిత్రాయ నమః అనే మంత్రంతో సూర్యున్ని ఆరాధించి పేలపిండి, పెరుగు, గోధుమలను నైవేద్యంగా సమర్పించి పండితుడికి బియ్యం, పెరుగు, మామిడి పండ్లను తాంబూలంలో ఉంచి ఇవ్వడం వల్ల కుష్టు వ్యాధి వంటి రోగాలు నశించి ఆరోగ్యం చేకూరుతుంది.



**ఆషాఢమాసం - వరుణ**

ఆషాడ మాసంలో సూర్యభగవానునికి వరుణ అని పేరు వశిష్ఠమహర్షి, ఊహూ అనే గంధర్వుడు, రంభ అప్సరస, సాహజన్య సర్పం, చిత్రస్వననాయ అనే యక్షుడు, శకుడనే రాక్షసుడు సూర్యుని వెంట సంచరిస్తూ ఉంటారు. శ్యామవర్ణంతో వరుణ ఐదువేల కిరణాలతో ప్రకాశిస్తూ ఉంటాడు. జలానికి అధిపతి. ఆషాడ మాసంలోని ఆదివారాలలో రవయే నమః అనే మంత్రంతో పూజించి జాపత్రితో కూడిన అర్ఘ్యాన్ని ఇవ్వవలెను. పండితుడికి భోజనంపెట్టి దక్షిణ తాంబూలాలను ఇవ్వడం వల్ల శత్రువుల భయం తొలగి పోయి కోరిన కోరికలు నెరవేరుతాయి. దారిద్ర్యం నశించి పుత్ర సంతానం కలుగుతుంది.

**శ్రావణమాసం - ఇంద్ర**

సూర్యభగవానునికి శ్రావణమాసంలో ఇంద్ర అని పేరు. అంగీరస మహర్షి, విశ్వవసుడు అనే గంధర్వుడు, ప్రమ్లోచ అప్సరస, ఎలాపుత్ర సర్పం, శ్రోత అనే యక్షుడు, శర్య అనే రాక్షసుడు సూర్యుడి వెంట సంచరిస్తూ ఉంటారు. ఇంద్ర సూర్యుడు శ్వేత వర్ణాన్ని కలిగి ఏడువేల కిరణాలతో వెలుగొందుతూ ఉంటాడు. ఇంద్ర సూర్యుని వల్లనే ఆయుర్వేద దేవుడైన ధన్వంతరి కి ఆయుర్వేద జ్ఞానం కలిగిందని పురాణవచనం. ఇంద్రాయ నమః అనే మంత్రాన్ని పఠించి సూర్యుడికి అర్ఘ్యం ఇవ్వడంతోపాటు గభస్తేయ నమః అనే మంత్రాన్ని పఠించి గన్నేరు, మందారం వంటి ఎరుపురంగు పూలతో పూజించి పాయసం, పేలపిండి, పూరీలను నైవేద్యంగా సమర్పించవలెను. ఈ మాసంలో ఇంద్ర సూర్యుని ఆరాధించడం వల్ల విద్యాభివృద్ధి జరుగుతుంది. సకల ఐశ్వర్యాలు కలుగుతాయి.

**భాద్రపదమాసం – వివస్వంతుడు**

భాద్రపద మాసంలో సూర్యునికి వివస్వంతుడు అని పేరు. ఈ మాసంలో సూర్యుడితో పాటు భృగుమహర్షి, ఉగ్రసేన అనే గంధర్వుడు, అనుమ్లోచ అప్సరస, శంఖపాల సర్పం, అసారణ అనే యక్షుడు, వ్యాఘ్ర అనే రాక్షసుడు సంచరిస్తూ ఉంటారు. పసుపు వర్ణంతో పదివేల కిరణాలతో తేజోవంతంగా ఉండే వివస్వంతుడు జఠరాగ్ని రూపంలో ఉంటాడు. ఈ మాసంలో ఆదివారం నాడు

యమాయ నమః అనే మంత్రంతో పూజించి నెయ్యి, గుమ్మడి కాయలను నైవేద్యంగా సమర్పించడం వల్ల బుద్ధివికాసం కలుగుతుంది. కీర్తి ప్రతిష్టలు కలుగుతాయి.

**ఆశ్వీయుజమాసం - పుషా**

ఆశ్వీయుజ మాసంలో సూర్యుడు పుషా పేరుతో గౌతమమహర్షి, సురుచి అనే గంధర్వుడు, ఘ్రుతాచి అప్సరస, ధనుంజయ సర్పం, సుషేణ యక్షుడు, ధాతా రాక్షసుడులను వెంటపెట్టుకుని సంచరిస్తూ ఉంటాడు. పుషా సూర్యుడు లక్క వర్ణంలో ఆరువేల కిరణాలతో వెలుగొందుతూ ఉంటాడు. ఈ నెలలో సూర్యుడు ఆహారంలో ఉండి పుష్టిని కలిగిస్తాడు. పుషా సూర్యుణ్ణి హిరణ్య రేతసేయ నమః అనే మంత్రంతో పూజించి చక్కెర, చక్కెర పొంగలి, దానిమ్మపండ్లను నివేదనగా సమర్పించి పండితుడికి భోజనం పెట్టి పంచదార, బియ్యం దానం చేయడం వల్ల సిరిసంపదలతో పాటు పాడిపంటలు సమృద్ధిగా వృద్ధిచెందుతాయి.

**కార్తీకమాసం - పర్జన్య**

కార్తీకమాసంలో సూర్యభగవానునికి పర్జన్య అని పేరు. ఈ మాసంలో సూర్యభగవానుని వెంట భరద్వాజమహర్షి,వర్చా గంధర్వుడు, రంభ అప్సరస, ఐరావత సర్పము, సేనాజిత్ అనే యక్షుడు, విశ్వా రాక్షసుడు సంచరిస్తూ ఉంటారు. ఈ మాసంలో అరుణవర్ణంతో తొమ్మిదివేల కిరణాలతో ప్రకాశిస్తూ ఉండే పర్జన్య సూర్యుడిని ఆదివారాలలో శ్రీ విష్ణవే నమః అనే మంత్రంతో పూజించడంతో పాటు బెల్లం బియ్యంతో చేసిన పరమాన్నం, చెరుకు రసాలను నైవేద్యంగా సమర్పించడంవల్ల సర్వ యజ్ఞ యాగాలు చేసిన ఫలం కలుగుతుంది.

**మార్గశిరమాసం- అంశుమంతుడు**

మార్గశిర మాసంలో సూర్యభగవానునికి అంశుమంతుడు అని పేరు. కశ్యపమహర్షి, ఋతుసేనుడు అనే గంధర్వుడు, ఊర్వశి అప్సరస, మహాశంఖ సర్పం, తార్క్ష్య అనే యక్షుడు, విద్యుచ్ఛత్రుడు అనే రాక్షసుడు సూర్యుడి వెంట ఉంటారు. ఆకుపచ్చ వర్ణంలో తొమ్మిది వేల కిరణాలతో ప్రకాశిస్తూ ఉండే అంశుమంతుడు వాయువు లో ఉంటాడు. అంశు అంటే రశ్మి అని అర్థం. ఈ మాసంలో చలికాలంలోని శీతల గాలుల నుంచి తప్పుకునేందుకు వేడిని ప్రసాదిస్తూ రక్షిస్తూ వుండే అంశుమంతుడు అనే సూర్యుడిని ఈ నెలలోని ఆదివారాల్లో ఓం సూర్య నారాయణాయ నమః అనే మంత్రాన్ని పఠించి ఎర్రని పూలతో పూజించి నెయ్యి, బెల్లం, బియ్యంతో వండిన పాయసాన్ని, కొబ్బరికాయను నైవేద్యంగా సమర్పించడం వల్ల సకల శుభాలు కలుగుతాయి.

**పుష్యమాసం – భగ**

పుష్యమాసంలో సూర్యభగవానుడు భగ అనే పేరుతో సంచరిస్తూ ఉంటాడు. అరిష్టనేమి అనే ఋషి, ఊర్ల అనే గంధర్వుడు, పుర్వచిత్తి అప్సరస ,కర్కోటక సర్పం, ఆయువు అనే యక్షుడు, స్ఫూర్జ రాక్షసుడు సూర్యుని వెంట పుష్యమాసంలో సంచరిస్తూ ఉంటారు. సంపూర్ణ ఐశ్వర్యం, ధర్మం, యశస్సు, శ్రీ, జ్ఞానం, వైరాగ్యం వంటి వాటిని కలిగి పదకొండు వేల కిరణాలతో ప్రకాశిస్తూ ఉంటాడు. ఈ మాసంలోని సూర్యుడిని ఆదివారాలలో విష్ణవే నమః అనే మంత్రాన్ని పఠించి పూజించి దానిమ్మపండ్లు, నువ్వులు బియ్యం కలిపిన వంటకాన్ని నైవేద్యంగా సమర్పించాలి. ఈ మాసంలో ఆదిత్య హృదయం చదవడం వల్ల సకల ఐశ్వర్యాలు కలుగుతాయి ఈ విధంగా ఈ మాసంలో సూర్యారాధన చేయడం వల్ల ఐశ్వర్యం కలుగుతుంది.

**మాఘమాసం - త్వష్టా**

మాఘ మాసంలో సూర్యభగవానుడికి త్వష్టా అని పేరు. సూర్యుడి వెంట బ్రహ్మరాత మహర్షి, ధృతరాష్ట్ర అనే గంధర్వుడు, ఊర్వశి అప్సరస, కంబల సర్పము, శత్ జిత్ యక్షుడు, ఋచీకుడు అనే రాక్షసుడు సంచరిస్తూ ఉంటారు. ఈ మాసంలో చిత్రవర్ణంలో తొమ్మిది వేల కిరణాలతో ప్రకాశిస్తూ ఉండే సూర్యుడిని శివాయ నమః అనే మంత్రం తో పూజించి నిమ్మకాయలు, పండ్లను నైవేద్యంగా సమర్పించాలి ఈ మాసంలో త్వష్టా సూర్యుడు వృక్షాలలో, వివిధ ఔషధాలలో ఉండి ప్రజలను రక్షిస్తూ ఉంటాడు. త్వష్టా సూర్యభగవానుని పూజించడంవల్ల అన్నింటా విజయం సాధించడంతో పాటు ఆయురారోగ్యాలు వృద్ధిచెందుతాయి.

**ఫాల్గుణమాసం - విష్ణు**

ఫాల్గుణ మాసంలో సూర్య భగవానుడికి విష్ణు అని పేరు. విశ్వామిత్ర మహర్షి, సూర్యవర్చా అనే గంధర్వుడు, రంభ అప్సరస, అశ్వతర సర్పం, సర్వజిత్ యక్షుడు, మహాప్రేత రాక్షసుడు సంచరిస్తూ ఉంటారు. అరుణ వర్ణంతో విష్ణు సూర్యుడు ఆరువేల కిరణాలతో వెలుగొందుతూ ఈ సృష్టిలోని సమస్త జీవరాశులకు రక్షణ కల్పిస్తూ ఉంటాడు. ఈ మాసం లోని ఆదివారాలు సూర్య భగవానుడిని శ్రీ విష్ణవే నమః అనే మంత్రాన్ని పఠించి పూజించడంతో పాటు పాయసం, చక్కెర పొంగలిని నైవేద్యంగా సమర్పించడంవల్ల వంశాభివృద్ధి జరుగుతుంది.

ఇలా ప్రత్యక్ష భగవానుడైన సూర్యుడు నెలకు ఒక రూపాన్ని ధరిస్తూ ఈ చరాచర జగత్తును రక్షిస్తూ జీవరాశులకు చైతన్యాన్ని ప్రసాదిస్తున్న ద్వాదశాత్ముడిని ఆరాధించడం వల్ల ఆయురారోగ్యాలతో పాటు అన్నింటా విజయం సిద్ధిస్తుంది.

## తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 20వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వరా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగి రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1,
హబ్సీగూడ, హైదరాబాద్ – 500007.
ఫోన్: 040– 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:
**93482 12354**



# దీప దాన మహిమ

– చింతలపాటి శివశంకర శాస్త్రి

"వందే పంచ ముఖాంబుజం త్రినయనం వందే లలాటేక్షణమ్
వందే వ్యయగతం జటాసుర మకుటం చంద్రార్థ గంగాధరమ్
వందే భస్మీకృత త్రిపుండ్ర నిటలం వందేష్ట మూర్త్యాత్మకమ్
వందే భక్త జనాశ్రయంచ వరదం వందే శివం శంకరమ్"

**కలువలను పోలిన ఐదు ముఖాలు కలిగినవాడు, త్రినేత్రుడు, జటాజూటంలో చంద్రుడు, గంగను ధరించినవాడు, త్రిపుండ్రములను దాల్చినవాడు, అష్టమూర్తి అయిన శివునకు నమస్కారం.**

'మఖ' నక్షత్రముతో కూడిన పూర్ణిమ గల మాసము మాఘ మాసం. అఘము అనగా పాపం. పాపం రాకుండా చేసే నెల కనుక మాఘము. శ్రీలక్ష్మీ నారాయణులకు, ఉమా మహేశ్వరులకు ఎంతో ప్రీతిపాత్రమైన మాసం. ఈ నెలలోనే మహాశివరాత్రి, రథసప్తమి, భీష్మైకాదశి మొదలైన పండుగలు వస్తాయి. మాఘమాస శుభ తరుణాన దీపము, దీపారాధన, దీపదానం వైశిష్ట్యము – విశిష్టత గురించి త్రికరణ శుద్ధిగా మననం చేసుకుందాము.

మాసములలో మాఘమాసం ఉత్తమమైనది, పవిత్రమైనది మరియు మహత్తరమైనది. ఈ మాసంలో చేసే వ్రతాలు, స్నానాలు, జపాలు, దానాలు అన్నీ ప్రశస్తమైనవే. మాఘమాసంలో చేసే దానాలలో ముఖ్యమైనది దీపదానం. ఈ దానం శివాలయంలో గాని, విష్ణ్వాలయంలో గాని చేయాలి. దేవాలయాలలో గోపురం దగ్గర కానీ, మంటపంలో కానీ, ఆలయ శిఖరము నందు గానీ, సంధ్యా సమయంలో గానీ దీపముంచినవారు సమస్త పాపాల నుండి విముక్తులై కైవల్యాన్ని పొందుతారు. మాఘమాసంలో సాయం సమయంలో శ్రీహరి ప్రీతి నిమిత్తం ఈ మాసమంతా నువ్వుల నూనెతో దీపాన్ని పెట్టినవారు సకల సంపదలను పొందుతారని మాఘపురాణం, శివపురాణంలో చెప్పబడింది.

మానవులకు ఉండవలసిన మంచి లక్షణాలలో దానగుణం ఒకటి. ప్రతిఫలాపేక్ష లేకుండా తన వద్ద ఉన్న ధనాన్నో,

వస్తువునో ఇతరులకు ఇవ్వడమే దానం.

**శ్లో ॥ తపః పరం కృతయుగే త్రేతాయాం జ్ఞానముచ్యతే**
**ద్వాపరే యజ్ఞమేవాహుః దానమేకం కలౌయుగే''**

అన్నారు పెద్దలు.

కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో జ్ఞానం, ద్వాపర యుగంలో యజ్ఞం, కలియుగంలో దానం చేయాలి. ఈ యుగమునందు చేసే దానం మూడు యుగాల్లో చేసిన తపస్సు, జ్ఞాన, యజ్ఞాల ఫలితం ఇస్తుంది. ఒక జన్మ యందు సుఖము కొరకు అనేక జన్మలను వ్యర్థము చేయకూడదు. ప్రాజ్ఞుడు వేయి జన్మలలో పొందిన దానిని ఒక జన్మయందే కూర్చుకొనును.

మహాభారతంలో భీష్ముడు ధర్మరాజుకు దానముల వైశిష్ట్యము గురించి వివరించుచు – గోవు, భూమి, తిలలు, హిరణ్యము, విద్య, కన్య, దీప, దాసి, శయ్య, గృహము, అగ్రహారము, రథము, గజము, అశ్వము, రజతము వీటిని షోడశ దానాలంటారని, శక్తి యున్నవారు అన్నిటిని దానము చేయవచ్చునని, శక్తి లేని యెడల ఏ ఒక్క దానిని దానమిచ్చినా ఆ దానము ఆచంద్ర తారార్కము నిలుచునని పేర్కొన్నాడు.

గోవును దానము చేసినవారు, వారి ఏడు తరాలవారు ఆ గోవుకు ఎన్ని రోమాలున్నాయో అన్ని దివ్య సంవత్సరములు దేవలోకములో నివసిస్తారని, దీపదానం చేయడం వలన బ్రహ్మ లోకమున మన్వంతర కాలము ఉండి, తిరిగి భూలోకంలో జన్మిస్తారని, బ్రాహ్మణులకు వస్త్రములతో పాటు సాలగ్రామములను దానం చేసినచో సూర్యచంద్రులున్నంతవరకు వైకుంఠమున ఉంటారని, అన్నమును దానము చేసిన ఆ అన్నమున ఎన్ని మెతుకులు ఉన్నాయో అన్ని సంవత్సరములు స్వర్గలోకమున సుఖపడుదురని, దాన వైశిష్ట్యము అంతా ఇంతా కాదని, దాని మహిమను వర్ణించడము వేయి నాల్కలు ఉన్న ఆ ఆదిశేషునికైనా దుర్లభమని పలికాడు.

''దాతవ్యం ప్రత్యహం పాత్రే స్వస్థః శక్త్యనుసారతః''. దానము ప్రతిరోజు చేయాలని తెలియజేశాడు. దీపం పరబ్రహ్మ స్వరూపమని, ఆ దీపం, దాని కాంతి, వెలుగు ఎనిమిది దిక్కులకు కనిపిస్తుందని ఆ దీపాన్ని ధర్మమునకు, పరమశివునికి, పృథ్వికి, విష్ణుమూర్తికి, ధర్మరాజుకి, ప్రజాపతులకు, పితరులకు, ప్రేతలకు, చీకట్లో ఉన్నవారికి నివేదన చేయాలి. దీపారాధనకు ఏ నూనెను వినియోగించినా కైవల్య ప్రాప్తి లభిస్తుంది.

దాత తూర్పు ముఖంగా, గ్రహీత ఉత్తర ముఖంగా దానవిధి నిర్వహిస్తే ఇద్దరికీ మేలు కలుగుతుంది. తాను సంపాదించిన పుణ్యాన్ని తల్లికి, తండ్రికి, గురువుకు కూడా దానము చేయవచ్చు. దానం స్వీకరించే బ్రాహ్మణుడిని పూజించి సంకల్పము చెప్పి దానము ఇవ్వాలి. ఈవిధంగా సశాస్త్రీయంగా, స్వధర్మానుసారంగా దానమిచ్చిన విశేష ఫలితము కలుగుతుంది.

**శ్లో ॥ శ్రద్ధయా దేయమ్ అశ్రద్ధయాఽదేయమ్ శ్రియా దేయమ్**
**హ్రియా దేయమ్ భియా దేయమ్ సంవిధా దేయమ్''**

ఎవరికైనా దానం చేస్తున్నప్పుడు మిక్కిలి శ్రద్ధతో ఇవ్వాలి. అశ్రద్ధతో ఇవ్వకూడదు. తనకు ఉన్న సంపదను, తన సమర్థతను చూసి దానం చేయాలి. ఇచ్చునప్పుడు అభిమానం లేకుండా, వినయంతో, భయ భక్తులతో, ప్రీతి, శుభకామ్న పూర్వకంగా దానం చేయాలి.

ఆత్మజ్యోతి ప్రకాశిస్తున్నట్లు, సూర్యచంద్రుల వెలుగులను తనలో నింపుకున్న జ్యోతియే దీపం. అసలు వెలుగు పరమాత్మయే. కనుకనే పెద్దలు దీపమే జ్యోతిరూపమైన పరబ్రహ్మమని, ''దీపోజ్యోతిః పరబ్రహ్మ'' అని చెప్పారు. అందుకే దీపం మన సంస్కృతిలో, జీవన విధానంలో భాగమయింది. లోకాలకు వెలుగును, విజయాన్నీ ప్రసాదించే శక్తి దీపం. దీపం తేజోమయం. ధర్మార్థ మోక్ష సాధకం దీపం. దీపాన్ని ఎట్టి పరిస్థితులలోను నేలపై ఉంచకూడదు. భూమి సర్వం సహా అయినప్పటికీ, అకారణ పాదఘాతాన్ని, దీపతాపాన్ని సహించదు. కనుక భూమికి తాపాన్ని కలిగించకుండా దీపాన్ని సమర్పించాలి.

దీపాన్ని వెలిగించడం, నమస్కరించడం, స్తుతించడం, దానం చేయడం అనాదిగా వస్తున్న సదాచారం. శివకేశవులిద్దరికీ ప్రీతిపాత్రమైనది దీపదానం. అది మోక్షామృత సోపానం. చతుర్దశి, అమావాస్య తిథుల్లో ప్రదోష సమయాన దీపదానం చేస్తే యమ మార్గం నుంచి మానవుడికి ముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం. దీపమెపుడూ అథోదిశ వైపు చూడదు. ఊర్ధ్వదిశనే చూస్తుంది. మనిషి కూడా ఉన్నతమైన ఆలోచనలతో, అభ్యుదయ దిశ వైపునకు పయనించాలని ఆ దీపకాంతి సంకేతమిస్తోంది. మట్టిదీపం మనిషి జీవితపు పునాది అని పండితులంటారు. అది అనుక్షణం మనల్ని అనేక విధాలుగా హెచ్చరిస్తూనే ఉంటుంది. అంతర్ముఖుడవై, ఆత్మ పరిశీలన చేసుకోమంటుంది. భుక్తి కోసం కాదు ముక్తి కోసం తపించమని హెచ్చరిస్తూనే ఉంటుంది. ఈ సత్యాన్ని గ్రహించిననాడు మన అంతరంగంలోని అంధకారం కూడా పటాపంచలవుతుంది.

పరమ పవిత్రమైన మహామాఘి పర్వదినమున చేయు దీపదానము వలన అఖండమైన సుఖసంతోషాలు కలిగి మరణానంతరము ముక్తిని పొందెదరు. దీనికి సంబంధించిన కథ ఇలా ఉంది.

పూర్వము పాంచాలమనే దేశం ఒకటి కలదు. ఆ

దేశాన్ని పరిపాలిస్తున్న రాజుకు సంతాన భాగ్యం కలగలేదు. సంతాన ప్రాప్తి కొరకు ఆ రాజు ఎన్నో యజ్ఞాలు చేశాడు. భూరి కానుకలతో బ్రాహ్మణులను సంతృప్తి పరిచాడు. అయినా సంతానము కలుగలేదు. విరక్తుడై గోదావరీ నదీ తీరానికి వెళ్ళి సంతాన ప్రాప్తి కొరకు తపస్సు చేయడం మొదలుపెట్టాడు. ఆ సమయంలో పిప్పలాదుడనే మహర్షి అక్కడకు వచ్చి, ''రాజా! నీకన్న సమృద్ధిగానే ఉన్నాయి కదా. ప్రజలందరూ సుఖశాంతులతో విలసిల్లుతున్నారు కదా. నీవు ఈ వనానికి వచ్చి ఎందుకు తపస్సు చేస్తున్నావో దయచేసి నాకు తెలియజేయవలసింది'' అని పలికాడు. అందులకు ''ఓ మహామునీ! మీరన్నట్లు నాకన్నీ ఉన్నాయి. కానీ దురదృష్టవశాత్తు నాకు సంతానము కలుగలేదు. సంతానము నిమిత్తము నేను తపమాచరిస్తున్నాను'' అన్నాడు. ఆ మాటలకు పిప్పలాదుడు ఇలా జవాబిచ్చాడు. ''రాజా! మాఘమాసంలో శివాలయానికి వెళ్ళి శివుని సమీపంలో, ఆయన ప్రీతి కొరకు దీపదానం చేయి. అలా చేస్తే నీ కోరిక నెరవేరుతుంది'' అని పలికి రాజును ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

ముని ఆజ్ఞానుసారం పాంచాలరాజు తపమును విరమించుకొని రాజ్యానికి చేరుకున్నాడు. మాఘమాసం రాగానే ఆ నెల రోజులు భక్తి ప్రపత్తులతో ప్రతిరోజూ శివాలయానికి వెళ్ళి, శివుణ్ణి ఆరాధించి, పుత్ర సంతతి కోరుతూ దీపాన్ని వెలిగించి వాటిని పసుపు కుంకుమలతో పూజించి దానధర్మాలు చేయసాగాడు. పవిత్రమైన పూర్ణిమనాడు శివుని షోడశోపచారాలతో పూజించి, పంచామృతాలతో అభిషేకించి, సద్బ్రాహ్మణుని తగిన రీతిగా పూజించి, శివుని సమీపంలో శివుని సంప్రీతి కొరకు దీపమును వెలిగించి –

**''సర్వజ్ఞానప్రదం దీపం సర్వసంపచ్ఛుభావహం**
**దీపదానం ప్రదాస్యామి శాంతిరస్తు సదా మమ''**

పుత్రపౌత్రాదులను కలిగించేదైన దీపమును దానము చేస్తున్నాను. దీనివలన నాకు నిరంతరము శాంతి, సుఖములు కలిగి పుత్రులు కలుగుదురు గాక అని మనమున త్రికరణ శుద్ధిగా తలంచి ఆ సద్బ్రాహ్మణునకు దీపమును దానమొసంగెను. తత్ఫలితంగా రాజుకు పుత్రసంతానము కలిగినది. తన ఈప్సితార్థము నెరవేరినందుకు సంతసించి, శ్వాస విడిచేంతవరకు శివుణ్ణి అర్చించుచు దీపదానములను చేయసాగాడు. ఫలితంగా మరణానంతరము శివసాయుజ్యము నొందినాడు.

కావున మాఘమాసంలో పౌర్ణమినాడు శివాలయంలో శివుని సన్నిధిలో దీపాన్ని వెలిగించి దీపారాధన గావించిన వారికి పునర్జన్మ ప్రాప్తించదు. మనమందరము నియమ నిష్ఠలతో శివుణ్ణి ఆరాధించి దీపదానము లొనరించి తరించెదము.

**''లోకా స్సమస్తా... సుఖినో భవంతు''**


# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.


ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



# మాఘ ఆదివార వ్రతం

– డా|| మరుదాడు అహల్యాదేవి

**మాసాలలో మాఘమాసం మహిమాన్వితం. మ+అఘం = మాఘం. 'అఘం' అంటే పాపం, 'మ' అంటే లేనిది. మాఘం అంటే పాపరహితమైనది అని అర్థం. అత్యంత పుణ్యఫలప్రదమైన మాఘమాసంలో ఆచరించదగు మేటి వ్రతాలలో "మాఘ ఆదివార వ్రతం" అత్యంత ముఖ్యమైనది.**

ఆదిత్యుడు అధిదేవతగా గలవారమే ''ఆదివారం''. భానునికి సంబంధించిన వారం కనుక ఈ వారం ''భానువారం''గా కూడా పిలువబడింది. ఆదివారం ఆదిత్యారాధనకు అనువైన వారం. అదియును గాక మాఘమాసం సూర్యుని జనన మాసం. కనుక మాఘమాసంలో ఆదివారం నాడు ఆచరించే వ్రతం కనుక ఈ వ్రతానికి ''మాఘ ఆదివార వ్రతం'' అనే పేరు వచ్చింది.

మాఘ ఆదివార వ్రతం నియమానుసారంగా ఆచరించడం వల్ల అనంత పుణ్యఫలం దక్కడమే కాకుండా ఆయురారోగ్య ఐశ్వర్య సిద్ధి చేకూరునని వ్రతగాథ విదితం.

**వ్రత కథ**



పూర్వం ఉజ్జయినీ నగరంలో దైవభక్తురాలైన ఒక వృద్ధ వనిత ఉండేది. ఆవిడ ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా సూర్యోదయానికి ముందే లేచి శుచిగా స్నానం చేసి, తమ ఇంట్లో ఆవు లేనందున ప్రక్క ఇంటినుండి ఆవుపేడ తెచ్చి ఇల్లు, వాకిలి శుభ్రంగా అలికి బియ్యపు పిండితో ముగ్గులు పెట్టి సూర్యుణ్ణి, ఇంట్లో ఉన్న దేవతలను పూజించి, పాయసం చేసి సూర్యదర్శనం కాగానే సూర్యునికి నైవేద్యం పెట్టి, అనంతరమే తాను ఆ ప్రసాదాన్ని భుజించి, ఆ రోజంతా మరే ఆహారమూ తీసుకునేది కాదు. సూర్యనమస్కారము చేయనిదే మంచినీళ్ళు కూడా ముట్టుకునేది కాదు. ప్రతి ఆదివారము ఈ రీతిగా చేస్తున్నందువల్ల ఆమెను ఇరుగు పొరుగు వారంతా ''ఆదివారాల అవ్వ'' అని పిలిచేవారు. ఈ విధంగా ఆమె చేస్తున్నందువల్ల ఆమె ఆరోగ్యంగా, సంతోషంగా, ఎంతో సుఖజీవనం గడిపేది. ఇదంతా గమనిస్తున్న ప్రక్కింటావిడ

**మాఘమాసంలో వచ్చే అన్ని ఆదివారాలు ఈ వ్రతం చేయడం అత్యంత ఫలప్రదం. అంతగా ఆచరించ వీలుకానివారు, ఆ నెలలోని ఒక్క ఆదివారం నాడైనా చేయవచ్చు.**

అసూయాగ్రస్తురాలై తన ఆవుపేడయే కదా ఈ భాగ్యానికి కారణం కనుక, తన ఆవుపేడ అందకుండా చేయాలని, తన ఆవును తన ఇంటిలోపలే కట్టేసుకోసాగింది. దొడ్లో ఆవు కనిపించక పేడ దొరకనందున ఆ ముసలావిడ అలకని ఇంట్లో వంట చేయడం మంచిది కాదని ఆరోజు భగవంతునికి నివేదన చేయలేదు. ఆవిడకూడా భోజనం చేయక నీరసంగా పడుకుంది. నాటి రాత్రి ఆమె కలలో భగవంతుడు కనపడి ''ఈరోజు నాకు నైవేద్యం ఎందుకు పెట్టలేద''ని తనను అడిగినట్లు, గోమయం దొరక్క ఇల్లు అలకలేదని, పరిశుభ్రం లేనిచోట వంట చేయుట తగదు కనుక పొయ్యి అంటించలేదని, అందుకు మన్నించమని ఆవేదనతో భగవంతునికి విన్నవించుకున్నట్లు కల వచ్చింది. అంతేకాక ఆమె క్రమబద్ధ భగవదారాధనకు సంతసించి తనకు ఒక గోవును బహూకరిస్తున్నానని భగవంతుడు తెలిపినట్లు కూడా కల రావటంతో నిద్ర నుండి మేల్కొన్న వెంటనే లేచి పెరటి ఆవరణలో పరికించగా ఒక ఆవు కన్పించింది. ఆవిడ ఆ ఆవును ''దేవుడిచ్చిన ధేనువు''గా భావించి పూజించింది. ఇంకో విచిత్రమేమంటే ఆ గోమయంలో బంగారు నాణెం ఉంది. తెల్లవారు జామున మసక చీకటిలో ఆ ముసలావిడ ఆ వింతను గమనించలేదు. ఇదంతా ప్రక్కనే ఉన్న చుప్పనాతి ఆవిడగమనించి ఆ ఆవుపేడకూడా ముసలావిడకు దక్కకుండా చేయాలని ఆ పేడను అక్కడినుండి తీసుకువచ్చేసింది. పేడలో బంగారునాణెం చూసి మరింత అసూయాగ్రస్తురాలైంది. పెరట్లో ఆవు ఉన్నా పేడ లేకపోవడంతో ముసలావిడ ఉసూరుమంటూ ఆరోజు కూడా ఇల్లలక్కుండా, వంట చేయకుండా, తిండి లేకుండా ఉండిపోగా ఆ రాత్రి దేవుడు మరలా కలలో కనిపించి ఆవును తన ఇంటిలో కట్టేసుకోమని సూచించడంతో అలాగే చేయగా, ఆవు వేసిన పేడలో బంగారు నాణాన్ని చూసి మురిసిపోయింది. ప్రతిరోజు ఒక బంగారు నాణెం లభ్యమవడంతో ముసలావిడ మరింత ఆనందంగా ఉండడం ఓర్వలేని ప్రక్కింటావిడ ఆవుపేడలో బంగారం ఉంటుందని, రాజుగారికి దక్కాలని రాజుగారికి కబురు చేరవేసింది. వెంటనే రాజు సేవకులను పంపి ఆ రాత్రి ఆ ఆవును తన అంతఃపురానికి తెప్పించి, తెల్లవారగానే పేడను పరికించగా పేడలో ఎలాంటి నాణెం కన్పించకపోగా గోమయ దుర్గంధంతో అంతఃపురం అంతా నిండిపోయింది. ఆ రాత్రి రాజుకు భగవంతుడు స్వప్నంలో కనిపించి ఆ గోవును తానే ముసలావిడకు ప్రసాదించానని, వెంటనే దానిని ఆమెకు అందజేయమని ఆదేశించడంతో రాజు గోవును ముసలావిడకు అప్పగించి, అసూయా పరురాలిని శిక్షించి, తన రాజ్యంలోని ప్రజలంతా ఆదివార వ్రతం ఆచరించాలని ఆదేశించాడు. ఆదివార వ్రత ఫలితంగా ప్రజలంతా సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో వర్ధిల్లారని వ్రత కథనం.

**మాఘ ఆదివారం వ్రతాన్ని ఐదు సంవత్సరాలు వరుసగా పాటించి, ఆరవ సంవత్సరం రథసప్తమి నాడు గానీ లేక మాఘ మాసంలో ఆదివారం నాడు గానీ ఉద్యాపన చేయాలి. బ్రాహ్మణ శ్రేష్ఠులకు సంతృప్తికరంగా భోజనం పెట్టి నూతన వస్త్రాలతో, దక్షిణ తాంబూలాదులతో యథోచితంగా సత్కరించి ఆ తర్వాత వ్రత ఉద్యాపన చేయాలి.**

### వ్రత విధానం

మాఘమాసంలో వచ్చే అన్ని ఆదివారాలు ఈ వ్రతం చేయడం అత్యంత ఫలప్రదం. అంతగా ఆచరించ వీలుకానివారు, ఆ నెలలోని ఒక్క ఆదివారం నాడైనా చేయవచ్చు. వ్రతం ఆచరించే ఆదివారం ముందు రోజు రాత్రి ఉపవాసం ఉండి ఆదివారం నాడు వేకువనే లేచి, అభ్యంగన స్నానమాచరించి సూర్యోదయం కాగానే సూర్యభగవానునికి నమస్కరించి సూర్యస్తోత్రం జపించి తర్వాత ఇంటిలోని పూజామందిరం శుభ్రపరచి బియ్యపు పిండితో సూర్యరథం ముగ్గును, కమలం ముగ్గును చిత్రించి దానిపై బియ్యం పోసి, బియ్యం పైన కలశాన్ని ప్రతిష్ఠించి, కలశానికి ప్రక్కన సూర్యుని ప్రతిమ గాని, చిత్రపటాన్ని గాని ఉంచి ఎర్రని పుష్పాలతో, షోడశోపచారాలతో మంత్రయుక్తంగా పూజించి పాయసం నైవేద్యంగా అర్పించాలి. భాస్కరాయ విద్మహే సహస్ర రశ్మాయ ధీమహీ, తవః సూర్యః ప్రచోదయాత్'' అనే మహామంత్రాన్ని జపించాలి. పురోహితుని ద్వారా వ్రతకథను విని అక్షతలు వేయించుకుని భగవంతునికి నమస్కరించాలి.

### ఉద్యాపనం

ఈవిధంగా మాఘ ఆదివారం వ్రతాన్ని ఐదు సంవత్సరాలు వరుసగా పాటించి, ఆరవ సంవత్సరం రథసప్తమి నాడు గానీ లేక మాఘ మాసంలో ఆదివారం నాడు గానీ ఉద్యాపన చేయాలి. బ్రాహ్మణ శ్రేష్ఠులకు సంతృప్తికరంగా భోజనం పెట్టి నూతన వస్త్రాలతో, దక్షిణ తాంబూలాదులతో యథోచితంగా సత్కరించి ఆ తర్వాత వ్రత ఉద్యాపన చేయాలి. ఈ మాఘ ఆదివార వ్రతం ఆచరించడం వలన సంపూర్ణాయురారోగ్యం మరియు అనంత పుణ్యఫలాలు ప్రాప్తించునని పురాణ ప్రతీతి.

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

## భగీరథుడు

**గత సంచిక తరువాయి**

ఆ మరునాడు మళ్ళీ అందరూ వేదిక చెంతకు చేరారు. ఉగ్రశ్రవసుడు మునులను చూసి ''నాయనలారా! భగీరథుడు ఎంత గొప్ప తపస్సు చేశాడో, గంగాదేవి ఎందుకు కరుణించి ఆయనకు వరాన్ని అనుగ్రహించిందో మొదలైన విషయాలన్నీ ఈరోజు చెబుతాను'' అని చెప్పటం ప్రారంభించాడు.

**"సతత కృపోవాసముల శాక ఫలోదక మూల పారణ**
**వ్రతముల దేవపూజల నపార జపంబుల చేసి నిష్ఠతో**
**నతుల తపంబు సేసి నమరాపగ నుర్వికి తెచ్చు వేడ్కతో**
**ధృతియుతుడై దిలీపకుల దీపుడు దివ్య సహస్ర వర్షముల్"**

**-78 ప – తృ.ఆ – అరణ్యపర్వము**

''దిలీప కులదీపకుడైన భగీరథ మహారాజు దీక్షా పరతంత్రుడై ఎంత కష్టమైనా సరే దేవనది అయిన గంగామాతను భూమి మీదకు తీసుకొని రావాలని తపోనిష్ఠలో మునిగిపోయాడు. ఆ తపస్సు ఎంతకాలం చేశాడనుకొన్నారు? దేవమానంలో వేయి సంవత్సరాలపాటు ఎడా తెరపీ లేకుండా హిమవత్పర్వత సాను ప్రదేశమందే కూర్చొని ఘోర తపస్సు చేశాడు. దేవతలకు పూజలు చేశాడు. అంతులేని విధంగా సురనదిని గూర్చి జపం చేస్తూనే ఉండేవాడు. గంగానదిని దివి నుండి భువికి దింపాలంటే మాటలా? భగీరథుని తపస్సు ఆ తల్లి మెచ్చాలి. ప్రత్యక్షమై వరాలు క్రుమ్మరించాలి. ఆమె దివ్యదర్శనం కోసం, కరుణా కటాక్షం కోసం అన్యచింత మాని ఉపవాస దీక్షతో అనుక్షణం గంగాధ్యానం చేసేవాడు. అలా కొంతకాలం చేసిన తరువాత తన తపోదీక్షను భగీరథుడు మరింత కఠినతరం చేశాడు. కొన్నిసార్లు ఆకుకూరలు తింటూ, మరికొన్ని రోజులు పండ్లు మాత్రమే భుజిస్తూ, ఇంకొంతకాలం నీరు మాత్రమే తీసుకొంటూ తరవాత కందమూలాలు భుజిస్తూ తపస్సు చేశాడు. ఉపవాసానంతరం పారణ చేస్తూ, అంతటితో ఆగక వివిధ వ్రతాలు చేస్తూ తన ప్రయత్నాన్ని ఆపకుండా భగీరథుడు గంగాదేవి ప్రత్యక్షమయ్యేవరకు తపస్సు చేస్తూనే

ఉన్నాడు'' అని చెబుతున్న ఉగ్రశ్రవసుని మాటలకు అడ్డు తగిలారు కొందరు మునులు.

''మహాత్మా!గంగాదేవిభగీరథుడికిప్రత్యక్షమైందంటారా? అంతకుముందు దిలీపుడు కూడా తపస్సు చేశాడు గదా? భగీరథుడి తపస్సు ఎంత గొప్పదో అయితే తప్ప గంగామాత కనబడదే? అంత గొప్ప తపస్సు చేశాడన్నమాట!'' అంటూ ఆశ్చర్యాన్ని ప్రకటించారు.

''అవును మరి భగీరథుడు అంత గొప్ప తపస్సే చేశాడు. ఆయన కంటిముందు గంగామాత! ఆయన మనసులో గంగ. ఆయన హృదయంలో గంగ. అలా అనుక్షణం గంగా ధ్యానంలో మునిగిపోయిన భగీరథుడి ముందు గంగామాత ప్రత్యక్షమైంది'' అని అన్నాడు ఉగ్రశ్రవసుడు. మునులంతా ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి ఆయనను చూశారు. మళ్ళీ చెప్పసాగాడు ఉగ్రశ్రవసుడు.

''భక్తా భగీరథా! ఏకాగ్రచిత్తంతో నీవు చేసిన తపస్సుకు మెచ్చాను. నీకిష్టమైనది కోరుకో, అనుగ్రహిస్తాను'' అన్న గంగాదేవిని చూసి భగీరథుడు రెండు చేతులూ జోడించి వినమ్రుడై తన కోరికను విన్నవించాడు.

**"గంగామాతా!**

**"తపనతేజుండైన కపిలు కోపంబున**
**గత జీవులై పుణ్యగతుల యందు**
**నిహతులై మత్పితామహులున్నవారు నీ**
**దగు పుణ్యజలముల సగరసుతులు**
**సిక్తులై స్వర్గానుభుక్తిఁ బ్రాపింతురు**
**కావున దేవి! యిద్దేవతపథము**
**నందుండి వసుమతి కొందంగ చనుదేర**
**వలయు 'నావుడు' మహీవలయమునకు**
**నేను వచ్చునపుడు నా నిరంతర జలౌ**
**ఘంబు దాల్ప నీలకంఠు డోపు**
**గాని యొరులు దాల్పగా నోప; రయ్యుమా**
**నాథు కరుణ పడయు నన్ను దాల్ప'**

**-80 ప – తృ.ఆ – అరణ్యపర్వము**

''నా కష్టాన్ని చెప్పుకొంటున్నాను. కరుణతో నన్ను కాపాడు తల్లీ. మహానుభావుడు, అఖండ తపోనిధి, శాపానుగ్రహ సమర్థుడు అయిన కపిలమహర్షి సూర్యతేజస్సుతో సమానమైన తేజస్సుతో అందరి స్తుతులు అందుకొన్నవాడు. అంతటి ఘనుడైన కపిలుడికి మా ముత్తాతలైన సగర పుత్రులు అకారణంగా ఆగ్రహం తెప్పించారు. ఆయన కోపానికి భస్మీభూతులైన సాగరులు పుణ్యలోకాలకు చేరలేక బూడిదరూపంలోనే పాపకర్మ ననుభవిస్తున్నారు. వారికి సద్గతులు కలగాలన్నది నా చిరకాల వాంఛ. అతిపవిత్రమైన నీ పుణ్యజలాలతో వారికి కలయిక కలిగితే తప్పక వారు స్వర్గలోక సౌఖ్యాలు అనుభవించగలుగుతారన్నది నా ఆశ. ఆ ఆశయం నెరవేరాలంటే – ''జగత్పావని అయిన ఓ గంగాభవానీ! నామీది దయతో ఈ దేవలోకం నుంచి భూలోకానికి నీవు దిగివచ్చి నా పితృదేవుని పితామహులను పునీతులను చేయాలి'' అని మరొకమారు భగీరథుడు గంగాదేవికి సాష్టాంగ నమస్కారం చేశాడు. భగీరథుని ఆశయానికి, దీక్షకు, భక్తి ప్రపత్తులకు గంగాదేవి ప్రసన్నురాలైంది.

''భక్తా! భగీరథా! నీ ఆశయం ప్రశస్తమైనదే. నీ కోరిక మేరకు నేను భువికి వస్తే నా ప్రవాహ ధాటికి ఎవరూ ఆగలేరు. ఆపలేరు. నిరంతరంగా ప్రవహించే జలధాతటిని భరించగలవాడు ఒక్క నీలకంఠుడే. వేరెవరూ నా ప్రవాహానికి ఎదురు నిలవలేరు సరిగదా క్షణకాలం కూడా నా గతిని నిరోధించలేరు. కనుక నేను భువికి వస్తున్నప్పుడు నన్ను భరించడానికి, ధరించడానికి పార్వతీపతి కరుణను పొందు. అలా నీవు చేయగలిగితే నీ కోరికను తీరుస్తాను. తప్పక మీ పితామహులకు సద్గతులు కల్పిస్తాను'' అని చెప్పిన గంగాదేవి పలుకులను శిరసా వహించి భగీరథుడు శివుని గురించి తపస్సు చేయాలనే సంకల్పంతో కైలాసగిరికి చేరాడు.

అనువైన ప్రదేశాన్ని ఎంచుకొన్న భగీరథుడు నియమ నిష్ఠలతో తదేక ధ్యానంతో, యమధర్మరాజునే పరిమార్చినవాడు, పరమాత్ముడు, భక్తవశంకరుడు అయిన పరమశివుని గూర్చి తపస్సు చేయసాగాడు. పరమేశ్వరుడు కూడా భగీరథుని తపస్సుకు ఆనందించినవాడై ప్రత్యక్షం కావటంతో భగీరథుడు ఆ భూతనాథుడికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి వినయంతో నిలబడ్డాడు. భక్తుడి కోరికను తానుగా గ్రహించి వరాలు ప్రసాదించే శంకరుడు –

''భగీరథా! నీవు భూలోకానికి గంగను తెచ్చే ప్రయత్నం చేయి. నేను గంగను ధరిస్తాను. ఆమె ప్రవాహ వేగం తగ్గి, నీకు వరదాయినిగా నీ వెంట వస్తుంది. గంగాదేవిని ప్రార్థించి ఆమె కరుణ సంపాదించు'' అని అనుగ్రహించడంతో భగీరథునికి కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు. వెంటనే పరమశివుని ఆనతితో భగీరథుడు గంగాదేవిని ఆరాధించటంలో నిమగ్నుడైనాడు. గంగాదేవి అంతకుముందే చెప్పింది కదా! శంకరుడు తనను ధరిస్తే, తాను భువికి దిగి వస్తానని! భగీరథుడి తపస్సు ఫలించింది. గంగాదేవి మళ్ళీ భగీరథుడికి ప్రత్యక్షమైంది. భగీరథుడి కోరిక తీరడమే తరువాయి.

''శౌనకా! భగీరథ ప్రయత్నమంటే అది! తుది దాకా వదలకుండా కార్యసాఫల్యం కొరకు అది తపస్సు



గాని, మరేదైనా కాని ప్రయత్నం చేయటమే మనిషి చేయవలసినది. అందుకే ఇప్పటిదాకా, ఎప్పటిదాకా కూడా 'భగీరథప్రయత్నమ'నే నానుడి ఏర్పడింది. ఫలితం దక్కలేదని మధ్యలో వదిలివేయటం చేయకూడని పని'' అని ఉగ్రశ్రవసుడు చెప్పడంతో ''అవును స్వామీ! భగీరథుడు అందరికీ ఆదర్శ పురుషుడు. గంగాదేవి అప్పుడు భగీరథుని వెంట భూలోకానికి దిగి వచ్చిందన్నమాట'' అని అన్నారు మునులంతా ముక్త కంఠంతో.

గంగామాత భువికి ఎలా వచ్చిందనుకొన్నారు? ఆ నదీ ప్రవాహం లోని ఉరవడి వర్ణనాతీతం. గమనరీతి అత్యద్భుతం.

**"ఇలకున్ గంగ తరంగ సంగతులతో నేతెంచె నాశాంతరం**
**బులు నాకాశము కప్పుచుం దగ మహాభూత ప్రపంచంబుతో**
**చెలువై యుండగ, దాని నీశ్వరుడు తాల్చెన్ సంగతోత్తుంగ పిం**
**గళ జూటాగ్రహు నందు పద్మదళ సంకాశంబుగా లీలతోన్"**

**-82 ప – తృ.ఆ – అరణ్యపర్వము**

గంగానది తన అలల ఊపుల విన్యాసంతో భూమికి దిగుతోంది. ఆకాశమంతా తానే ఆక్రమించి, దిక్కుల చివర్ల వరకూ పరుగులు పెడుతూ, పెద్ద పెద్ద ప్రాణి సమూహంతో (గొప్ప జల జంతువులతో) తన అందచందాలను విరజిమ్ముతూ దేవలోకం నుంచి క్రిందకు వస్తున్న గంగను చూశాడు ఈశ్వరుడు. వెంటనే ఎత్తుగా అలంకరించబడి ఉన్న, పింగళవర్ణంతో ప్రకాశిస్తున్న (గోరోజనం రంగుతో వెలిగిపోతున్న), తన జటాజూటంలోకి ఆ నదీసుందరిని ఆహ్వానించాడు. పరమేశ్వరుని జడలలోకి ప్రవేశించిన గంగ ఆ దేవదేవుని జటాజూటం యొక్క అగ్రభాగంలో తురిమిన తామర పూరేకా అన్నట్లు భాసించింది. అప్పటినుండి శివుడు గంగాధరుడిగా పూజింపబడుతున్నాడు. భగీరథుని వెంట మళ్ళీ నడవసాగింది ఆ దేవతామూర్తి.

**"సురముని సిద్ధ ఖేచర వరుల్ వచ్చి య**
**చ్చెరు వంది చూడంగ హరు శిరంబు**
**నందుండి భువనైక వందిత సురనది**
**ధరణీ తలంబున కరుగు దెంచి**
**కలహంస గతియు నిర్మలఫేన హాసంబు**
**నాకీర్ణ మీన విలోకనములు**
**నాలోల పవన వాచాలిత కల్లోల**
**లసిత మృదూక్తులు నెసగుచుండ**
**ప్రీతితో భగీరథుడను దూత చేత**
**నీతయై మహాముని పరిపీత రిక్త**
**మగు సరిత్పతి కూడి, యా సగరజులకు**
**హితముగా దానినించె నాతత జలముల"**

**-83 ప – తృ.ఆ – అరణ్యపర్వము**

''గంగావతరణాన్ని దర్శించటానికి సురలు, సిద్ధులు, గగన సంచారులు, మునీశ్వరులు కరేమిటి అందరూ కైలాస నగరానికి దిగివచ్చారు. సకల లోకవాసుల చేత సంస్తుతి చేయబడే సురనది శివుని శిరస్సు నుండి ఇలాతలానికి దిగి వస్తున్న సుందర దృశ్యాన్ని చూసి ఆశ్చర్యంతో అందరూ తలమునకలైనారు. భయద సౌందర్య గతిలో ఉరకలు వేస్తూ వస్తున్న గంగానదిని చూడటానికి ఎవరికీ రెండు కళ్ళు చాలటంలేదు. నదీమతల్లిలో ఇంత ఉద్వేగం, ఇంత గాంభీర్యం సరిసమానంగా చోటు చేసుకున్నాయా అని వారికనిపిస్తోంది. ఆ ప్రవాహ విలక్షణత్వం వర్ణనాతీతం. గంగ – కలహంస నడకను మరిపిస్తోంది. నిర్మలమైన నురుగే ఆమె చిరునవ్వుగా చిందులు వేస్తోంది. కదులుతున్న చేపలు వివిధ విన్యాసాలు ఒలికించే ఆమె చూపులుగా ఆకర్షిస్తున్నాయి. రకరకాలుగా వీస్తున్న గాలి స్పర్శ చేత తరంగాలు చేసే ధ్వనులు ఆమె పలికే మృదూక్తులా అన్నట్లున్నాయి. శృంగార నాయికగా కనిపిస్తున్న గంగాదేవిని భగీరథుడనే దూత నాయకుడైన సముద్రుని వద్దకు కొనిపోతున్న దృశ్యాన్ని సర్వులూ దిగ్భ్రమ చెంది చూస్తున్నారు. వరదాయిని అయిన గంగాదేవి, భక్తుని పట్ల వాత్సల్యంతో మహాముని అయిన అగస్త్యునిచే త్రాగబడి నిర్జలంగా ఎండిపోయి ఉన్న సముద్రుని చేరి తన జలాతిశయంతో అతనిని పూర్తిగా నింపివేసింది. సముద్రంలో

కనబడుతున్న పరిపూర్ణ జలం చూసి దేవతలందరూ హర్షాతిశయంతో గంగామాతను స్తుతించసాగారు. మళ్ళీ సముద్రుడు యథారూపాన్ని పొందగలిగాడని, జలజంతువులకు స్థావరం దొరికిందని సంతృప్తి చెందారు. ఎప్పుడైతే సముద్రుడు జలరాశితో మహోన్నతుడైనాడో ఆ క్షణంలోనే మహాపవిత్రురాలైన గంగామాత స్పర్శచేత సగరుని పుత్రులందరికీ పుణ్యలోకవాసం లభించింది. అది తెలుసుకొన్న భగీరథుడు గంగామాతకు, పరమేశ్వరుడికి హృదయపూర్వకంగా నమస్సులు అందజేసి కృతార్థుడైనాడు.

"మునులారా! మరొక్క ముఖ్య విషయం చెబుతాను వినండి'' అన్న ఉగ్రశ్రవసుని వైపు ఏం చెబుతాడా అన్నట్లు ఉత్కంఠతో చూశారు శౌనకాదులు.

"సాగరులకు సద్గతిగా
సాగరమునకట్లు సలిల సంపూర్ణముగా
భూగతయై భాగీరథి
భాగీరథకీర్తి భువన పంక్తుల నించెన్"

-84 ప – తృ.ఆ – అరణ్యపర్వము

"సాగరులకు సద్గతులు కల్పించటానికి సురనది అయిన గంగాదేవి భూలోకానికి దిగివచ్చి సాగరాన్ని సలిల సంపూర్ణం చేసింది. భగీరథుని మీది కృపతో 'భాగీరథి' అనే పేరుతో భగీరథుని కీర్తిని లోక లోకాలు నింపివేసింది. సగరుని పుత్రుడిగా సముద్రుడు సాగరుడైతే, భగీరథుని పుత్రిగా గంగాదేవి 'భాగీరథి'గా ప్రశస్తి పొందింది'' అని ముగించిన ఉగ్రశ్రవసునికి శౌనకాది మునులందరూ నమస్కరించి, భగీరథుని చరిత్ర ఎంత మహత్తరమైనదని పొగుడుతూ నిజాశ్రమాలకు చేరుకొన్నారు.



# మాండవ్యోపాఖ్యానం

జనమేజయుడాదినం ముందుగానే వచ్చి ఏ క్రొత్త కథను ఈనాడు వైశంపాయన మహర్షి వినిపించబోతున్నాడో అని ఆలోచిస్తూ ఆయన రాక కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. వైశంపాయనుడు వస్తూనే జనమేజయుని దీవించి సుఖాశీనుడైనాడు.

"మహారాజా! ఈరోజు ఒక బ్రహ్మర్షి యొక్క విచిత్ర చరిత్రను చెబుతాను. ఎంత గొప్పవారికైనా, ఎటువంటి మహామునులకైనా కర్మ పరిపాకం అనుభవించక తప్పదు. అలా అనుభవించినవాడే 'మాండవ్యుడ'నే పేరు గల బ్రహ్మర్షి. బ్రహ్మర్షి అని చెప్పానంటే మాండవ్యుడెంత ఘోర తపస్సు చేశాడో అర్థం చేసుకో.

జనమేజయుడు చక్కగా వింటున్నట్లు తల ఊపాడు.

"మాండవ్యుడు బ్రహ్మర్షే కాదు. చండకోపుడు కూడా. యమధర్మరాజు నంతటి వాడినే శపించగల తపశ్శక్తి సంపన్నుడు'' అని వైశంపాయనుడనగానే – "అదేమిటి మహాత్మా! చాలా ఆశ్చర్యంగా ఉంది. సమస్త జీవరాశుల పాపపుణ్యాలను వింగడించి, పాపులను శిక్షించే ధర్మస్వరూపుడైన యమధర్మరాజును ఒకరు శిక్షించడమేమిటి? శాపం పెట్టడమేమిటి? మాండవ్య మహర్షి అంత గొప్పవాడా? వింతగా ఉంది. సవిస్తరంగా చెప్పండి'' అని అడిగాడు జనమేజయుడు.

"అవును రాజా! బ్రహ్మర్షి అయిన మాండవ్యుడు పూర్వం అఖండ తపస్సు చేసి, కొంతకాలం విశ్రాంతి తీసుకుందామనుకున్నవాడై ఒంటరిగా తీర్థయాత్రలు చేద్దామని బయలుదేరాడు. భూమండలంలో ఉన్న పుణ్య తీర్థాలన్నిటినీ సేవించాడు. మరల తపస్సు చేయాలనే ఆకాంక్షతో రాచనగరుకు కొంతదూరంలో ఉన్న ఒకానొక అడవిలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఆ ఆశ్రమానికి ముఖద్వారం దగ్గర ఉన్న వృక్షం మొదట్లో నిలబడి, రెండు చేతులూ పైకెత్తినవాడై, మౌనవ్రతాన్ని పాటిస్తూ తపస్సు చేయసాగాడు. రోజు రోజుకు తపస్సులో లీనమై, బాహ్య ప్రపంచాన్నే విస్మరించే స్థితికి చేరుకున్నాడు. అలా కొంతకాలం జరిగింది.

ఒకనాడు కొంతమంది దొంగలు రాజుగారి ధనాన్ని అపహరించి పారిపోసాగారు. అది చూసిన తలారులు చోరుల వెంటబడి వారిని పట్టుకోబోయారు. చోరులు పరుగెత్తి, పరుగెత్తి మాండవ్యముని ఆశ్రమంలో దాక్కొన్నారు. వారి

వెంట పరిగెత్తి వచ్చిన తలారులు మాండవ్య మునిని చూసి ఆగిపోయారు.

"ఓ మునీ! దొంగలు రాజధనాన్ని అపహరించి ఇటువైపే పరుగెత్తుకుంటూ వచ్చారు. వాళ్ళు ఎటువైపు వెళ్ళారో తెలిస్తే చెప్పు. మేము తొందరగా వాళ్ళను పట్టుకొని రాజు చెంతకు తీసుకువెళ్ళాలి" అని ఎన్నిసార్లు తలారులడిగినా మాండవ్యుడు పలకలేదు. ఆయన సుదీర్ఘమైన తపస్సులో మునిగిపోయి ఉన్నాడు. పైగా మౌనవ్రతంలో ఉన్నాడు. అది తెలుసుకోలేని తలారులు ఆయన అసలు మునే కాదని, దొంగలలో ఒకడై ఉంటాడని భావించి ఆయన ఆశ్రమంలోకి ప్రవేశించారు. అక్కడ మారుమూల ధనంతో ఉన్న చోరులను చూశారు. ఆ మునే ఈ దొంగలకు నాయకుడని, వాళ్ళను పట్టుకోకుండా ఉండటానికే మునివేషంలో నటిస్తున్నాడని నిందించారు. అంతటితో ఊరుకోక క్రూరులై ఆ తలారుల మాండవ్య మహర్షిని దొంగలతో కలిపి బంధించి రాజు వద్దకు తెచ్చి ధనాన్ని అపహరించినవారు వీరేనని చెప్పి, ధనాన్ని అప్పగించారు. ఆ రాజు కూడా ముందూ వెనుకా ఆలోచించకుండా, నిజానిజాలు తెలుసుకోకుండా దొంగలను చంపించి, మాండవ్యుడు దొంగమునే అని అతనికి కొరత (శూల ప్రోతం) వేయించాడు. ఇనుప సలాకలో మాండవ్యుని దిగవేసి కట్టివేయించినా, ఆ మహాతపస్వి ఎంతమాత్రం చలించలేదు.

"మునివరుండట్లుండియు తన
మనమున నతిశాంతుడయి సమత్వమున తప
మ్మొనరించె ననశనుండ
య్యును బహుకాలంబు ప్రాణయుక్తుం డగుచున్

-ఆ.ప – చ.ఆ

ఆవిధంగా శూలానికి గుచ్చబడినా కూడా ఆ మునిశ్రేష్ఠుడు మనసులో ఏమీ బాధపడలేదు. కోపం తెచ్చుకోలేదు. అతి శాంతమనస్కుడై, సమస్వభావంతో (సుఖ దుఃఖాలను ఒక్క విధంగానే అనుభవిస్తూ) తపస్సు చేశాడు. అందుచేతనే మాండవ్యుడు మహామునిగా కీర్తించబడ్డాడు. ఆహారం తీసుకోకపోయినా, యోగిగా భగవద్ధ్యానంలో నిమగ్నుడు కావడంతో చాలాకాలం ప్రాణాలతో ఉండి తపస్సు చేయగలిగాడు. ఆవిధంగా, శరీర బాధను లెక్కచేయకుండా, అహర్నిశలూ నిర్విరామంగా తపస్సు చేస్తున్న మాండవ్యుని దీక్షను చూసి, తపోనిరతులైన మహర్షులు మెచ్చుకొని, ఒకనాటి రాత్రిపూట పక్షులై అతనిని సమీపించి పరమార్శించారు.

"మునీశ్వరా! నీ తపో మహిమ మమ్మల్ని ఆకట్టుకుంది. ఇంత గొప్ప తపస్వివైన నీకు ఇంత దుఃఖాన్ని ఎవరు కలిగించారు? వారు ఎంతటి పాపాత్ములై ఉండాలి? చెప్పు మహాత్మా" అని పక్షుల రూపంలో వచ్చిన మహర్షులడగగా మాండవ్యుడు దేనికీ చలించకుండా నిర్మలమైన మనస్సుతో వారివైపు చూశాడు.

"ఎఱిగి యెఱిగి నన్నడుగంగ నేల దీని
సుఖము దుఃఖంబు ప్రాప్తించుచోట నరుడు
తగిలి తన కర్మవశమున తనరుఁ దాన
కర్తగా కన్యులకు నేమి కారణంబు?"


-ఆ.ప – చ.ఆ

"మహానుభావులారా! మీకన్నీ తెలుసు. తెలిసి తెలిసీ నన్నెందుకడుగుతున్నారు? మానవుడు తన పూర్వజన్మలలో చేసిన పాపపుణ్యాలననుసరించి దుఃఖాన్నిగాని, సుఖాన్నిగాని ఈ జన్మలో అనుభవిస్తాడు. తన దుఃఖానికి గాని, కష్టానికి గాని తానే కర్త అవుతాడు కాని వేరేవారు ఎందుకు కర్తలౌతారు? నేను చేసిన పాపానికి నేనే కర్తను. గనుక నేనీ బాధనుభవించి తీరవలసిందే" అని మాండవ్యుడు పక్షుల రూపంలో ఉన్న మహర్షులకు చెప్పాడు. ఆ మాటలు ఆ నగర రక్షకులకు వినబడటంతో, వారు వెంటనే రాజు వద్దకు వెళ్ళి విషయాన్ని వివరించి చెప్పడంతో రాజు పశ్చాత్తాపంతో మాండవ్యుని శిక్ష నుంచి విడిపించాలని దృఢ నిశ్చయుడయ్యాడు.

మహారాజు మాండవ్య మహాముని వద్దకు వచ్చి, ఆ మహాత్ముడికి నమస్కరించి, తన అజ్ఞానాన్ని క్షమించి, కరుణించమని ప్రార్థించాడు. ఆ మహాత్ముని శరీరంలో గుచ్చి ఉంచిన శూలాన్ని లాగివేయబోగా అది బయటకు తీసివేయటానికి రాకపోవడంతో దాని మొదలును మెల్లగా రాజు నరికించివేశాడు. కాని, అతని కంఠంలో ఒకప్రక్క భాగంలో మిగిలి ఉన్న శూలభాగం అక్కడే ఉండిపోయింది. శూలభాగం వేదనకు గురి చేస్తున్నా పట్టించుకోకుండా ఆ మహర్షి ఘోర తపస్సు చేసి పుణ్యాన్ని పొందాడు. ఆ పుణ్యఫలంతో మాండవ్యుడు లోక లోకాలన్నీ సందర్శించాడు. ఆ పుణ్యలోకాలన్నిటినీ దాటి ఒకనాడు యమధర్మరాజు నగరానికి వెళ్ళాడు. సింహాసీనుడై యున్న యమధర్మరాజును చూసి అంతవరకు దాగి ఉన్న తన మనోవేదనను వెళ్ళబుచ్చుకొన్నాడు.

"దండధర! యిట్టి దారుణ
దండమునకు నేమి దుష్కృతము చేసితి? ను
గ్రుండవయి తగని దండము
దండింపగ బ్రాహ్మణుండ తగునే నన్నున్?"

-ఆ.ప – చ.ఆ



''యమధర్మరాజా! నేనేమి పాపం చేశానయ్యా? ఇంత దారుణమైన శిక్ష విధించావు. వేద వేదాంగ పారంగతుడను, తపోనిధి అయిన బ్రాహ్మణుడిని కదా! ఉగ్రమూర్తివై నన్నీ విధంగా తగని శిక్షతో శిక్షించడం నీకు న్యాయమేనా?'' అని ప్రశ్నించిన మాండవ్యునికి అతడే దోషం చేశాడో తెలియజెబుతాడు యమధర్మరాజు. మాండవ్య మహర్షి ఎంత గొప్ప తపస్సు చేసి ఉండకపోతే దేవలోకాలన్నీ తిరుగగలుగుతాడు? యమలోకానికి వెళ్ళటమే కాక యమధర్మరాజునే ప్రశ్నించగలుగుతాడు?


**"సొలయక తూనిగలం గొ**
**ఱ్ఱుల పెట్టితి నీవు నీ చిఱుత కాలము త**
**త్ఫల మిప్పుడనుభవించితి**
**తొలగునె హింసాపరులకు దుఃఖ ప్రాప్తుల్"**

**-ఆ.ప – చ.ఆ**

''మాండవ్యా! నీకు గుర్తుందో లేదో? నీ బాల్యంలో తూనీగలను పట్టుకుని, వాటిని ఎగిరిపోనీయకుండా మేకులతో (శూలాలతో) గుచ్చి బాధించేవాడివి. వాటికి వేసిన కొఱతే నీకిప్పుడు అనుభవం లోకి వచ్చింది. ఆనాటి పాప ఫలాన్ని అనుభవించక తప్పలేదు. వాటికి నీవు వేసిందీ ఉగ్రదండనే మరి! ఇతరులను హింసించేవారు తరువాతి కాలంలో దుఃఖించక సంతోషించగలరా? ఆ కొఱతే నీవింత కాలం అనుభవించింది'' అని చెప్పిన యమధర్మరాజు మాటలకు మాండవ్య మహర్షి క్రోధ వివశుడైనాడు.

''యమధర్మరాజా! నా మాట కూడా విను. పురుషుడు పుట్టిన దగ్గర నుంచి పధ్నాలుగు సంవత్సరాల వయస్సు పూర్తి అయ్యేటంత వరకు 'బాలుడు' అని చెప్పబడతాడు. బాల్యావస్థలో ఏ తప్పు చేసినా అతడు పెద్దగా పాపాన్ని పొందడు. బాలుడికి ఎవరైనీ కీడు చేస్తే వారు పాపులౌతారు. ఇది నేను పెట్టిన నియమం. ఎవరు దీనినతిక్రమించినా పాపఫలం అనుభవించక తప్పదు. ఈ ధర్మాన్ని పాటించకుండా నీవు నన్ను క్రూరంగా శిక్షించావు. బాల్యంలో నేను చేసిన స్వల్పదోషం నీకు చాలా పెద్ద దోషంగా కనిపించింది. నీవు చేసిన పాపానికి నిన్ను నేనిప్పుడు శపిస్తున్నాను. ''మనుష్య లోకంలో శూద్ర వనితకు పుత్రుడవై పుట్టుదువు గాక!'' అని మాండవ్యుడు శపించటంతో యముడు ఆ బ్రహ్మర్షి శాపాన్ని మరల్చలేక విదురుడుగా జన్మించాడు. దిక్పాలకులే బ్రహ్మర్షి వాక్కులను అధిగమించలేరంటే ఆ బ్రహ్మర్షుల తపశ్శక్తి ఎంతటి మహత్తరమైనదో అర్థమౌతుంది.

జనమేజయ మహారాజా! ధర్మమూర్తి అయిన విదురుని పలుకులను విశ్వసింపకపోవటం వల్లను, నారద కణ్వాది దేవర్షి బ్రహ్మర్షుల హితబోధలను తలకెక్కించుకోకపోవటం వల్లను, సాక్షాత్తు జగన్నాథుడైన శ్రీకృష్ణుని ధిక్కరించటం వల్లను దుర్యోధనాది పాపాత్ములు ప్రాణాలు కోల్పోక తప్పలేదు. మాండవ్య మహర్షికున్నంత శాంతచిత్తం గల పాండవులు ఎన్ని కష్టాలు వచ్చినా శాంత సహనాలతో వాటినన్నిటినీ ఎదుర్కొని ఉన్నత స్థితిని అందుకోగలిగారు'' అని చెప్పిన వైశంపాయనుని మాటలలో గల ఆంతర్యాన్ని గ్రహించి జనమేజయుడు శాంత గుణౌన్నత్యాన్ని పొగడుతూ, బ్రహ్మర్షి కాగలిగిన మాండవ్యునికి మనసులోనే నమస్కరిస్తూ నిజమందిరానికి వెళ్ళిపోయాడు. **(సశేషం)**




**గత సంచిక తరువాయి**

వాకిట వేచి ఉన్నాడు. సీతాలక్ష్మణులతో వేచి ఉన్నాడు అన్నాడు. విన్నాడు మహారాజు.

**స సత్యవాదీ ధర్మాత్మా గాంభీర్యాత్ సాగరోపమః**
**ఆకాశ ఇవ నిష్పంకో నరేంద్రః**

అతడు ఆ మహారాజు సత్యసంధుడు. ధర్మనిరతుడు. సముద్రంలా గంభీరుడు. ఆకాశంలా స్వచ్ఛమైనవాడు. సుమంత్రునితో అంటున్నాడు. నా భార్యలందరినీ పిలిపించు. ధర్మాత్ముడైన రాముణ్ణి చూడాలి.

రామ వనవాస వార్త అంతఃపురం పాకింది. భార్యలందరూ బాగా ఏడ్చారు. కన్నులు ఎర్రబారాయి. కౌసల్యా సుమిత్రలతో పాటు తక్కిన భార్యలు మూడొందల యాభై మంది వచ్చారు. సీతారామ లక్ష్మణులు వచ్చారు.

దశరథుడు చూశాడు రాముణ్ణి. తటాలున లేచాడు. వేగంగా నడిచాడు. దుఃఖార్తుడై ఉన్నాడు. రాముణ్ణి చేరలేకపోయాడు. మధ్యలో తెలివి తప్పాడు. కింద పడిపోయాడు.

అన్నదమ్ములు చూశారు. పరుగు తీశారు. తండ్రిని లేపారు. కౌగలించుకున్నారు.

రామ రామ – అయ్యో అంటూ భార్యలందరూ గొల్లుమన్నారు. గుండెలు బాదుకున్నారు. వారి ఏడుపులకు పెడబొబ్బలకు ఆభరణాల చప్పుళ్ళకు ఆ భవనమంతా కంపించి పోయింది.

మహారాజును ఎత్తుకున్నారు. పడకమీద పడుకోబెట్టారు రామ లక్ష్మణులు. కొద్ది క్షణాలు గడిచాయి. స్పృహలోకి వచ్చాడు దశరథుడు. అంటున్నాడు రాముడు.

''మహారాజా మీ ఆజ్ఞ. నేను దండకారణ్యం వెడుతున్నాను. నాతో సీతా లక్ష్మణులూ వస్తున్నారు. అనుమతి కోసం వచ్చాం.

విన్నాడు దశరథుడు. హృదయం ఆర్ద్రమైంది. కన్నీరు కారిపోతోంది.

''రామా! కైకేయికి ఎప్పుడో వరాలిచ్చాను. మోసపోయాను.

**"అయోధ్యా యస్త్వ మేవాద్య భవ రాజా నిగృహ్యామామ్"**

రామా నన్ను నిగ్రహించు. నన్ను తోసెయ్. బంధించు. ఈ

అయోధ్యకు రాజువైపో – అది దశరథుని అశక్తత. ఆవేదన.
తండ్రి సత్యపాశంతో బంధింపబడ్డాడని గ్రహించాడు రాముడు. అంటున్నాడు.
"తండ్రీ నవ పంచ చ వర్షాణి – వనాల్లో తొమ్మిదేళ్ళ తర్వాత అయిదేళ్ళు (పద్నాలుగేళ్ళు) ఎంతలో గడిచిపోతాయి. తిరిగి వస్తాను. నీ పాదాల చెంత వాలుతాను"
దుఃఖ నిమగ్నుడైనాడు మహారాజు. దీనుడైనాడు. పక్కనే నిలబడి వుంది కైకేయి.
"రాముణ్ణి పంపించెయ్" – భర్త చెవిలో ఊదింది.
ఒత్తిడి తెస్తోంది మాట ఎక్కడ తప్పుతాడో అని ఆమె భయం. తొందర పెడుతోంది.
నిట్టూర్చాడు దశరథుడు. అంతున్నాడు. "రామా! నీవు సత్యశీలుడవు. ధర్మనిరతుడవు. నీది దృఢ సంకల్పం. నాది ఒక కోరిక. ఈ రాత్రి ఇక్కడే వుండు. ఒక్కపూట నిన్ను కండ్లారా చూస్తాను. సంతోషిస్తాను. రేపు పొద్దునే పోదువులే".
మళ్ళీ అంటున్నాడు ధైర్యంతో. "నిన్ను అడవులకు పంపడం ఇష్టం లేదు. ఒట్టేసి చెబుతున్నాను. ఇది నిజం. ఈ కైక నివురు గప్పిన నిప్పు. తన పన్నాగం నాకు తెలియనివ్వలేదు. నాతో ప్రతిజ్ఞలు చేయించుకుంది. చిక్కుల్లో పడేసింది. మన వంశాచారాన్ని మంట కలిపింది".
కన్నీరు కార్చాడు. రాముణ్ణి గట్టిగా కౌగిలించుకున్నాడు. మూర్ఛపోయాడు. కైకేయి తప్ప రాణులందరూ బోరున ఏడ్చారు. సుమంత్రుడు తెలివితప్పి పడ్డాడు.
భవనమంతా హాహా కారాలతో నిండిపోయింది.

## సుమంత్రుని హెచ్చరిక

సుమంత్రుడు తెలివిలోకి వచ్చాడు. కోపోద్రేకంతో ఊగిపోయాడు. తల అటు ఇటు తిప్పాడు. పదే పదే నిట్టూర్చాడు. ముఖం ఎర్రబడింది. అది నెత్తురు ముద్దలా కనిపించింది. చేతులు నలుపుకున్నాడు. నిప్పులు చెరిగాయి కన్నులు. కుత కుత ఉడికిపోయింది మనస్సు. పరుష పదజాలంతో కైకేయి హృదయాన్ని ముక్కలయ్యేట్లు మాట్లాడసాగాడు. ఆ తీవ్రవచనాలు వజ్రతుల్యాలు. అవి వాగ్బాణాలు ఆమె నసాళానికి తాకుతున్నాయి.
"కైకా దశరథుడు నీకు మాత్రమే నాథుడు కాదు. ఈ జగత్తులోని సకల చరాచర ప్రాణులకు నాథుడు. దేవేంద్రుని లాంటివాడు. మహాసముద్రంలా గంభీరుడు. నీ కుట్రలతో చేష్టలతో మాటలతో ఆయన్ని తిరస్కరించావు. పరితపింప చేశావు. ఆయన నీకు భర్త. నిన్ను పోషిస్తున్నాడు. ఆ మహానుభావుణ్ణి అవమానిస్తున్నావు. కోటి మంది కొడుకులను కని పెంచడం కన్నా కట్టుకున్న భర్తను ఒకణ్ణి అనుసరించడం మెప్పించటం ఆడదాని ధర్మం".
"రాజు చనిపోతే అతని పెద్ద కొడుకు రాజు అవుతాడు. అది ఇక్ష్వాకు వంశ సంప్రదాయం. ఈ మహారాజు బతికి ఉండగా ఆ సంప్రదాయాన్ని ఆ కులాచారాన్ని మంట కలుపుతున్నావు. నీ కుతంత్రం సఫలం కావచ్చు. భరతుడు రాజు కావచ్చు. ఈ అయోధ్యలోని పౌరులు జానపదులు అందరూ రామునితో నడుస్తారు. బంధువులు మిత్రులు బ్రాహ్మణులు సాధువులు యోగ్యులైన వారెవరూ ఇక్కడ ఉండరు".
"నీవు అధర్మానికి పాలపడ్డావు. వసిష్ఠాది మహర్షులు తమ శాపాయుధాలను ఎందుకు ప్రయోగించలేదు? నిన్నెందుకు దహించలేకున్నారు? ఈ నేల ఎందుకు బద్దలు కాలేదు? నాకాశ్చర్యంగా ఉంది. తియ్యని పండ్లనిచ్చే మామిడి చెట్లను గొడ్డలితో నరికేస్తారు. వేప చెట్టుకు పాలు పోస్తారు. అది చేదు పండ్లు ఇస్తుంది. వేపచెట్టు నుంచి తేనె రాదు. అలాగే నీ తల్లి స్వభావం నీకు వచ్చింది.

## కైకేయి తల్లి

పూర్వం మీ నాన్నగారు ఒక యోగిని దర్శించారు. ఆయన మీ నాన్నగారికి ఒక వరమిచ్చాడు. సమస్త ప్రాణుల భాషలు భావాలు తెల్సుకునే శక్తి నీ తండ్రి గారికి అబ్బింది. అప్పట్నుంచి అనేక జీవుల భాషలు వినేవాడు. ఒకరోజు పడకమీద పడుకొని ఉన్నాడాయన. గోడమీద చీమలు పొరాడుతున్నాయి. వాటి మాటలు విన్నాడు. నవ్వాడు. ఒకసారి కాదు, రెండు మూడు సార్లు నవ్వాడు. నీ తల్లికి దుర్గతి దాపురించింది. తనని చూసి నవ్వాడు అనుకుంది. కోపించింది. నవ్వుకు కారణం అడిగింది. చెప్పనన్నాడు నీ తండ్రి. చెబితే నాకు చావు తప్పదన్నాడు.
"చస్తావో బతుకుతావో చెప్పాల్సిందే" అని మంకు పట్టు పట్టిందామె. యోగికి విషయం చెప్పాడు మీ నాన్న. ఆ రహస్యం చెప్పవద్దన్నాడు. అంతే నీ తల్లిని రాజ్యం నుంచి బహిష్కరించాడు. కుబేరునిలా సుఖంగా జీవించాడు.
"కైకా దుష్టురాలా నీ తల్లిలా నీవూ పెడదారి పట్టావు. మొండిదానివైనావు. తండ్రుల లక్షణాలు కొడుకులకు వస్తాయి. తల్లుల లక్షణాలు కూతుర్లకి వస్తాయి – అని లోకోక్తి. మీ అమ్మ బుద్ధి వచ్చింది నీకు. నీ మూర్ఖత్వంతో మహారాజు మరణిస్తాడేమో – అది జరగరాదు. రామ వనవాసం భరతుని రాజ్య పట్టాభిషేకం – ఎవరో నూరిపోశారు నీకు. నా మాట విను. సదాచార సంపన్నుడు – సర్వజన రంజనుడు – సర్వజన రక్షకుడు – సర్వధర్మ పరిరక్షకుడు రాముడు. ఆ జ్యేష్ఠుణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చెయ్".

అలా ఎన్నో హితవాక్యాలు చెప్పాడు సుమంత్రుడు. ఒక్క మాట కూడా ఆమె చెవికెక్కలేదు. కించిత్ కూడా మనస్సు చలించలేదు. చూపుల్లోని క్రౌర్యం మారలేదు.

మూర్ఖురాలు కైక. మనసు మార్చలేమనిపించింది మహారాజుకి. తనుచేసిన ప్రతిజ్ఞకు దుఃఖించాడు. నిట్టూర్చాడు. కళ్ళు చెమ్మగిల్లాయి. అంటున్నాడు సుమంత్రునితో.

''రాముడు అడవికి వెళ్తాడు. ఒక్కడుగా కాదు. చతురంగ బలాలు అతన్ని అనుసరిస్తాయి. నట గాయకులను కూడా రామునితో పంపించు. వాళ్ళు వినోదాన్ని కల్గిస్తూ ఉంటారు. మల్లయుద్ధ విశారదుల్ని పంపించు. వారి ప్రదర్శనలు చూస్తాడు రాముడు. ఆనందిస్తాడు. రాముని వెంట వెళ్ళేవారందరికీ రత్నాలు వస్త్రాలు బహుమతిగా ఇవ్వు. నగర వాసులను రామునికి తోడుగా పంపు. ఆహార పదార్థాలు ధన ధాన్యాలు పంపించు. అడవి దారులు తెల్సిన ఆటవికుల్ని రామునికి ముందుగా పంపించు. వనవాస కాలంలో పుణ్యస్థలాల్లో ఆగుతాడు రాముడు. అక్కడ యజ్ఞాలు ఆచరిస్తాడు. అనేక యజ్ఞ సంభారాల్ని పంపించు. ఋత్విజుల్ని కూడా వెంట పంపించు. అరణ్యవాసంలో ఎక్కడా రాముడు దుఃఖించరాదు''.

వినింది కైకేయి. భయపడింది. ముఖం తెల్లబోయింది. గొంతు ఎండిపోయింది. ఏడుపు వచ్చేట్లుంది. మహారాజుకి ఎదురుగా నిలబడింది. కళ్ళు పెద్దవి చేసి అంటోంది. ''రాముడితో అన్నీ పంపిస్తావా? పౌరుల్ని కూడా పంపిస్తావా? అయోధ్యా నగరం అపుడెలా ఉంటుందనుకున్నావు. మద్యాన్ని తాగి పారేసిన సురా భాండంలా ఉంటుంది. అలాంటి రాజ్యం భరతునికి అక్కర్లేదు'' అంటూ ఇంకా ఏదో అనబోయింది.

అడ్డు తగిలాడు దశరథుడు.

''దుర్మార్గురాలా మోయలేని బరువు నా నెత్తిమీద వేశావు. ఇంకా నన్నెందుకు హింసిస్తావు. రామునితో చతురంగ బలాలు పౌరులు పోకూడదని నీ వరంలో లేదు''.

దాంతో ఆమె మరేం మాట్లాడలేకపోయింది. అసహనం క్రమంగా క్రోధంలోకి మారింది. అది రెండింతలైంది. ''నీ వంశంలోని సగరుడు ఒక మహారాజు. అతణ్ణి ఆదర్శంగా తీసుకో. నువ్వూ రాముణ్ణి అడవులకు పంపించు''.

''ఛీ ఛీ'' అన్నాడు దశరథుడు.

అక్కడున్న వారంతా కైకను ఏవగించుకున్నారు. మంథర సలహా తన మొండితనం బెడిసి కొడుతుందేమోనని సందేహించిందామె.

అపుడు మహారాజుగారి మంత్రుల్లోని సిద్ధార్థుడు కలగ జేసుకున్నాడు. అతడు వృద్ధుడు. పరిశుద్ధుడు. నిష్కపటి. మహాత్ముడు అంటున్నాడు.

''అమ్మా సగరపుత్రుడు ఏం చేశాడో తెలుసా? ఆడుకునే పిల్లల్ని మరిపించేవాడు. ఎత్తుకెళ్ళేవాడు. సరయూ నదిలో ముంచేవాడు. వాళ్ళు గిలగిల్లాడుతుంటే చూసి సంతోషించేవాడు. అయోధ్యా వాసులందరూ మహారాజుని సందర్శించారు. పెద్దకొడుకు ఆగడాలు హద్దుమీరి పోతున్నాయని ఏకరువుపెట్టారు. ఈ రాజ్యంలో మేం ఉండాలా? నీ కొడుకు ఉండాలా? నిర్ణయించండి'' అన్నారు.

ప్రజాకంటకుడు పెద్దకొడుకు అని గ్రహించాడు సగరుడు. భార్యతో పాటు వాణ్ణి కట్టుబట్టలతో దేశం నుంచి బహిష్కరించాడు.

''అమ్మా రాముడు ఏ అపరాధం చేశాడు? ఎందుకు అడవులకి పంపాలి? చంద్రునిలో చిన్న మచ్చ ఉంది. కాని రాముడిలో కించిత్ దోషం కనిపించదు. నిజంగా రామునిలో లోపం ఉంటే చెప్పు తల్లీ మహారాజు అతణ్ణి అడవులకు వెళ్ళగొడతాడు. దోషరహితుణ్ణి, పరమ ధార్మికుణ్ణి అకారణంగా అడవులకు పంపటం అధర్మం. మహాపరాధం. అలాంటి అధర్మం తేజోవంతుడైన దేవేంద్రుణ్ణి సహితం దహించి వేస్తుంది. అమ్మా కైకేయీ! ఇంతవరకు చేసింది చాలు. రామ పట్టాభిషేకానికి విఘాతం కల్పించకు. లోకాపవాదాన్ని నెత్తిన వేసుకోవద్దు. నిన్ను నీవు రక్షించుకో. అదే నీకు శుభం''.

కైకేయిలో చలనం లేదు. వినింది కాని చెవిటిదానిలా ఉంది.

విన్నాడు దశరథుడు. శోకోపహతుడైనాడు. హీనస్వరంతో అంటున్నాడు.

''పాపిష్ఠురాలా సిద్ధార్థుడు చెప్పింది విన్నావా? నీకు మంచి నచ్చదు. నాకు తెల్సు. నీది కుత్సిత బుద్ధి. పాడు పనులే

**నారచీరలు అందుకున్నాడు రాముడు. తన సన్నని పట్టువస్త్రాలని విడిచాడు. ఆ వల్కలాలు రెండూ కట్టుకున్నాడు. తండ్రి ఎదుట లక్ష్మణుడూ కట్టుకున్నాడు. నార చీరలు చూసింది సీతమ్మ. వేటగాడి వలను చూసిన జింకలా భయపడింది. ఆ ముతక చీరలు ఎలా కట్టుకోవాలో తెలియలేదు. దిగులు చెందింది. సిగ్గు పడింది. ఆ జనకరాజ పుత్రిక, ఆ శుభాంగి, ఆ పతివ్రతా ధర్మదర్శినికి కట్టుకోవడం చేతకాలేదు. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.**

నీకు ఇష్టం. పెడదారి పట్టావు. చేయరాని పనులు చేస్తున్నావు. దుర్మార్గురాలా నాకు ఈ రాజ్యం వద్దు. ఈ సుఖభోగాలు వద్దు. అన్నీ వదిలేస్తున్నాను. రామునితో వెళ్ళిపోతాను. నీవూ నీ భరతుడూ యథా సుఖంగా రాజ్యం ఏలుకోండి''.

కైకేయి లాంటివారు ఈనాడు ఎందరో ఉన్నారు. ఎవరు ఎన్ని రకాల మంచి చెప్పినా వినరు. తమ లోపాల్ని ససేమిరా ఒప్పుకోరు. అందరినీ నొప్పిస్తారు. కలసి మెలసి ఉన్నవారిని విడదీస్తారు. అంత చేసినా వాళ్ళు బావుకునేది ఏమీ లేదు. చివరికి నిందల పాలవుతారు. కాని చరిత్ర గమనిస్తే – కొందరి జీవితాల్ని పరిశీలిస్తే – వాళ్ళు తమ లోపాల నుంచి తప్పుల నుంచి ఆటుపోట్ల నుంచి కొత్త పాఠాలు నేర్చుకున్నారు. మహానుభావులయ్యారు. చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. కనుక కైకలా ఉండరాదని సూచిస్తోంది శ్రీరామాయణం.

## నారచీరలు

అందరి మాటలు విన్నాడు రాముడు. అంటున్నాడు దశరథునితో. ''సర్వ సుఖభోగాలు పరిత్యజించాను. వన జీవితం సాగిస్తాను. వన్య ఫలాలే నాకు ఆహారం. గొప్ప ఏనుగును ఒకడు దానం చేస్తాడు. దానికి కట్టిన తాడును ఆశిస్తాడా? తండ్రీ నా వెంట సేనలు వద్దు. వస్తు వాహనాలు వద్దు. ధన ధాన్యాలు వద్దు. పురజనులు వద్దు. విషయాసక్తులు లేనివాణ్ణి. అవన్నీ నాకెందుకు? భరతుని సొత్తు నాకెందుకు? రెండు నారచీరలు ఇవ్వండి. ఒక గడ్డపార, ఒక గంప ఇస్తే చాలు. సంతోషంగా పోతాను''.

నలుగురు నవ్వితే నాకేమిటి సిగ్గు అన్నట్లు కైక కదిలింది. నడిచింది. తిరిగివచ్చింది. నారచీరలు తెచ్చి ఇచ్చింది. అదంతా క్షణాల్లో జరిగిపోయింది. అంతఃపుర జనుల సమక్షంలో 'ఇదో తీసుకో కట్టుకో' అంది రామునితో.

నారచీరలు అందుకున్నాడు రాముడు. తన సన్నని పట్టువస్త్రాలని విడిచాడు. ఆ వల్కలాలు రెండూ కట్టుకున్నాడు. తండ్రి ఎదుట లక్ష్మణుడూ కట్టుకున్నాడు. నార చీరలు చూసింది సీతమ్మ. వేటగాడి వలను చూసిన జింకలా భయపడింది. ఆ ముతక చీరలు ఎలా కట్టుకోవాలో తెలియలేదు. దిగులు చెందింది. సిగ్గు పడింది. ఆ జనకరాజ పుత్రిక, ఆ శుభాంగి, ఆ పతివ్రతా ధర్మదర్శినికి కట్టుకోవడం చేతకాలేదు. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. ఒక చీర భుజం మీద వేసుకుంది. మెడచుట్టూ తిప్పింది. రెండోదాన్ని ఏం చేయాలో తెలియలేదు. బిక్కమొగం వేసింది. గంధర్వరాజు లాంటి రాముడు చూశాడు.

''తాపసాంగనలు ఎలా ధరిస్తారు'' – అడిగింది రాముణ్ణి.

ఆమె కట్టుకున్న పట్టుచీర మీద నారచీర కట్టబోయాడు.

చూశారు అంతఃపుర స్త్రీలు. పురస్త్రీలు కంటనీరు పెట్టారు. అంటున్నారు రామునితో ''రామా లక్ష్మణుడు నీకు తోడుగా ఉంటాడు. నీవు అడవులకు వెళ్ళిపో. ఈ సీతమ్మ సుకుమారి. మంగళ స్వరూపిణి. మునిపత్నుల్లా వనాల్లో ఉండలేదు. ఈమెను మా దగ్గరే ఉంచు. నీవు తిరిగి వచ్చేదాక మేం జాగ్రత్తగా చూసుకుంటాం. ఆ విధంగానైనా మా జన్మలు ధన్యమవుతాయి. ఇది మా ప్రార్థన''. ఆ మాటలు విన్నాడు రాముడు. చీరలు ఎలా కట్టాలో – చూపించాడు సీతమ్మకు. ఆ వల్కలాలు ధరిస్తోంది జానకి. చూశాడు రాజగురువు వసిష్ఠుడు. అంటున్నాడు కైకతో.


''దుర్మార్గురాలా నీకు దుర్బుద్ధి పుట్టింది. హద్దు మీరిపోతున్నావు. వంశ మర్యాద మంట గలుపుతున్నావు. మహారాజును మోసం చేశావు. తృప్తి లేదా నీకు. ఇపుడు మైథిలిని వంచిస్తున్నావు. ఆమె అడవికి పోరాదు. ఇక్కడే ఉంటుంది. రామునికి ప్రతినిధి సీత. సింహాసనం అధిష్ఠిస్తుంది. రాజ్యపాలన చేస్తుంది. ఒకవేళ సీత అడవులకి వెళితే – మేమూ వెళ్తాం. పురజనులు వెళతారు. దాసదాసీ జనులు వెళతారు. ధనధాన్యాలు అడవికి చేర్తాయి. వస్తు వాహనాలు వనానికి వచ్చేస్తాయి. పశువులు పక్షులు మృగాలు పాములు వెళతాయి. చెట్ల ఆకులన్నీ రాలిపోతాయి. ఎండిన కొమ్మలు మిగుల్తాయి. అవి రామునివైపు చూస్తుంటాయి. అమ్మా కైకా, సీత నీ కోడలు. ఆ నారచీరలు తీసేయించు. అమూల్య వస్త్రాలు ఇప్పించు. ఆభరణాలిప్పించు. రామునికే వనవాసం. నీ వరాల్లో సీత ప్రస్తావన లేదు. సకల వస్త్రాలంకార భూషితురాలిగా చెయ్''.

బ్రాహ్మణోత్తముడు, అప్రతిమ ప్రభావంతుడు, కులగురువు వసిష్ఠ మహర్షి ఎంతో చెప్పాడు. ఆ మాటలు ఆమె చెవికి సోకినాయి. ఏమీ విననట్లే వుంది. ఏ స్పందనా లేదు.

అటు సీత మనసూ మారలేదు. రాముని అనుసరించింది. నారచీరలు ధరించింది. చూశారు అంతఃపురాంగనలు. దుఃఖించారు. రాజుని ఛీ అన్నారు. కైకని ఈసడించారు. నిందించారు.

దుఃఖాక్రాంతుడైనాడు దశరథుడు. ధర్మం మీద అసహ్యం. కీర్తి ప్రతిష్ఠల మీద విరక్తి. బతుకు మీద రోత. వేడి నిట్టూర్పులు విడిచాడు. క్షణకాలం మనసు బుద్ధి పనిచేయలేదు. ఏ మాట్లాడాలో తెలియరాలేదు. ఉత్తర క్షణంలో తేరుకున్నాడు. మనసులో నిబ్బరం – బుద్ధిలో దృఢత్వం తెచ్చుకున్నాడు. అంటున్నాడు. **(సశేషం)**

కావ్యాలు ఎక్కువగా పురుషులే రాస్తున్న కాలంలో అక్కడక్కడ కొంతమంది స్త్రీ కవయిత్రులు మొల్ల, తరిగొండ వెంగమాంబ, రంగాజమ్మ, తాళ్ళపాక తిమ్మక్క, ముద్దు పళని వంటి వారు కూడా కవిత్వం చెప్పారు. కావ్యాలు రచించారు. వారిలో తాళ్ళపాక తిమ్మక్క, మొల్ల భక్త కవయిత్రులు. అలాంటి వారిలో ఒకరు మీరా.




# భక్త మీరాబాయి

- గోనుగుంట మురళీకృష్ణ

మీరా రాజస్థాన్ కి చెందిన రాజవంశంలో పుట్టింది. మీరా రెండేళ్ళ వయసులోనే తల్లి మరణించింది. ఆమె సంరక్షణా భారం తాతగారు వహించారు. తండ్రి జీవించి ఉన్నా, ఎక్కువగా తాతగారితోనే అనుబంధం కలిగింది. ఆయన భక్తి హృదయం కలిగినవాడు. చిన్నప్పటి నుంచీ మీరాకు పురాణాలు, వేద గ్రంధాలు చెప్పేవాడు. మీరాకు కూడా చిన్నప్పటి నుంచే భక్తి అలవడింది.

పదిహేనేళ్ళ వయసులోనే మరో రాజవంశానికి చెందిన యువకుడితో ఆమెకి వివాహం చేసాడు తాత. అంత ప్రేమగా పెంచి పెద్దచేసిన తాతగారు మీరా వివాహం అయిన కొద్దిరోజులలోనే హటాత్తుగా కన్నుమూశాడు. అది ఆమె జీవితంలో ఎదురైన మొదటి దెబ్బ. వివాహం అయిన ఆరు సంవత్సరాలకే భర్త యుద్ధంలో మరణించాడు. ఇది మరో దెబ్బ. మరో ఆరు నెలలకి తండ్రి దేహం చాలించాడు. ఒకదాని తర్వాత మరొకటి సంభవిస్తున్న ఈ దుర్ఘటనల వల్ల ప్రపంచంలోని నిస్సారత అర్థం కాసాగింది మీరాకు. జీవితం నీటి బుడగ లాంటిది. ఎప్పుడు పగిలి పోతుందో చెప్పలేము. ఈ శరీరంలో శక్తి ఉన్నప్పుడే మనసు భగవంతుడి వైపు మళ్ళించాలి అనిపించింది. ఆమెలో భక్తిభావం మేల్కొంది. మొదటి కవిత రాసింది ఇలా....

**"ఎందుకీ జంజాటము, జగతిన జీవనము స్వల్పము**
**కాయము మిధ్య, కాసులు మిధ్య , ప్రపంచమంతయు మిధ్య"**

మీరా బాల్యంలోను, యవ్వనంలోను శ్రీకృష్ణునే ధ్యానించేది. ఇప్పుడు ఈ భక్తి గాఢమై పరిపక్వత చెందాయి. ఇప్పుడామెకు గిరిధారుడు అవతార పురుషుడు, పరమాత్మ స్వరూపుడు. ఎప్పుడూ కృష్ణ లీలలను గానం చేసేది. అయన మీద కవితలను ఆశువుగా చెప్పేది. ఒకరోజు తన గదిలో ఒంటరిగా కుర్చుని తంబుర మీటుకుంటూ ఇలా పాడుకుంటూ ఉంది.

**"నీరు లేని కమలము వోలె, జాబిలి లేని రాతిరి వోలె**
**నిను చూడక నీ సఖి యున్నదోయి, దినమున ఆకలి**
**దప్పులు లేవు, రాతిరి నిదురయే రాదు,**
**అంతర్యామీ బాధింతువేమి, దయతలచి వేంచేయి**
**జన్మజన్మల నీ దాసి మీరాకు నీ చరణములే శరణమోయి"**

ఈ గీతం ఆమె తోడికోడలు విన్నది. అప్పటికి భర్త మరణించటం వలన అతని తమ్ముడు రాజ్యానికి పాలకుడు




అయ్యాడు. తోడికోడలు, భర్త దగ్గరకు వెళ్లి "మీరా గదిలో ఎవరో పురుషుడు ఉన్నాడు. మీరా అతనితో మాట్లాడటం నేను విన్నాను" అని చెప్పింది. ఆ మాట వినగానే మరిదికి ఆగ్రహం వచ్చింది. తమ వంశానికి కళంకం కలిగేలా ప్రవర్తిస్తున్నది అని అనుకున్నాడు. కోపంతో కత్తి తీసుకుని మీరా గది దగ్గరకు వెళ్ళాడు. మూసి ఉన్న తలుపులు తెరిచి చూసాడు. మీరా వంటరిగా స్పృహ లేనట్లు, సమాధి స్థితిలో కుర్చుని తన్మయంగా పాడుకుంటూ ఉంది. ఆమె చుట్టూ ప్రకాశవంతమైన వెలుగుతో ఆ గది అంతా నిండిపోయింది. ఆ వెలుగుకి అతడి కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. ఒక్కసారిగా భయపడిపోయి బయటకు పరుగుదీసాడు.

మీరా కృష్ణభక్తితో అనేక గీతాలు పాడసాగింది. అవన్నీ కృష్ణ లీలలను తెలిపేవి, శ్రీకృష్ణ తత్వాన్ని వివరించేవి. అవి క్రమంగా బయటకు వ్యాపించాయి. భక్తురాలిగా ఆమె ఖ్యాతి వ్యాపించసాగింది. సాధువులు, భక్తులు అనేకమంది ఆమెను దర్శించుకోవటానికి కోటకు వచ్చేవారు. ఆ రోజుల్లో రాజకుటుంబ స్త్రీలు పరపురుషులను చూడకూడదు, మాట్లాడకూడదు, వేదాలు, పురాణాలు స్త్రీలు చదవటం నిషిద్ధం. ఇలాంటి చాందస ఆచారాలు ఎన్నో ఉండేవి. మీరా ప్రమేయం లేకపోయినా ఎక్కడెక్కడి నుంచో జనం మీరా దర్శనం కోసం, ఆమె భజనలు వినటం కోసం రాసాగారు.

అంతమంది రావటం ఆమె మరిదికి, రాజభవనం లోని పురుషులకు నచ్చలేదు. అతను, అతని సలహాదారులు ఆమెను అంతం చేయటం కోసం మరో ప్రయత్నం చేశారు. ఒక బంగారు గిన్నెలో విషం కలిపిన నీరు తీసుకుని వచ్చి శ్రీహరి చరణామృతం అనీ, సేవించమనీ ఇచ్చారు (ఇష్టదైవం యొక్క విగ్రహం కడిగిన నీరుని చరణామృతం అంటారు). ఆమె సంతోషంగా ఆ నీటిని తాగివేసింది. కానీ ఆ విషం మీరాపై ఎటువంటి ప్రభావాన్నీ చూపలేకపోయింది.ఆమె మోము అలౌకిక ప్రకాశంతో మరింతగా వెలిగిపోతూ ఉంది.

ఒకసారి మొగల్ చక్రవర్తి అక్బర్ తన ఆస్థాన గాయకుడు తాన్ సేన్ తో కలిసి భక్తితో నిండిన ఆమె గీతాలను వినటానికి మీరా దగ్గరకు వచ్చాడు. ఆమె భక్తికి, అద్వితీయమైన వ్యక్తిత్వానికి ముగ్ధుడై గౌరవపూర్వకంగా తల వంచి అభివాదం చేసి వెళ్ళిపోయాడు. అప్పటినుంచీ అక్బర్ మనసులో ఉదారభావాలు వెల్లివిరియసాగాయి. మీరా ఖ్యాతిని చూసి మరిదికి రోషం మరింత హెచ్చింది. ఆమెను అంతం చేయటం కోసం ఉపాయాలు వెతకసాగాడు. ఈ పరిణామాలు అన్నీ చూసిన మీరా విసిగిపోయి రాజమందిరం విడిచి వచ్చేసింది.

అక్కడి నుంచీ బయటకు వెళ్ళిన తర్వాత మీరా బృందావనంలో కొంతకాలం ఉన్నది. ఆమె శ్రీకృష్ణుడే ఏకైక పురుషుడుగా భావించి గోపికా భావంతో ఉపాసించింది. అక్కడ జనులందరూ ఆమెను ఎంతో గౌరవించేవారు. బృందావనంలో ఉన్న కాలంలో ఎన్నో భక్తిగీతాలను ఆలపించింది. అలంటి వాటిలో ఇది ఒకటి---

**"రామనామము వసించె నా మది,**
**నిను ఆరాధింతును, నను పరిహసింతురు లోకులు శ్యామసుందరా!**
**మీరా మతి భ్రమించెనని కొందరు, కులనాశిని యని కొందరు**
**ప్రచండ జ్వాల యని కొందరందురు**
**కానీ మీరా తన్మయ మాయెను హరి ధ్యానమున**
**భక్తి మార్గమనెడి కత్తి వాదరతోనే యమునిపాశము త్రెంచినది**
**గిరిధరా, నీ శబ్ద సరోవరమున నే లీనమైతిని".**

ఈ గీతం ద్వారా మీరా, భక్తిమార్గాన్ని కత్తి మీద సాము అంటుంది. ఈ మార్గాన్ని అనుసరించేవారిని లోకులు ఎగతాళి చేస్తారు, వారిని మతి చలించినవారని, కులానికి కళంకమనీ అంటారు. నేను భక్తి అనే శబ్ద సరోవరంలో లీనమైనాను అంటుంది.

మీరా బృందావనంలోనే ఉండిపోలేదు. అనేక క్షేత్రాలు దర్శించింది. తీర్థాలలో స్నానమాడింది. చివరకు ద్వారకకు వెళ్లి నివసించింది. ఎప్పటిలాగే ఎందరో సాధువులు, భక్తులు ఆమె శిష్యులుగా చేరారు. ఆమె గీతాలు విని తన్మయులయే వారు.

మీరా మరొక గీతంలో దీర్ఘకాలపు అంధకారం తర్వాత మానవజన్మ అనే పొద్దు ఉదయించింది అంటుంది. ఇతర ప్రాపంచిక సుఖాలు అన్నీ వదిలిపెట్టి ప్రొద్దు ఉండగానే ప్రభువు యొక్క నగరానికి చేరుకోవాలనే చింతను కలిగి యుండాలి అని చెబుతుంది.

**"ఓ మూర్ఖ బాటసారీ ఇంకనెందుకు ఆలస్యము**
**మార్గము దీర్ఘమైనది, పగలు స్వల్పముగా నున్నదిరా**
**అలోచించుము అమూల్యమీ అవకాశము**
**నగరము చేరుకొని నిర్భయుడవు కమ్ము**
**మీరాబాయి ప్రభువు గిరిధరుడు, నాకు లభించే నతి దగ్గరి మార్గమురా"**

మరొక చిన్నగీతంలో మీరా కర్మసిద్ధాంతాన్ని వివరిస్తుంది. ఈ ప్రపంచంలో జీవితం స్వల్ప కాలమే! కాబట్టి ప్రాపంచిక జంజాటంలో చిక్కుకోవటం ఎందుకు? తల్లిదండ్రులేమో జన్మనిచ్చారు. కానీ సృష్టికర్త మనలను కర్మ బంధనాలలో బంధించాడు. మనం అనుభవించే సుఖాలు, మనం చేసే పరోపకారాలు వీటన్నిటి ఫలితాలు మనకు లభిస్తాయి. మనం దేనిని ఇచ్చామో,దేనిని పుచ్చుకున్నామో ఆ లెక్క మాత్రమే మనతో వస్తుంది. ఇది తప్ప ప్రపంచంలో వేరొక వస్తువేదీ మనతో రాదు. భక్తి ద్వారానే భవసాగరాన్ని దాటగలమనీ మీరా అంటుంది ఈ గీతంలో –

**'జగతిన స్వల్పము జీవనము, ఎందులకీ జంజాటమురా**
**తల్లిదండ్రులు జన్మనిచ్చిరి, కర్మనొసగెను సృష్టికర్త**
**భుజించితిమెన్నో, వ్యయము చేసితిమెన్నో, చేసితిమెన్నో ఉపకారములురా**
**ఇచ్చిపుచ్చుకొన్నవే వెంటవచ్చును, రావిక వేరేవియును**
**మీరా ప్రభువు గిరిధరుడు, భక్తి నెరపి భవజలధి తరించుమురా"**

ఈ విధంగా మీరా భక్తి, ప్రేమ, విరహం, వైరాగ్యాల గురించి అనేక గీతాలను రచించింది. గానం చేసింది. గుజరాతీ భాషలో కూడా అనేక గీతాలు వ్రాసింది. గుజరాతీ సాహిత్యంలోని శ్రేష్ఠులైన భక్తకవులలో ఒకరుగా పేరుపొందింది.

కాలం మానవజీవితంలో ఎన్నో మార్పులు తెస్తుంది. నవ్వేవాడిని ఏడ్పిస్తుంది. ఏడ్చేవాడిని ఓదార్చి నవ్విస్తుంది. రాజుని బంటు చేస్తుంది. బంటుని రాజు చేస్తుంది. కాలం చేసే గారడీలకు అందరూ తల వంచవలసినదే! మీరా మెట్టినిల్లయిన మేవాడ్ రాజ్యం క్షీణించి నేడు సామాన్య ప్రాంతంగా మారింది. రాచరికం క్షీణించి రాజ పురుషులు అందరూ సామాన్య జనుల వలె నివసిస్తున్నారు. ఆనాడు మీరా మీద నిందలు మోపిన బంధువులు, ఆమెను ఎన్నో కష్టాలకు గురిచేసిన వారిలో పశ్చాత్తాపం కలిగింది. అందరూ మీరాను పెట్టిన బాధల వలెనే తాము ఇలా అయిపోయాము అని అనుకున్నారు.

మీరాను తిరిగి తీసుకురావటానికి ఆమె మరిది, తోడికోడలు, బంధువులు అందరూ కలిసి బ్రాహ్మణులను వెంటపెట్టుకుని ద్వారకకు వచ్చారు. తమ పశ్చాత్తాప హృదయాలను తెలియజేసి, ఇక నుంచీ ఆమె మార్గానికి అడ్డు రామనీ, ఆమె ఇష్టమైన రీతిలో ఉండవచ్చుననీ తెలియజేసారు. కానీ మీరా తిరిగి వెళ్ళటానికి ఇష్టపడలేదు.

"ఆ ఇంటితో నాకు ఋణం తీరిపోయింది. ఇక్కడ ఎంతో ప్రశాంతంగా, మనశ్శాంతిగా ఉంది. నా మనసు పరమాత్మ చరణాలమీద లగ్నం చేసి ఉంచాను. ఇహలోక బంధాలతో పనిలేదు" అని చెప్పింది.

కానీ వారెవరూ అంగీకరించలేదు. ఆమె వస్తేకానీ అక్కడ నుంచీ కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. ఆహార పానీయాలు తీసుకోవటానికి కూడా ఇష్టపడలేదు. తన కోసం వారు అలా నిరాహారంగా కూర్చోవటం మీరాను అమితంగా కలచివేసింది. కానీ తిరిగి వెనుకటి రోజుల్లోకి వెళ్ళటానికి మనసు అంగీకరించలేదు.

ఆ రోజు మీరా శ్రీకృష్ణ మందిరానికి వెళ్ళింది. ద్వారకావాసిని ధ్యానిస్తూ ఉండిపోయింది. మానవ శరీరంలో నిరంతరం మ్రోరుమోగే శబ్దమును, లోపలి ఆధ్యాత్మిక మండలాల దృశ్యాలను సూచిస్తూ మీరా ఇలా ధ్యానిస్తుంది.

**"మ్రోగుచున్నదిరా ఈ కాయమందున,**
**ఘంటానాదము మ్రోగుచున్నది**
**దశ ద్వారముల ఈ కాయమందున,**
**వెలువడు నిత్యము మృదంగ నాదము**
**"పూదోటలున్నవీ కాయమందున భ్రమరమే**
**సుగంధ మాఘ్రాణించును**
**వెలుగుచున్నది జ్యోతి కాయమందున**
**ఉజ్జ్వల ప్రకాశ బింబము నుండి వెలువడుచున్నవి**
**ధ్వని తరంగములు**
**అమరపురి వృత్తాంతము సంతులకే**
**ఎరుకయని పల్కు మీరాబాయి**
**ప్రభువు గిరిధరుని గుణగాన మొనర్చుచున్నది"**

ఆ మర్నాడు ఉదయం పూజారులు మందిర ద్వారం తెరచి చూసేసరికి అక్కడ మీరా లేదు. శ్రీకృష్ణుడి విగ్రహం మీద ఓ చీర వేలాడుతూ కనిపించింది. మీరా గిరిధరునిలో ఐక్య మైనదని అర్థమైంది అందరికీ.

మీరా అదృశ్యమైన సంవత్సరం 1546గా చెప్పబడుతున్నది. అప్పటికి ఆమె వయసు కేవలం 48 ఏళ్ళు మాత్రమే! ఆమె భక్తి, నిష్ఠ, ధృడత్వం, కృష్ణభక్తి, ఆమె జీవితము కాలగమనంలో ఒక ముద్ర వేశాయి.



# శ్రీకాళహస్తి చారిత్రక వైశిష్ట్యం

: డా|| గంగిశెట్టి శివకుమార్

ఉత్తరాదిలో కాశీలాగానే దక్షిణాదిన శ్రీకాళహస్తి ప్రాచుర్యం కలిగి ఉంది. అందుకే శ్రీకాళహస్తిని ''దక్షిణకాశీ'' అని అంటారు. ఆలయంలోని శిల్పశైలి, నిర్మాణశైలి తరతరాలు ముక్కున వేలేసుకునేటట్టు చేస్తూ ఉంటుంది. అంతంత పెద్ద రాతి స్తంభాలు ఎలా చెక్కారు? ఆ రాయిని ఎక్కడ నుండి తెచ్చారు? ఒక అంగుళం కూడా తేడా లేకుండా వరుసగా ఎలా నిలబెట్టారు? ఇవి ఎప్పటికీ అంతుచిక్కని ప్రశ్నలే.

శ్రీకాళహస్తికి మృత్యుంజయ క్షేత్రం, నవగ్రహ క్షేత్రం, ఉచ్ఛిష్ఠ క్షేత్రం, సద్యోముక్తి క్షేత్రం, పాపసంహార క్షేత్రం, సోమస్కంధ క్షేత్రం, రాహు కేతు క్షేత్రం,,, ఇలా చాలా పేర్లు ఉన్నాయి. ఇవన్నీ సువర్ణముఖీ, దేవాలయం, స్థలపురాణం ఆధారంగా ఏర్పడ్డవే.

కన్నడిగులు, తమిళులు ఈ క్షేత్రాన్ని 'తిరుకాళత్తి ఉడయర్ క్షేత్తిరం' అంటూ ఉంటారు. వారికిది ఇష్టమైన క్షేత్రం. తిరుకాళత్తి ఉడయర్ ఆలయ అభివృద్ధికి పాటుపడ్డ చోళరాజు పేరు. కేనోపనిషత్తు, ఈశావాసోపనిషత్తు, శివానందలహరి, సౌందర్యలహరి, శివపురాణం, బసవపురాణం, హరవిలాసం, కాళహస్తి మాహాత్మ్యంలలో శ్రీకాళహస్తి ప్రస్తావన కన్పిస్తుంది.

తమిళంలో శేక్కిలార్ రాసిన 'పెరియ పురాణం'లోను నత్కీరన్ రాసిన 'కాళత్తిపాది కయివైపాది' లోను, కన్నడంలో హరీశ్వర కవి రాసిన 'శివగణదరగళి' లోను కాళహస్తి వైశిష్ట్యం చెప్పబడింది.

క్రీ.శ 2,3 శతాబ్దాలకు చెందిన అప్పర్ సంబంధర్, మాణిక్యవాచికర్, సుందరమూర్తి ఈ క్షేత్ర సందర్శన చేశారు. ఆనాటి వైభవాన్ని వర్ణించారు. ఈ ఆలయం దాదాపు 2 వేల సంవత్సరాలకు ముందు నుండే వుందని అనేక చారిత్రక ఆధారాలు ఋజువు చేస్తున్నాయి. ఎన్నో రాజవంశాలు, వదాన్యులు ఈ ఆలయ అభివృద్ధికి పాటుపడ్డారు.

కాలగమనంలో కొంతకాలం కాళహస్తి నిరాదరణకు గురయింది. తరువాత దేవకోట రామనాథం శెట్టియార్ నడుం కట్టి అభివృద్ధి పథంలోకి శ్రీకాళహస్తిని తీసుకువచ్చారు. ఇప్పటికీ నదీ సమీపంలోని సూర్యపుష్కరిణి దగ్గర ఈయన విగ్రహాన్ని మనం చూడవచ్చు.

నదినుండి ఆలయానికి వచ్చేదారిలో ఒక పెద్ద గోపురం కన్పిస్తుంది. శిల్పశోభకు తార్కాణం ఈ గోపురం. దీన్ని 1506లో శ్రీకృష్ణదేవరాయలు నిర్మించారు. అది ఇటీవల కూలిపోవడం, తిరిగి పునర్నిర్మించడం జరిగింది. వీర నరసింహరాయలు 12వ శతాబ్దంలో 3 గోపురాలు నిర్మించాడు. ఇది గాక బిక్షాల గోపురం పేరుతో ఒక గోపురం కనిపిస్తుంది. ఒక భక్తురాలు విరాళాలు సేకరించి ఆ గోపురాన్ని నిర్మించింది. అందుకే బిక్షాల గోపురం అనే పేరు వచ్చింది. మొత్తం మీద 5 గోపురాలుండాలి. ప్రస్తుతం 3

గోపురాలే ఉన్నాయి. రెండు కాలగర్భంలో కలిసిపోయాయి.

ఈ క్షేత్రంలో దక్షిణం నుండి ఉత్తరానికి సువర్ణముఖి నది ప్రవహిస్తూ ఉంటుంది. ఆలయ ముఖద్వారం దక్షిణం. లోపల శివలింగం పడమర ముఖం, అంటే నదిని చూస్తూ ఉంటుంది. నదీస్నానం చేసివచ్చే వారికి ఆ దారిన అప్పట్లో ఆలయం లోపలికి వచ్చేవారు. ఇప్పుడా అవకాశం లేదు. జ్ఞానప్రసూనాంబ తూర్పుముఖం.

భిక్షాల గోపురం దాటి ఆలయానికి వెళ్తుండే దారిలో కుడిపక్క శ్రీకాశీ విశ్వనాథ, అన్నపూర్ణ దేవాలయం, వీరభద్రాలయం, బాల విఘ్నేశ్వరాలయం, బాల జ్ఞానాంబ ఆలయం, సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, పాతాళ వినాయకుని ఆలయం, శివయ్య గోపురం, గుర్రపుసాని మండపం, సదాశివేశ్వరస్వామి ఆలయం కన్పిస్తాయి. ఈ దారి పొడుగునా ఇరువైపులా అంగళ్ళు.

నదికి దగ్గరగా ఆలయానికి పడమరగా ఉండేది అగస్త్యుల వారి గోపురం. పూర్తి చోళ శిల్ప శైలితో కట్టబడిన ఈ గోపురం చాలా ప్రాచీనమైంది. ఈ గోపురం దిగువన అగస్త్యుని ప్రతిమను చూడవచ్చు.

నది నిండినప్పుడు ముత్తయిదువలు భక్తితో నదిలో పసుపు, కుంకుమలు, పూలు, టెంకాయలతో ఆరాధిస్తూ ఉంటారు. ఇది ఒక ప్రాచీన సంప్రదాయం. నదిని తల్లిగా భావించడం అనాదిగా వస్తున్న భారతీయ సంప్రదాయం. దీనికి సమీపాన చంద్రపుష్కరిణి, వసంత మండపం, శ్రీపాదాలు, సూర్య పుష్కరిణి, నాగదేవతల శిల్పాలు కనిపిస్తాయి.

దక్షిణ గోపురం ఎదురుగా క్రీ.శ 1516 లో కట్టిన నూరుకాళ్ళ మండపం కన్పిస్తుంది. దీన్ని రాయల మండపం అంటారు. దీని లోపలికి వెళ్ళి చూడడం ఇప్పుడు కుదరదు. చుట్టూ ఇనుప కచ్చడాలు బిగించి, దీన్ని కార్యాలయంగా వాడుతున్నారు. ఈ మండపానికి తూర్పున వేదిక, పొన్నవృక్షం కన్పిస్తాయి. ఈ పొన్న వృక్షానికి ఉత్తరాన శ్రీకాళహస్తిని పాలించిన జమీందార్లు నాలుగు కాళ్ళ మండపాన్ని నిర్మించారు. ఇక్కడ ఈశ్వర, జ్ఞాన ప్రసూనాంబల వసంతోత్సవం జరుగుతుంది.

నదికి పడమర ప్రాంతాన్ని పానగల్లు అనేవారు. ఆ పానగల్లు రాజులే మళయాళ స్వామికి ఏర్పేడు దగ్గర ఆశ్రమానికి స్థలం ఇచ్చారు. మద్రాసులో పానగల్లు పార్కు నిర్మించారు. ఇప్పుడా వంశీకులు ఎవరూ ఉన్నట్లు లేదు.

ఆలయంలో పదహారుస్తంభాల మండపం ఒకటి కన్పిస్తుంది. దీన్ని శ్రీకృష్ణదేవరాయల సోదరుడు అచ్యుతదేవరాయ మండపం అంటారు. ఆయన రాయలవారి తరువాత రాజ్యానికి వచ్చాడు. క్రీ.శ 1529లో ఆయన పట్టాభిషేకం మొదట తిరుమలలోను, తరువాత శ్రీకాళహస్తిలోను చేసుకున్నాడు. శైవ, వైష్ణవ తేడా లేదని తెలిపాడు.

నదీతీరంలోనూ, స్నానఘట్టాలలోనూ, గోపురాలమీదా వరాహ, ఖడ్గ, సూర్య చంరద ముద్రలు అధిక సంఖ్యలో కన్పిస్తుంటాయి. వరాహం అజ్ఞానానికి, ఖడ్గం జ్ఞానానికి, సూర్యుడు తేజస్సుకి, చంద్రుడు శాంతికి ప్రతీకలని పౌరాణికులు చెప్తారు. ఇవన్నీ విజయనగర రాజుల చిహ్నాలని చారిత్రక పరిశోధకులు చెప్తుంటారు. ఆలయంలో ఎక్కువభాగం నిర్మాణాలు విజయనగర ప్రభువులు చేసినవే.

11వ శతాబ్దంలో కులోత్తుంగ చోళుడు కూడా ఆలయ అభివృద్ధికి దోహదం చేశాడు. అప్పట్లో ఆయన పేరు మీదే శ్రీకాళహస్తిని, కులోత్తుంగ చోళపురం అని పిలిచేవారు. ఆలయం నిర్మించేటప్పుడు కూలీలు సాయంత్రం నది ఇసుకలో చేతులు కలిపితే కూలిడబ్బులు లభించేవట. కృతయుగంలో శ్రీకాళహస్తిని బ్రహ్మపురం అని, త్రేతాయుగంలో విష్ణుపురం అని, ద్వాపరయుగంలో నారదపురం అని, కలియుగంలో వరగుణపురం అని పిలిచేవారని పురాణాలు పేర్కొంటున్నాయి. వరగుణుడు మధురైరాజు. దక్షిణ భారత దేశంలో ఆడుదు సూర్యునికి, తిరుపతి చంద్రునికి, పళని కుజునకు, మధురై బుధునకు, తిరుచెందూరు బృహస్పతికి, శ్రీరంగం శుక్రునకు, తిరునల్లాట్టు శనైశ్చరునకు, శ్రీకాళహస్తి రాహు కేతువులకు నెలవులు. అందుకనే శ్రీకాళహస్తి రాహు కేతువులకు ప్రసిద్ధి. రాహువు జ్ఞానానికీ, కేతువు మోక్షానికీ అధిపతులు. కాంచీపురం పృథివీ లింగం, జంబుకేశ్వరం జలలింగం, తిరువణ్ణామలై జ్యోతిర్లింగం, శ్రీకాళహస్తి వాయులింగం, చిదంబరం ఆకాశలింగంగా ప్రసిద్ధికెక్కాయి. శ్రీ = సాలెపురుగు, కాళ = సర్పము, హస్తి = ఏనుగుల భక్త్యావేశాలకు గుర్తుగా 'శ్రీకాళహస్తి' పేరు విఖ్యాతమయింది. భక్త కన్నప్ప గాథ జగద్విదితమే. గర్భాలయంలో స్వామివారికి కుడివైపు ఉండే దీపకళికలో రెండు జ్యోతులుంటాయి. పైన ఉండే జ్యోతి గాలికి రెపరెపలాడుతూ ఉంటుంది. దిగువన నున్న జ్యోతి నిశ్చలంగా ఉంటుంది. అందువల్ల శ్రీకాళహస్తి వాయులింగంగా ఖ్యాతి పొందింది.

**"శేరతే సజ్జన మనాం స్యస్మిన్నితి శివః"**

**"శేతే సజ్జన మనస్వితివా"**

శివునియందు సజ్జనుల మనస్సులుండునని, ఆయన సాధువుల మనస్సులందు శయనించి ఉంటాడని అర్థం. ఈ శివరాత్రి సందర్భంగా ఆయన యందు మనస్సు లగ్నం చేసి ముక్తిని పొందుదాం.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

సేకరణ : కె.వి.రాఘవాచార్యులు

గత సంచిక తరువాయి

## 126. జామదగ్న్యాయ నమః

జమదగ్ని మహర్షి యొక్క కుమారుడు పరశురాముడు. తల్లి రేణుక. విష్ణుదేవుని దశావతారములలో ఆరవ అవతారము పరశురాముడు.

జమదగ్నికి కుమారుడుగ జన్మించిన విష్ణుమూర్తి అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

126 నుండి 135 వరకు గల నామములు పరశు రామావతార విషయకములు.

## 127. కుఠారిణే నమః

కుఠారము అంటే గండ్రగొడ్డలి. దానిని ఆయుధముగా గలవాడు పరశురాముడు.

కుఠారి అయిన పరశురామునిగ అవతరించిన విష్ణుమూర్తి యొక్క అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 128. కార్తవీర్య విదారణాయ నమః

కార్తవీర్యార్జునుడు హైహయ వంశము వాడు. ఇతని రాజ్యము నర్మదా నదీ తీరమున ఉండెను. ఇతని రాజధాని మాహిష్మతీ పురము. కార్తవీర్యార్జునుడు పరశురాముని తండ్రి యగు జమదగ్ని యొక్క హోమధేనువును బలవంతముగా తీసుకొని పోయినాడు. అప్పుడు పరశురాముడు కార్తవీర్యార్జునితో పోరాడి అతనిని చీల్చి సంహరించెను. ఈ కారణమున పరశురాముడు కార్తవీర్య విదారకుడుగా ప్రసిద్ధుడు.

కార్తవీర్య విదారణుడైన పరశురామునిగ అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 129. రేణుకాయా శ్శిరో హారిణే నమః

తండ్రి జమదగ్ని ఆజ్ఞను పాటించి తన తల్లి రేణుకాదేవి తలను ఖండించినవాడు పరశురాముడు.

జమదగ్ని భార్య యగు రేణుక అంగదేశపు రాజు అగు చిత్రసేనుని చూచి మనస్సు చలించగ ఆమె తన పాతివ్రత్య మహిమను కోల్పోయింది. అందుకు కోపించిన జమదగ్ని తన పుత్రుడగు పరశురాముని రేణుక తలను ఖండించమని ఆజ్ఞాపించినాడు. వెంటనే పరశురాముడు తండ్రి ఆజ్ఞను నెరవేర్చినాడు. అందుకు సంతోషించిన జమదగ్ని మహర్షి పరశురాముని ఏదైనా వరము కోరుకోమని చెప్పగా పరశురాముడు తన తల్లి రేణుకను బ్రతికించమని కోరినాడు. జమదగ్ని రేణుకను పునర్జీవితురాలిని చేసినాడు.

ఈ సంఘటన చేత పరశురాముడు రేణుకాయా శ్శిరోహారి అయినాడు.

తండ్రి ఆజ్ఞ చేత తల్లి తలను ఖండించిన పరశురామావతారమును ధరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

## 130. దుష్ట క్షత్రియ మర్దనాయ నమః

దుష్టులగు క్షత్రియులను – రాజులను సంహరించినవాడు – పరశురాముడు.

పరశురాముడు తన తండ్రి యగు జమదగ్నిని కార్తవీర్యార్జుని పుత్రులు హోమధేనువు కొరకు సంహరించగా, వారిపై కోపించి భూమిని క్షత్రియ శూన్యముగా చేయ నిశ్చయించినాడు. ముయ్యేడు మార్లు (21 సార్లు) దేశమంతా తిరిగి రాజులను, వారి పుత్రులను కూడ చంపి, వారి నెత్తురుతో తండ్రికి తర్పణము చేసినాడు. ఆ రాజుల నెత్తురు శమంత పంచకము అను పేరుతో అయిదు మడుగులుగ ఏర్పడినవి. ఈ అయిదు మడుగులు కురుక్షేత్రములో ఉన్నవి. ఇప్పుడు ఆ మడుగులలో రక్తము లేదు. నీరు ఉన్నది.

పరశురాముడు శివుని గూర్చి తపస్సు చేసి దివ్యాస్త్రములను పొందిన గొప్ప అస్త్ర విద్యా నిపుణుడు. ఇతడు చిరంజీవి. ద్వాపర యుగమున కృష్ణ రాయబార సందర్భమున పరశురాముడు కౌరవుల సభలో ఉన్నాడు. అంబ కారణముగా పరశురామునికి భీష్మునికి యుద్ధం జరిగినది. పరశురాముని దగ్గర ద్రోణుడు, కర్ణుడు విలువిద్య నేర్చుకున్నారు.

క్షత్రియ నాశకారి అయిన పరశురామునిగా అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 131. వర్చస్వినే నమః

మహా తేజస్సుతో ప్రకాశించిన వాడు పరశురాముడు. పరశురాముడు శివుని గూర్చి ఘోరమైన తపస్సు చేసి, దివ్యాస్త్రములను, పరశువును పొందినాడు. ఆ తీవ్రమైన తపస్సు చేత పరశురాముడు తేజస్సంపన్నుడైనాడు. పరశువు (గండ్ర గొడ్డలి) ఆయుధముగా గలవాడు పరశురాముడు.

వర్చస్వియైన పరశురామునిగా అవతరించిన విష్ణుమూర్తి అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 132. దానశీలాయ నమః

పరశురాముడు దేశమంతా తిరిగి ఆనాటి రాజుల నందరినీ వధించి వారి సంపదను, రాజ్యములను స్వాధీనం చేసుకున్నాడు. పరశురాముడు తను జయించిన రాజ్యముల నుండి సంపాదించిన ధనము అంతటినీ యజ్ఞము చేసి బ్రాహ్మణులకు భూరి దానములు చేసినాడు. తను జయించిన రాజ్యములన్నింటిని కశ్యపునకు దానము చేసినాడు. పరశురాముడు తను నివసించుటకు దక్షిణ దేశమునకు వచ్చి సముద్రముని కోరి రెండు యోజనముల భూమిని సంపాదించెను. అదియే నేటి గోకర్ణము. కేరళ ప్రాంతము.

దుష్యంతుని తమ్ముడగు దిష్యంతుని మునిమనుమడు, ఆశ్రితుని కుమారుడగు కేరళుడు పాలించిన దేశము అతని పేరుతో కేరళగా ప్రసిద్ధమైంది. గోకర్ణము కేరళ దేశము నందలి గొప్ప శివ క్షేత్రము.

ఇట్లు పరశురాముడు తను జయించిన రాజ్యములను – భూమిని, సంపదలను దానము చేసి దానశీలుడు అను నామధేయమును పొందినాడు.

దానశీలుడైన పరశురామునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

(సశేషం)

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యం
## (స్కాంద పురాణాంతర్గతం)

- డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 94915 79452

## భూదాన మహిమ

**గత సంచిక తరువాయి**

''భూదానాన్ని మహాదానంగాను, అతి గొప్ప దానం గాను పెద్దలు చెప్పారు. దీనివలన సకల పాపాలు నశించి మోక్షం లభిస్తుంది. ఈ భూదాన మాహాత్మ్యాన్ని శ్రద్ధతో విన్నచో భూదానం చేసిన ఫలితం పొందుతారు'' అని పూర్వం జరిగిన దానిని కామిని తన భర్తకు తెలియజేసింది. ఆ మాటలు విన్న భద్రమతి సంతోషంతో శేషాచలపతిని మనసులో ధ్యానించి శ్రేష్ఠమైన వేంకటాచలానికి వెళ్ళాలని సంకల్పించాడు.

ఆ తరువాత శాంతస్వభావుడు, సర్వధర్మ పరాయణుడైన భద్రమతి భార్యా పిల్లలతో కూడా సుశాలీ నగరానికి వెళ్ళాడు. అక్కడ సకలైశ్వర్యాలతో కూడిన 'సుఘోష'డనే బ్రాహ్మణుని ఐదు మూరల భూమిని యాచించాడు. ధర్మనిరతుడైన సుఘోషుడు కుటుంబీకుడైన భద్రమతిని చూచి మనసులో సంతోషించి, అతనిని పూజించి 'ఓ భద్రమతీ! నేను కృతార్థుడనయ్యాను. నా జన్మ సార్థకమైంది. నీవు ప్రతిగ్రహీతగా లభించటం వలన నా వంశం కూడా పవిత్రమైంది' అని పలికి ధర్మతత్పరుడైన సుఘోషుడు భద్రమతిని పూజించి, అతనికి ఐదు మూరల భూమిని దానం చేశాడు. 'ఈ పవిత్రమైన భూమి విష్ణుపత్ని. ఆమె విష్ణువుచే పాలించబడుతున్నది. నేను చేసే ఈ భూదానంతో జనార్దనుడు నాకు ప్రీతుడగుగాక! (నన్ను అనుగ్రహించు గాక)' అనే మంత్రంతో సుఘోషుడు భద్రమతిని విష్ణువుగా ఆరాధించి భూమిని దానం చేశాడు.

ఓ శౌనకాది మహర్షులారా! సుఘోషుడు విష్ణుభక్తుడు, శ్రోత్రియుడు, కుటుంబీకుడైన భద్రమతికి భూదానం చేయటం వలన కోటి తరాలతో దుఃఖరహితమైన వైకుంఠాన్ని పొందాడు. ఆ తరువాత భద్రమతి భార్యతోను, పుత్రులతోను దేవాసురులు నమస్కరించే శ్రీవేంకటాచలానికి వెళ్ళాడు. గంధర్వులు, యక్షులు సేవించే మేరుపుత్రుడు, వైకుంఠం నుండి వచ్చిన దివ్యమైన, ఉత్తమమైన క్రీడాపర్వతాన్ని సేవించి నిర్మలం, పావనం, శుభప్రదమైన స్వామిపుష్కరిణిలో

భార్యాపుత్రులతో కూడా సంకల్పపూర్వకంగా స్నానం చేసి, దానికి పడమటి తీరంలో ఉన్న భూదేవితో కూడిన వరాహస్వామికి నమస్కరించి, శ్రీనివాసుని ఆలయానికి వెళ్ళాడు. అక్కడ బ్రహ్మాది దేవతలచే సేవించబడుతున్న వేంకటేశ్వరుని బుద్ధిమంతుడైన ఆ విష్ణుభక్తుడు, భార్యాపుత్రులతో దర్శించాడు. కరుణాసముద్రుడు, దేవదేవుడైన శ్రీనివాసునికి భక్తితో నమస్కరించి పాపనాశనానికి వెళ్ళాడు. అక్కడ యథావిధిగా స్నానం చేసి, ధర్మకార్యాలు – పుణ్యకార్యాలు ఆచరించి, విష్ణుభక్తుడు, సదాచార పరాయణుడైన బ్రాహ్మణుడిని విష్ణువుగా భావించి మోక్షదాయకం, శుభదాయకమైన భూదానాన్ని చేశాడు. అంతట ఆ భూదాన ప్రభావం వలన భద్రమతికి శంఖ చక్ర గదా ధరుడైన శ్రీనివాసుడు గరుడారూఢుడై వనమాలా విభూషితుడై సాక్షాత్కరించాడు. అప్పుడు భద్రమతి మహాశ్చర్య చకితుడై ఆనందంతో శ్రీనివాసుని ఈవిధంగా స్తుతించాడు –

సకల చరాచరాలకు కారణమైన ఓ దేవా! నీకు నమస్కారం. సకల లోకాలను పాలించే దేవదేవా! నీకు నమస్కారం. రాక్షస సంహారకా! అమరనాయకా! నీకు నమస్కారం. భక్తజనప్రియా! పాపవిదారణా! దుష్టనాశకా! జగదీశ్వరా! నారాయణా! వామనరూపా! అమితవిక్రమా! శార్ఙ్గ చక్ర ఖడ్గ గదాధారా! పురుషోత్తమా! నీకు నమస్కారం. పాల సముద్రంలో పవళించే ఓ లక్ష్మీపతీ! నాశరహితా! సూర్యుని కంటెను కాంతి కలవాడా! పుణ్యకర్మలు చేసే వారిచే పొందబడే నీకు నమస్కారం.

సూర్యచంద్రులు నేత్రాలుగా కలవాడా! యజ్ఞఫల ప్రదాతా! యజ్ఞరూపా! సజ్జనవల్లభా! కారణకారణా! శబ్దాది విషయ విదూరా! అభీష్ట సుఖప్రదాతా! భక్తమనోరమా! నీకు నమస్కారం. సకలలోక కారణా! మందరధరా! యజ్ఞవరాహా! హిరణ్యాక్ష విదారకా! వామనరూపధరా! క్షత్ర కులాంతకా! పరశురామా! రావణసంహారకా! నందసుతాగ్రణీ! నీకు నమస్కారం. శ్రీలక్ష్మీపతీ! కమలాకాంతా! శుభప్రదాతా! ఆశ్రితుల కష్టాలను నశింపచేసే ఓ దేవదేవా! నీకు మరల మరల నమస్కారాలు''.

అంతట భక్తవత్సలుడు, దయానిధి అయిన శ్రీనివాసుడు వాత్సల్యంతో 'నాయనా! భద్రమతీ! నీవు చేసిన ఈ మహత్తరమైన స్తోత్రం చేత సంతుష్టుడనయ్యాను. నీకు శుభమగు గాక! నీవు పుత్ర పౌత్రాదులతో సకల భోగాలు అనుభవించి, ఇహలోక సుఖాలన్నీ పొంది, దేహాంతంలో ముక్తిని పొందు' అని పలికి అక్కడే అంతర్ధానం చెందాడు. ఓ శౌనకాది మహర్షులారా! ఈ విధంగా పాపనాశన తీర్థ వైభవాన్ని, దాని తీరంలో చేసే భూదాన ఫలితాన్ని మీకు తెలియజేశాను'' అని సూత మహర్షి చెప్పాడు.

**శ్రీనివాస స్తుతి**

**నమో నమస్తేఽఖిల కారణాయ నమో నమస్తేఽఖిల పాలకాయ ।**
**నమో నమస్తేఽమర నాయకాయ నమో నమో దైత్య విమర్దనాయ ॥**
**నమో నమో భక్తజన ప్రియాయ నమో నమః పాప విదారణాయ ।**
**నమో నమో దుర్జన నాశకాయ నమోఽస్తు తస్మై జగదీశ్వరాయ ॥**
**నమో నమః కారణ వామనాయ నారాయణాయామిత విక్రమాయ ।**
**శ్రీశార్ఙ్గ చక్రాసి గదాధరాయ నమోఽస్తు తస్మై పురుషోత్తమాయ ॥**
**నమః పయోరాశి నివాసకాయ నమోఽస్తు లక్ష్మీపతయేఽవ్యయాయ ।**
**నమోఽస్తు సూర్యా ద్యమిత ప్రభాయ నమో నమః పుణ్య గతాగతాయ ॥**
**నమో నమోఽర్కేందు విలోచనాయ నమోఽస్తుతే యజ్ఞ ఫలప్రదాయ ।**
**నమోఽస్తు యజ్ఞాంగ విరాజితాయ నమోఽస్తుతే సజ్జన వల్లభాయ ॥**
**నమో నమః కారణ కారణాయ నమోఽస్తు శబ్దాది వివర్జితాయ ।**
**నమోఽస్తు తేఽభీష్ట సుఖప్రదాయ నమో నమో భక్త మనోరమాయ ॥**
**నమో నమస్తేఽఖిల కారణాయ నమోస్తుఽతే మంధర ధారకాయ ।**
**నమోఽస్తుతే యజ్ఞ వరాహ నామ్నే నమో హిరణ్యాక్ష విదారకాయ ॥**
**నమోఽస్తు తే వామన రూప భాజే నమోఽస్తు తే క్షత్ర కులాంతకాయ ।**
**నమోఽస్తు తే రావణ మర్దనాయ నమోఽస్తు తే నంద సుతాగ్రజాయ ॥**
**నమస్తే కమలాకాంత! నమస్తే సుఖదాయినే!**
**శ్రితార్తి నాశినే తుభ్యం భూయో భూయో నమో నమః ॥**

**-స్కాందపురాణం – అ.20 – శ్లో.71-79**

## 10. రామానుజుడనే ద్విజుని వృత్తాంతం

శ్రీ సూతమహర్షి శౌనకాది మునులతో ఇలా అన్నాడు – 'ఓ తపోధనులారా! నైమిశారణ్య వాసులారా! మీకు శ్రీ వేంకటాచలంలోని ఆకాశగంగా తీర్థ మాహాత్మ్యాన్ని చెబుతాను శ్రద్ధగా వినండి. పూర్వం శ్రీవేంకటాచలంలోని ఆకాశగంగ తీర్థానికి సమీపంలో సర్వశాస్త్ర పారంగతుడు, విష్ణుభక్తుడు, జితేంద్రియుడైన రామానుజుడనే బ్రాహ్మణుడుండేవాడు. అతడు ధర్మపరాయణుడై, వైఖానస మతానుసారియై, ఎండాకాలంలో పంచాగ్నుల మధ్యలో ఉండి విష్ణుధ్యాన పరాయణుడై, అష్టాక్షరీ మహామంత్రాన్ని జపిస్తూ హృదయంలో జనార్దనుని ధ్యానిస్తూ, వానాకాలంలో వానలో తడుస్తూ, చలికాలంలో నీటిలో నిలబడి, తపస్సు చేశాడు. అతడు సర్వభూత హితుడై, శాంతుడై, దాంతుడై, శీతోష్ణాది సుఖ దుఃఖాలను వదిలి కొన్ని సంవత్సరాలు పండుటాకులను మాత్రమే తింటూ, మరికొన్ని సంవత్సరాలు నీటిని మాత్రమే స్వీకరిస్తూ ఇంకొన్నాళ్ళు గాలి మాత్రమే పీలుస్తూ తపస్సు చేశాడు.

#### భగవంతుని సాక్షాత్కారం :

అప్పుడు అతని తపస్సుకు మెచ్చి భక్తవత్సలుడైన భగవంతుడుశంఖచక్రగదాధరుడైఅతనికిప్రత్యక్షమయ్యాడు. ఆ శ్రీమన్నారాయణుడు చక్కగా వికసించిన తామరరేకుల వంటి నేత్రాలు కలిగి ఉన్నాడు. కోటిసూర్య సమాన కాంతి కలవాడై, గరుత్మంతు నధిరోహించి ఛత్ర చామరాదులతో విరాజిల్లుతూ హారాలు, భుజకీర్తులు, కిరీటం, మురుగులు మొదలైన ఆభరణాలు ధరించాడు. విష్వక్సేనుడు, సునందుడు మొదలగు పరివారం ఆయన చుట్టూ ఉన్నారు. నారదాదులు వీణ, వేణువు, మృదంగం మొదలగు వాద్యాలు ధరించి ఆయన వైభవాన్ని కీర్తిస్తున్నారు. ఆ నీలమేఘ శ్యాముడు పచ్చని పట్టువస్త్రం ధరించి వక్షః స్థలంలో లక్ష్మీదేవితో విరాజిల్లుతున్నాడు. సనకాది మహాయోగులు రెండు ప్రక్కల నిలబడి ఆయన్ని సేవిస్తున్నారు. భక్తసులభుడు, దయానిధి అయిన వేంకటేశ్వరుడు తన చిరునవ్వుతో ముల్లోకాలను మోహింపచేస్తూ పది దిక్కులను తన కాంతిచే ప్రకాశింపచేస్తూ ఆ రామానుజ మహాముని ఎదుట సాక్షాత్కరించాడు.

కరుణాసముద్రుడైన శ్రీనివాసుడు ఆ విధంగా ప్రత్యక్షం కాగా ఆ పీతాంబరధారిని చూసి రామానుజ ముని సంతోషించి పరమ భక్తితో ఆ జగదీశ్వరుని ఈ విధంగా స్తుతించాడు –

''బ్రహ్మాది దేవతలకు ప్రభువైన ఓ స్వామీ! శంఖ చక్ర గదా ధరా! నిత్యుడవు, శుద్ధుడవు అయిన ఓ వేంకటేశా! నీకు నమస్కారం. భక్తుల ఆర్తిని పోగొట్టే ఓ ప్రభూ! హవ్య కవ్య స్వరూపా! త్రిమూర్తి రూపా! సృష్టి స్థితి లయ కారకా! నీకు నమస్కారం. పరాత్పరా! అనంతా! లక్ష్మీపతీ! విధాతా! సూర్యచంద్రులు నేత్రాలుగా గల ఓ దేవా! బ్రహ్మాదులచే నమస్కరించబడిన నీకు నమస్కారం. పేరు–జాతి మొదలగు వికారాలు లేనివాడవు. సమస్త దోషరహితుడవు. సంసార భయాలన్నిటినీ పోగొట్టేవాడవు. దైత్య వినాశకుడవైన నీకు నమస్కారం. వేందాంత వేద్యుడవు. రమాపతివి. వృషాద్రివాసుడవు. బ్రహ్మకు తండ్రివి. సకల జనుల ఆర్తిని పోగొట్టేవాడవు. అమిత విక్రముడవైన ఓ నారాయణా! నీకు నమస్కారం. సకల సద్గుణ సంపూర్ణా! సర్వవ్యాపీ! వాసుదేవా! శార్ఙ్గధరా! వేంకటాద్రి నివాసా! నీకు మరల మరల నమస్కారం''.

#### వరం కోరుకో :

ఈ విధంగా జగద్గురువైన శ్రీనివాసుని స్తుతించి విప్రశ్రేష్ఠుడైన రామానుజముని మిన్నకున్నాడు. ఆ మహాత్ముడు చేసిన శ్రవణానందకరమైన స్తోత్రాన్న విని వేంకటాచలపతి మిక్కిలి సంతోషించాడు. తన చతుర్భుజాలతో ఆ మునిని ఆలింగనం చేసుకొని సంతోషంతో ''రామానుజా! నీ తపస్సుకు మెచ్చాను. నీవు చేసిన స్తోత్రాన్ని విని ఆనందించాను. నీ నమస్కారంతో సంతుష్టుడనయ్యాను. నీకు వరమివ్వడానికి వచ్చాను. కావున వరం కోరుకో'' అన్నాడు.

అప్పుడు రామానుజముని శ్రీనివాసుని ''నారాయణా! రమానాథా! శ్రీనివాసా! జగన్మయా! జనార్దనా! జగత్తును ధరించిన గోవిందా! నరకాంతకా! వేంకటాద్రి శిరోమణీ! నీ దర్శనం వలన కృతార్థుడనయ్యాను. నీవు ధర్మపాలకుడవు కాబట్టి ధర్మ తత్పరులు నీకు నమస్కరిస్తారు. నిన్ను శివుడు, బ్రహ్మ కూడా తెలియజాలరు. అలాగే వేదం కూడా నిన్ను ఎరుగజాలదు. నేను మిమ్మల్ని పరమాత్మగా తెలుసుకొన్నాను. ఇంతకంటే భగవంతుడవైన నీ దర్శనం కంటే గొప్పదేముంది? మహాయోగులు కూడా ఎవరిని చూడలేరో, కర్మిష్ఠులు ఎవరిని దర్శించలేరో అట్టి పరమాత్మవైన మిమ్మల్ని దర్శిస్తున్నాను. ఇంతకంటె కావలసింది ఏముంది? ఓ వేంకటేశా! జగత్ప్రభూ! నీ దివ్య దర్శనం వలన కృతార్థుడనయ్యాను. నీ నామాన్ని స్మరించినంత మాత్రం చేతనే మహాపాపాత్ములు కూడా ముక్తిని పొందుతారు. అట్టి జనార్దనుడవైన నిన్ను దర్శిస్తున్నాను. నీ పాదపద్మ యుగళంలో నాకు నిశ్చలమైన భక్తి కలుగు గాక!'' అని ప్రార్థించాడు.

అంతట భగవానుడు 'ఓ మహామతీ! రామానుజా! నాయందు నీకు దృఢమైన భక్తి కలుగుతుంది. నేను ఇంకొక మాట చెబుతాను విను. సూర్యుడు మేషరాశిలో ఉండగా చిత్తా నక్షత్రంతో కూడిన పౌర్ణమి నాడు (చైత్రపౌర్ణమి నాడు) ఆకాశగంగలో స్నానం చేసేవాళ్ళు పునరావృత్తి రహితమైన పరమపదాన్ని పొందుతారు. ఓ రామానుజా! నీవు ఆకాశగంగ సమీపంలోనే నివసించు. ప్రారబ్ధ వశాత్తు ధరించిన ఈ శరీరాన్ని వదలిన పిమ్మట నా స్వరూపాన్ని పొందుతావు. పెక్కు మాటలెందుకు? పవిత్రమైన ఆకాశగంగ జలంలో స్నానం చేసినవారంతా భాగవతోత్తములే అవుతున్నారు. ఇందుకు సందేహం లేదు' అన్నాడు.

భగవంతుని మధురమైన పలుకులు విని రామానుజ ముని 'స్వామీ! భాగవతుల లక్షణాలేమిటి? వారిని ఎలా గుర్తించాలి? దానిని తెలుసుకోవాలని, మీ ముఖతః ఈ విషయాలు వినాలని నాకు చాలా కుతూహలంగా ఉంది. కావున దయతో తెలియజేయండి' అని అడుగగా భగవంతుడు భాగవతుల (భక్తుల) లక్షణాల నిలా చెప్పాడు –

#### భక్తుల లక్షణాలు :

ఓ మునివర్యా! భాగవతోత్తముల చిహ్నాలను తెలియజేస్తాను విను. వారి ప్రభావాన్ని చెప్పడానికి కోటి సంవత్సరాలకైనా వీలు

కాదు. సకల ప్రాణుల మేలు కోరేవారు, అసూయ లేనివారు, మత్సరం లేనివారు, జ్ఞానం కలవారు, దేనియందు ఆశ లేనివారు, శాంతస్వభావులు భాగవతోత్తములు. మనస్సు–వాక్కు–శరీరాలతో ఇతరులను పీడించనివారు, ఎవరి వద్ద దేనిని అడగనివారు, సత్కథలను వినుటలో ఆసక్తి కలవారు, నా పాదపద్మాలయందు భక్తి కలవారు భాగవతోత్తములు, తల్లితండ్రులను సేవించే నరోత్తములు, నిత్యమూ దేవతారాధన చేసేవారూ, భగవత్పూజా ప్రయత్నం కలవారు, ఇతరులు చేసే భగవత్పూజను చూసి సంతోషించేవారు భాగవతోత్తములు. సాధువులకు – యతీశ్వరులకు పరిచర్యలు చేసేవారు, పరనింద చేయనివారు, అందరికీ హితం కలిగేటట్లు మాట్లాడే ఉత్తములు, లోకంలో ఇతరుల మంచి గుణాలను గ్రహించేవారు భాగవతోత్తములు. ఇతరుల సుఖ దుఃఖాలను తమవిగా భావించేవారు, శత్రుమిత్రుల పట్ల సమభావం కలవారు, ధర్మశాస్త్రాలను చక్కగా చెప్పేవారు, సత్యవాక్యరతులు, అట్టివారిని సేవించేవారు కూడా భాగవతోత్తములు.

పురాణాలకు వ్యాఖ్యానాలు వ్రాసేవారు, చెప్పేవారు, వాటిని వినేవారు, పురాణ ప్రవక్తల యెడ భక్తి కలవారు, ఎల్లప్పుడు గోబ్రాహ్మణ సేవ చేసేవారు, తీర్థయాత్రలు చేసేవారు భాగవతోత్తములు. ఇతరుల అభివృద్ధిని చూసి సంతోషించేవారు, ఎల్లప్పుడు హరినామ స్మరణ చేసేవారు, భగవదర్చనకై పూదోటలను పెంచేవారు, చెరువులను పరిరక్షించేవారు, బావులను, చెరువులను త్రవ్వించేవారు, నిత్యం గాయత్రీ మంత్రాన్ని జపించేవారు, భగవంతుని నామాలు విని ఆనందించేవారు – అభినందించేవారు, భగవన్నామస్మరణతో శరీరం పులకరించేవారు, భాగవతోత్తములు. తులసి వనాన్ని చూసినంతనే నమస్కరించేవారు, తులసి కాష్ఠాన్ని చెవిలో ధరించేవారు, తులసిదళాన్ని వాసన చూసి సంతోషించేవారు, తులసి మృత్తికను (మట్టిని) ధరించేవారు భాగవతోత్తములు.

తమ వర్ణాశ్రమ ధర్మాలయందాసక్తి కలవారు, అతిథులను పూజించేవారు, వేదార్థాలను బోధించేవారు, తమకు తెలిసిన శాస్త్రాలను ఇతరులకు బోధించేవారు, సకల సద్గుణాలు కలవారు, భాగవతోత్తములు. జలదానం – అన్నదానం చేయటంలో ఆసక్తి కలవారు, ఏకాదశీ వ్రతాన్ని పాటించేవారు, గోదానం చేయటంలో శ్రద్ధ కలవారు, కన్యాదానమందాసక్తి కలవారు, నా ప్రీతికై కర్మల నాచరించేవారు, నాయందే మనస్సు కలవారు, నాకు భక్తులైనవారు, నన్ను భజించుటలో ఆసక్తి కలవారు, నా నామస్మరణ చేయడంలో శ్రద్ధ కలవారు భాగవతోత్తములు. పెక్కుమాటలేల? నీకు సంక్షిప్తంగా చెబుతాను. సద్గుణాలు కలవారే భాగవతోత్తములు.

రామానుజా! భాగవతోత్తముల లక్షణాలను కొద్దిగా మాత్రమే చెప్పాను. నేను కూడా శతకోటి సంవత్సరాలకైనా వారి లక్షణాలను పూర్తిగా చెప్పలేను. ఓ పుణ్యాత్మా! రామానుజా! మహామతీ! నీవు నాకు భక్తుడవు కావున నేను ప్రీతితో నా భక్తుల లక్షణాలను నీకు చెప్పాను' అని శ్రీనివాసుడు అంతర్ధానమయ్యాడు. తేజశ్శాలులైన ఓ శౌనకాది మహామునులారా! శ్రీవేంకటాచలంలోని ఆకాశగంగ తీర్థ మాహాత్మ్యాన్ని మీకు తెలియజేశానని సూతమహర్షి శౌనకాది మునులకు చెప్పాడు.

## 11. అర్జునుని తీర్థయాత్ర :

పవిత్రమైన నైమిశారణ్యంలో శౌనకాది మహర్షులు లోక సంరక్షణ కోసం పన్నెండు సంవత్సరాలు సత్రయాగం చేశారు. అప్పుడు బుద్ధిమంతుడు, రోమహర్షణుని కుమారుడు, ఉగ్రశ్రవసుడనే పేరుగల పౌరాణికుడైన సూతుడు వారి వద్దకు వచ్చాడు. శౌనకాది ఋషులు ఆయనను అర్ఘ్య పాద్యాదులతో పూజించారు. పురాణ కథనంలో నిష్ణాతుడైన సూతమహర్షి వారికి స్కాందపురాణాన్ని, సృష్టిని, సంహారాన్ని, రాజవంశాలను, ఆయా వంశాలలోని వారి చరిత్రలను మన్వంతరాల కథలను వివరంగా చెప్పాడు. ఆ మునులు తీర్థ ప్రభావాలను విని తదుపరి కథాంశాన్ని వినాలనే కుతూహలంతో సూతుని 'మహర్షీ! మీరు తీర్థాల ప్రభావాన్ని చెప్పారు. నదులు, పర్వతాలు, పుష్కరిణులు, పుణ్యక్షేత్రాల మాహాత్మ్యాన్ని కూడా మాకు వివరించారు. చతుర్ముఖుని ఆదేశంతో అగస్త్య మహర్షి సువర్ణముఖరీ నదిని భూమి మీదికి తీసుకుని వచ్చినట్లు చెప్పారు. ఆ నది పుట్టుక, దాని ప్రభావం, దాని నాశ్రయించిన తీర్థాల గురించి వినాలని మాకు కుతూహలంగా ఉంది. కావున మీరు దానిని మాకు తెలియజేయండి!' అని అడిగారు.

వారావిధంగా ప్రార్థించగా సూతమహర్షి శివునికి, నందీశ్వరునికి, కుమారస్వామికి, వ్యాస మహర్షికి నమస్కరించి 'మహాత్ములారా! మంగళప్రదమైన మంచి విషయాన్ని అడిగారు. ఈ ఉపాఖ్యానం వినడం వలన వేదాన్ని విన్న ఫలం లభిస్తుంది. అర్జునునికి భరద్వాజ మహర్షి చెప్పిన పాపహరమైన దివ్యకథను చెబుతాను. సావధానంగా వినండి' అని ఈ విధంగా చెప్పనారంభించాడు.

**(సశేషం)**

ధారావాహికం



# తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవ వైభవం

- కీ||శే|| రాఘవాచార్య

*గత సంచిక తరువాయి*

## 8. మోహినీ అవతారం

అయిదవ నాటి పగలు వేంకటాచలపతి మోహినీరూపం ధరించి రాక్షసులను మోహింపచేసిన జగన్మోహినిగా బంగారు పల్లకిలో సిగ్గులు సోయగాలు ఒలకబోయుచు భక్తులకు కనిపిస్తాడు. శ్రీకృష్ణుడు దంతపు పల్లకిపై వెంబడే వస్తుంటాడు. విష్ణుదేవుని మోహినీ అవతార వృత్తాంతం భాగవతంలో మనోహరంగా వర్ణించబడింది. దేవతలు, రాక్షసులు అమృతం కొరకు పాలసముద్రాన్ని చిలుకుతారు. చివరలో పాలసముద్రం నుండి అమృతం లభిస్తుంది. దానికై దేవతలు, రాక్షసులు తగవులాడుకొంటారు. ఆ సందర్భంలో జగన్నాటక సూత్రధారి విష్ణుదేవుడు జగన్మోహిని రూపమున అవతరించి, రాక్షసులను మోహింపచేసి, దేవతలకు అమృతం పంచిపెడతాడు. ఇట్లు మోహినీ అవతారం బలవంతులమని అహంకరించి యున్న రాక్షసులకు అమృతం లభించక పోవుటకు, జగన్నాథుని ఆశ్రయించిన దేవతలకు అమృతం లభించుటకు కారణమౌతుంది.

మలయప్ప స్వామి మోహిని అలంకారములో నిల్చున్న భంగిమలో కాకుండా కూర్చునియున్న భంగిమలో కన్పిస్తాడు. స్త్రీలు ధరించే అన్ని ఆభరణాలతో స్వామి అలంకరింపబడతాడు. స్వామివారికి పట్టు చీర, కిరీటంపైన రత్నఖచితమైన సూర్య చంద్ర సావేరిని అలంకరిస్తారు. స్వామివారి ముక్కుకు వజ్రపు ముక్కు పుడక, బులాకీని అలంకరిస్తారు. ఊర్ధ్వ హస్తములలో ఉండే శంఖ, చక్రముల స్థానంలో రెండు వికసించిన పద్మాలను అలంకరిస్తారు. వరద భంగిమలో ఉండే స్వామివారి కుడిచేయి మోహిని అలంకరణలో అభయహస్తంగా ఉంటుంది. ఈ మనోహరమైన రూపంలో స్వామివారు భక్తులకు కనువిందు చేస్తుంటారు. బ్రహ్మోత్సవాలలో అన్ని వాహన ఊరేగింపులు వాహన మండపం నుండి ప్రారంభమవుతాయి. మోహినీ అవతారం మాత్రం శ్రీవారి ఆలయం నుండి పల్లకిపై రావడంతో ఊరేగింపు ప్రారంభమవుతుంది. శ్రీవేంకటేశ్వరస్వామి మోహిని అవతారంలో బలగర్వితులు, అహంకారులు కార్యప్రయోజనాన్ని పొందేలరని, వినయ విధేయతలతో భగవంతుని ఆశ్రయించిన వారే కృషి ఫలితాన్ని పొందగలరని హితము ఉపదేశిస్తున్నాడు. మోహినీ అవతారం వలె బ్రహ్మోత్సవములలో అన్ని వాహన సేవలు ఇతిహాస కథా ఘట్టములు, పురాణ కథా సన్నివేశములు ప్రాతిపదికగా కల్గి ఉన్నాయి. ఇవి భగవంతుని – విష్ణుదేవుని –

సర్వ వ్యాపకత్వమును, సంరక్షకత్వమును తెలియజేస్తున్నాయి. 'సర్వం విష్ణుమయం జగత్' అను సందేశాన్ని వినిపిస్తున్నాయి.

## 9. గరుడ సేవ

**శ్లో ॥ కపిలాక్షం గరుత్మంతం సువర్ణ సదృశ ప్రభం**
**దీర్ఘ బాహుం బృహత్ స్కంధం వందే నాగాంగ భూషణమ్**

తిరుమలలో జరిగే నవాహ్నిక బ్రహ్మోత్సవాలలో అయిదవ నాటి రాత్రి జరిగే గరుడోత్సవం ప్రథమ గణ్యమైనది. ''వేదాత్మా విహగేశ్వరః'' అను సూక్తిని అనుసరించి గరుత్మంతుడు వేద స్వరూపుడు. వైదికములైన సామాదులకు ప్రతిరూపాలైన అంగప్రత్యంగాలు కలవాడు గరుడుడు. విష్ణు గరుడ సమ్మేళనం వేద స్వరూప, శీర్షాలుగా వ్యక్తమవుతుంది. వేదములు ఋగ్వేదము, కృష్ణ యజుర్వేదము, శుక్ల యజుర్వేదము, సామవేదము, అథర్వణవేదము అని అయిదు విభాగములుగ ఉన్నాయి. కనుక తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలలో అయిద రోజు రాత్రి గరుడసేవ జరుగుతున్నది. గరుడ పంచాక్షరి (ఓం పక్షి స్వాహా) మంత్రంలో అయిదు అక్షరాలే ఉన్నాయి. కనుక 'పంచవర్ణ రహస్యం' అని స్తుతించబడే గరుడోత్సవం అయిదవరోజు జరుగుతున్నది. 'కంచి గరుడ సేవ' ప్రసిద్ధమైనా తిరుమల గరుడసేవకు ఉండే విశిష్టత, ప్రాధాన్యం అనుభవైకసిద్ధము. గరుడసేవ నాటి రాత్రి తిరుమల అంతా దేశం నలువైపుల నుండి వచ్చిన లక్షలాది భక్తజనులతో ఇసుక వేస్తే రాలనంతగా నిండిపోవడం ప్రత్యక్షానుభవమే.

సప్తగిరి నామములలో ''శ్రీ శేషశైల గరుడాచల వేంకటాద్రి, నారాయణాద్రి, వృషభాద్రి, వృషాద్రి ముఖ్యాం'' అని ప్రసిద్ధమై ఏడుకొండలకు ఉన్న పేర్లలో గరుడాద్రి ఒకటి. ఈ కొండ గరుడాకారంలో కనిపిస్తుంది. ఈ కొడకు

**కృతే వృషాద్రి వక్ష్యంతి త్రేతాయాం గరుడాచలమ్**
**ద్వాపరే శేషశైలం చ వేంకటాద్రిం కలౌ యుగే**

త్రేతాయుగంలో గరుడాద్రి అనుపేరు ప్రధానంగా ఉండేదని వామన పురాణం (24-106) చెబుతున్నది. వైకుంఠంలోని వేంకటమను విష్ణుదేవుని క్రీడాపర్వతమును వరాహ విష్ణుదేవుని ఆజ్ఞానుసారం గరుడుడు భూమికి తీసుకొని వచ్చి సువర్ణముఖి నదికి ఉత్తరంగా ప్రతిష్ఠించినాడు. కనుక ఈ పర్వతమునకు గరుడాద్రి అను పేరు కలిగింది. ఈ సంగతిని మార్కండేయ పురాణం

**వైకుంఠలోకాత్ గరుడేన విష్ణోః**
**క్రీడాచలో వేంకట నామధేయః ।**
**ఆనీయ చ స్వర్ణముఖీ సమీపే**
**సంస్థాపితో విష్ణు నివాస హేతోః ॥**

అని వివరించింది. మహర్షులు గరుడాద్రిని – వేంకటాద్రిని – వేదస్వరూపంగా వర్ణించారు.

**అరాయి కాణే వికటే గిరిం గచ్ఛేతి తం విదుః**
**ఏవం వేదమయః సాక్షాత్ గిరీంద్రః పన్నగాచలః**

–పురుషార్థ కాముకుడా! నీ అభీష్ట సిద్ధికై శ్రీనివాసుని నిలయమగు వేంకట పర్వతమునకు వెళ్ళుమని ఋగ్వేదం (10-155-1) ఉపదేశిస్తున్నది. ఇట్లు శేషాచలం వేదస్వరూపమై ఉన్నది. శేషాచలమునకు నామాంతరమే గరుడాచలం. గరుడుడు వేదమయుడు.

**శ్లో ॥ దాసో మిత్రం తాళవృంతం వితానం**
**పీఠం వాసోవాహనం చ ధ్వజశ్చ**
**ఏవం భూత్వాఽనేకధా సర్వథా సః**
**శ్రీశం శ్రీమాన్ సేవతే వైనతేయః**

–దాసుడుగా, సఖుడుగా, విసనకర్రగా, చాందినిగా, ఆసనంగా, ఆవాసంగా, ధ్వజంగా అనేక విధాలుగా వినతాసుతుడు శ్రీనివాసుని సేవించుచున్నాడు.

గరుడుడు విష్ణుదేవునికి వాహనము, ధ్వజము కూడ. కనుక గరుడ ధ్వజము (జెండా) ఎగుర వేయడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. గరుడ కేతనము దించి వేయడంతో బ్రహ్మోత్సవాలు సమాప్తమవుతాయి. గరుడుడు ధ్వజస్తంభము మీద నిలిచి ముక్కోటి దేవతలను శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తుంటాడు.

తొమ్మిది రోజుల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో ఐదవ రోజు రాత్రి జరిగే గరుడవాహన ఉత్సవంలో మలయప్పస్వామిని మూల విరాట్టుకు నిత్యం అలంకరించి యుండే మకరకంఠి, లక్ష్మీహారం, వేంకటేశ సహస్ర నామమాల మొదలగు విశిష్టాభరణములతో అలంకరిస్తారు. కనుక గరుడసేవలో ధ్రువమూర్తి వేంకటేశ్వర స్వామికి, ఉత్సవమూర్తి మలయప్ప స్వామికి భేదము లేదన్నది సంప్రదాయం. కనుక ఈ సమయంలో ఉత్సవమూర్తి దర్శనం అత్యంత శోభప్రదము మోక్షదాయకము. ఆనాడే తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు క్షేత్రం నుండి అక్కడ నున్న గోదాదేవికి – ఆండాళ్ కు – అలంకరించి తొలగించిన పూలమాలలను – ఆముక్తమాలలు – గరుడోత్సవం నాటికి అక్కడ నుండి తిరుమలకు తెచ్చి మలయప్పస్వామికి అలంకరిస్తారు. కృష్ణానదీ తీరాన శ్రీకాకుళ క్షేత్రంలో వెలసిన ఆంధ్రమహావిష్ణువుని ఆదేశానుసారం శ్రీకృష్ణదేవరాయలు తను ధరించిన పూలమాలను భగవంతునికి సమర్పించిన గోదాదేవి (ఆండాళ్) కథను 'ఆముక్తమాల్యద' అను ప్రబంధంగా రచించి ఆంధ్రవిష్ణుదేవుని మరొక అవతారమైన, తనకు ఇష్టదైవమైన తిరుమల తిరువేంగడనాథునికి అంకితమిచ్చినారు.

రాయలకాలం నుండి గోదాదేవి జన్మస్థానమైన శ్రీవిల్లిపుత్తూరు దేవాలయం నుండి ఆండాళ్ తాయారుకు (గోదాదేవి) అలంకరించి, తొలగించిన పూలమాలలను వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవ దినములలో గరుడసేవనాడు స్వామికి అలంకరించు సంప్రదాయము ఏర్పడింది. ఆంధ్రవిష్ణుదేవుని కోరిక నెరవేరింది. శ్రీకృష్ణదేవరాయలు ధన్యుడైనాడు. ఆముక్తమాల్యద ప్రబంధం ఈ సంప్రదాయానికి సాక్షిగా ఉన్నది. ఆరోజే రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి సమర్పించిన నూతన పట్టు వస్త్రములను స్వామివారికి అలంకరిస్తారు. అంతేగాక చెన్నపట్టణంలోని మిరాశిదారులు సమర్పించిన కొత్త గొడుగులతో అలంకరింపబడిన బంగారు గరుడునిపై మలయప్పస్వామి ఒక్కరే అధిరోహించి తిరుమల మాడవీధులలో విహరిస్తూ అశేష భక్తజనులను వరదహస్తంతో అనుగ్రహిస్తాడు.

**శ్లో ॥ గోదా సమర్పిత సువాసిత పుష్పమాలాం**
**లక్ష్మీహార మణి భూషిత సహస్ర నామ్నాం ।**
**మాలాం విధార్య గరుడోపరి సన్నివిష్టః**
**శ్రీవేంకటాద్రి నిలయో జయతి ప్రసన్నః ॥**

–గోదాదేవి సమర్పించిన ఆముక్త పుష్పమాలను, లక్ష్మీహారాన్ని, సహస్రనామ మాలను ధరించి, గరుడ వాహనంపై ఆసీనుడైన వేంకటాద్రి విభుడు ప్రసన్నుడై వర్ధిల్లుచున్నాడు.

ప్రతి సంవత్సరం గరుడోత్సవం నాడు చెన్నపట్టణంలోని ''తిరుపతి అంబ్రెల్లా ఛారిటీస్'' వారు (ప్రస్తుతం హిందూ ధర్మార్థ సమితి) వేంకటేశ్వర స్వామివారికి తొమ్మిది గొడుగులను – ఆరు పెద్ద గొడుగులు, మూడు చిన్న గొడుగులను – ప్రతి సంవత్సరం నూతనంగా తయారు చేసి, పూజలు చేసి, చెన్నై నుండి కాలినడకన ఊరేగింపుగా తిరుమలకు తీసుకు వచ్చి భక్తి శ్రద్ధలతో సమర్పిస్తారు. ఈ గొడుగులతో పాటు గొడుగుల మిరాశిదార్లు శ్రీవారి పూలంగి కపాయి, కుల్లాయి, వక్షఃస్థల లక్ష్మీదేవికి పావడలు, తిరుచానూరు పద్మావతీదేవికి రెండు పెద్ద గొడుగులు, కపాయి, పసుపు కుంకుమ చందనం మొదలగు వాటిని ''శ్రీవారి సారె''గా పేర్కొంటూ ఒక వెదురుబుట్టలో సమర్పిస్తారు. వీరు చెన్నై పురవీధులలో ఊరేగింపుగా బయలుదేరి కాలినడకన గరుడోత్సవం నాటికి తిరుమల చేరుతారు. కొత్త గొడుగులను, సారెపెట్టెను దేవస్థానం అధికారులు మిరాశిదారులకు అన్ని మర్యాదలు జరిపి స్వీకరిస్తారు. ఈవిధంగా వేంకటేశ్వరస్వామి గరుడోత్సవం విశిష్టమైన విలువైన ఆభరణాలంకారములతో, నూతన పట్టు వస్త్రములతో, కొత్త గొడుగులతో అంగరంగ వైభవంగా, కన్నుల పండువుగా జరుగుతుంది. ఈ గరుడోత్సవ వైభవాన్ని తాళ్ళపాక అన్నమాచార్యులు –

**''పల్లించి గరుడునిపై నీ వుబ్బున నెక్క.....**
**బంగారు గరుడునిపై నీవు వీధు లేగ**
**చెంగట శ్రీవేంకటేశ సిరులు మూగె**
**సంగతి నలమేల్మంగ సంతసాన విర్రవీగె**
**పొంగారు దేవ దుంధుభులు పైపై వాగె''** **- 11-70**

అని వర్ణించినాడు. ఆనాటి కోలాహలమును, ఉత్సవ సంరంభాన్ని

**''ఇటు గరుడుని నీవెక్కినను**
**పటపట దిక్కులు బగ్గన పగిలె''** **- 2-92**

అని వర్ణిస్తూ శ్రీవేంకటేశ్వరుని మహిమను అన్నమయ్య వేనోళ్ళ కీర్తించినాడు. ఈ గరుడోత్సవంలో దేవేరులు పాల్గొనరు. గరుడోత్సవంలో మలయప్పస్వామి ఒక్కడే

**''చివురు బొట్లపు దోయి జెందమ్ములన దార్ఢ్య**
**హస్తోదరముల దివ్యాంఘ్రులమర''**

–స్వామి పాదములు ఎర్రని తామరపూల వలె గరుడుని అరచేతులు చిగుళ్ళ పొట్లముల వలె ఉన్నవి. కనుక వేంకట విష్ణుదేవుడు గరుడుని చిగుళ్ళ పొట్లముల వంటి రెండు చేతులలో ఎఱ్రదామరల వలె ఉన్నల తన రెండు పాదములను పెట్టి వైభవం ఒలకబోస్తూ దర్జాగా కూర్చొని యుంటాడు. ఇట్లుండుట తన రెండు పాదములే భక్తులకు ఉపాయములు, ఉపేయములను సూచిస్తున్నది. ఇదే ద్వయ మంత్రసారము. ఇట్లు గరుడ సేవ ద్వయమంత్రార్థానికి ప్రతీకగా ఉంది.


గరుడ వాహనారూఢుడైన విష్ణుదేవుని దర్శించి, మైమరచి పెరియాళ్వారు (విష్ణుచిత్తుడు) ''పల్లాండు పల్లాండు'' అంటూ మంగళా శాసనం చేసినాడు. ''గరుడ గమన రారా నను నీ కరుణ నేలుకోరా'' అంటూ రామదాసు కీర్తించాడు.

**''దాసవర్గములకెల్లా దరిదాపు మీరే కాన**
**వాసికి నెక్కించరాదా వసుధలో మమ్మును**
**ఆయితమై గరుడుండ! అట్టే మీరూ చేయరాదా**
**యేయెడ విన్నపము మాకేమి వలసినాను''**

అని అన్నమాచార్యులు తనకొరకు, మన కొరకు వేంకటేశ్వరస్వామికి విన్నపం చేయమని గరుడుని మనవి చేస్తున్నాడు. ఇది శ్రీవారి గరుడసేవ వైభవం.

వేంకటేశ్వరస్వామి ''భక్తులారా! సర్వకాల సర్వావస్థలయందు మీ రక్షణకై శంఖ చక్రాది ఆయుధములను ధరించి గరుడుని అధిరోహించి సంసిద్ధుడనై యుంటాను. నన్ను శరణు వేడండి, నా పాదములను ఆశ్రయించండి. మీ రక్షణ భారము నాకు వదిలేయండి. మిమ్ము తప్పక రక్షిస్తాను'' అని ప్రబోధిస్తుంటాడు. కనుక స్వామి వారి గరుడోత్సవం సర్వపాపహరము. సకల సంపత్కరము. శ్రేయోదాయకము.

**(సశేషము)**



# మహాభక్త నందనార్

– మందరపు వి.జి. శంకరాచారి

భగవంతుడెప్పుడూ భక్తునికి దాసానుదాసుడు. భక్తుడు బాధకు లోనయితే దానిని చూసి భరించలేని ఈశ్వరుడు తనే తన పరివారంతో వచ్చి ఆ భక్తుడు చేయవలసిన కార్యాన్ని తనే చేసిపెడతాడు. అతడి కోరికను తీరుస్తాడు. ఆవిధంగా తన భక్తుడైన నందనార్ కి భోళాశంకరుడు ఏవిధంగా సహాయపడ్డాడో తెలుసుకుంటే ఈశ్వరుడికి తన భక్తులపై ఎంత మమకారమోనన్న విషయం అవగతమవుతుంది. భోళాశంకరుడే కాకుండా అతడి పరివారమంతా సహాయపడిన ఉదంతం నందనార్ జీవితంలో ప్రతిక్షణం జరిగింది. అటువంటి మహాభక్తనందనార్ గురించి...

నందనార్ తమిళదేశంలోని ఆదానూర్ గ్రామంలో నిమ్నజాతి కులంలో కడు పేదవాడిగా జన్మించాడు. ఇతడికి 5 సంవత్సరాల నుండియే ఆ ఈశ్వరుడిపైన విపరీతమైన భక్తి ఏర్పడింది. ప్రతిరోజూ నదిలో శుచిగా స్నానం చేసి త్రిపుండ్రం వంటికి రాసుకుని శివనామస్మరణ చేసేవాడు. ఇతని తండ్రి జంతు చర్మాలతో డ్రమ్స్ తయారు చేసేవాడు. 7 సంవత్సరాల వయస్సులోనే నందనార్ తండ్రి వద్ద వృత్తి విద్యలు నేర్చుకున్నాడు. అయితే అతడి ధ్యాస ఎప్పుడూ శివుడిపైనే. అతడి నామస్మరణయే తన శ్వాసగా మార్చుకున్నాడు. అన్ని విద్యలతో పాటు నాట్యాన్నికూడా కొంతకాలం నేర్చుకున్నాడు.

నందనార్ తిరుపుంకూర్ లోని శివలోక నాథిర్ ఆలయంలోకి ప్రవేశించి అక్కడ కొలువుదీరిన మహాశివుణ్ణి దర్శించుకుందామని తన స్నేహితులతో కలిసి అక్కడకు వెడతాడు. అయితే అక్కడి ఆలయ పెద్దలు నందనార్ నిమ్నజాతి కులస్థుడని ఆలయంలోనికి ప్రవేశించడానికి అనుమతించరు. ఆ ఆలయ ధ్వజ స్తంభానికి 5 అడుగుల దూరం వరకే ప్రవేశించడానికి అనుమతిస్తారు. వారు అనుమతించిన స్థలం నుండి చూస్తే ఎవరికీ శివదర్శనం కలుగదు. నందనార్ తో పాటు వచ్చిన అతడి ఇద్దరు స్నేహితులు కూడా ఆలయ ప్రవేశానికి అనుమతింపబడరు. ఎంతో ఆశతో శివదర్శనం చేసుకుందామని వచ్చిన నందనార్ తీవ్ర నిరాశకు లోనవుతాడు.

నందనార్ కన్నీరు మున్నీరుగా విలపిస్తాడు. ఆ రోదనలోనే స్వామివారిని ప్రార్థిస్తూ ధ్వజస్తంభం వద్దనుండే గట్టిగా మాట్లాడుతాడు. ''శంకరా నీ దర్శనం కోసం గంపెడాశతో ఇక్కడకు వచ్చాను. నేను అంటరానివాడినని గుడిలోకి ప్రవేశించకూడదంటూ ఈ ధ్వజస్తంభానికి 5 అడుగుల దూరంలో నిలబడి దర్శించుకోమన్నారు ఈ ఆలయ పెద్దలు. ఇక్కడినుండి చూస్తే నీ దర్శనం కావడం లేదు. నీ ప్రమథగణములలో మొదటిదైన నందియే అడ్డు వస్తోంది. నీ దర్శనం నాకయ్యేదెలా శివా. ఈ భక్తుణ్ణి కరుణించి కటాక్షించు'' అంటూ ఆర్తిగా ప్రార్థన చేస్తాడు.

అప్పుడు చిత్రంగా పరమేశ్వరుని ఆదేశంతో నంది ప్రక్కకు జరుగుతాడు. (ఆ ఆలయంలో ఇప్పటికీ నంది ప్రక్కగానే ఉంటుంది) అప్పుడు నందనార్కి శివదర్శనం స్పష్టంగా కలుగుతుంది. విపరీతమైన సంతోషంతో నందనార్ ఆ ధ్వజస్తంభం దగ్గర నృత్యం చేస్తాడు. ఈ అద్భుతాన్ని గమనించిన ఆలయ పెద్దలు నందనార్కి ఈశ్వరుడికి సేవ చేసే భాగ్యాన్ని కల్పిస్తారు. అయితే ఆలయంలో కాకుండా బయట ఉండి ఏదైనా సేవ చేసుకోమని చెబుతారు. ఆ శివాలయానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలమును చూపించి దానిని చెరువుగా మార్చమని చెబుతారు. ఆ చెరువు నీటినీ శివుడికి అభిషేక జలంగా ఉపయోగిస్తామని చెబుతారు. అది ఎంతో మహద్భాగ్యంగా భావించిన నందనార్ మరొక ఆలోచన లేకుండా తన మిత్రులతో కలిసి ఆ ప్రాంతానికి వెళ్ళి తవ్వడం ప్రారంభిస్తాడు. ఈ విధంగా నందనార్ రేయనక, పగలనక శ్రమిస్తూ ఉంటే, కైలాసంలోని పరమేశ్వరుడు తన భక్తుడికి సహాయపడదామని ప్రమథగణాలన్నింటినీ పిలిచి నందనార్ దగ్గరకు వెళ్ళి అతడికి సహాయపడమని చెబుతాడు. శివుడి ఆజ్ఞతో ప్రమథగణములన్నీ సామాన్య మానవులుగా మారి నందనార్ దగ్గర చేరి ''ఈ ప్రదేశంలో ఒక తటాకం నిర్మించడం మీ ముగ్గురివల్ల సాధ్యం కాదు. మీరు చేసే ఈ శివుడి యొక్క సేవలో మమ్మల్ని కూడా భాగస్వాములుగా చేయండి'' అని కోరతారు.

అందుకు నందనార్ అంగీకరించడంతో అందరూ కలిసి చెరువుని తవ్వడం ప్రారంభిస్తారు. కొన్ని రోజులలో చెరువు తవ్వడం పూర్తి చేస్తారు. ఒక శుభ ముహూర్తంలో ఈశ్వరుడు వర్షాన్ని కురిపిస్తాడు. వెంటనే అక్కడ చెరువు రూపుదాల్చుకుంది.

నందనార్ చెరువు తవ్వడంలో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తాడు. మారురూపంలో ఉన్న ప్రమథగణాలు నీకు సహాయపడమని మా పెద్దాయన చెబితే ఇక్కడకు వచ్చాము. కాబట్టి నీవు వారి దగ్గరకు వెళ్ళి నీ యొక్క కృతజ్ఞతలు తెలియజేయి అంటూ వారుండే ప్రదేశాన్ని చూపిస్తారు.

నందనార్ ఆనందంతో వారుండే ప్రదేశానికి బయలుదేరుతాడు. ఆ ప్రదేశానికి చేరుకున్న నందనార్ కి కొంచెం దూరంలో ఆ ఇంటి బయట ఎవరో ఇద్దరు వృద్ధ దంపతులు కూర్చున్నట్టు కనిపిస్తుంది. తీరా వెళ్ళి చూస్తే అక్కడ ఏ ఇల్లూ ఉండదు. వృద్ధ దంపతులూ కానరారు. అప్పుడు నందనార్కి విషయం అర్థమవుతుంది. అప్పుడు ఇలా మాట్లాడతాడు.

''హర హర మహాదేవ శంభో శంకరా... తండ్రీ ఈ చెరువును తవ్వే క్రమంలో నాకు సహాయం చేయడం కోసం నీ పరివారంతో కలిసి కైలాసాన్ని వదిలి ఇక్కడకు వచ్చావా తండ్రీ. నాదెంత భాగ్యం! నీ ప్రమథ గణాలతో కలిసి పని చేసే భాగ్యం నాకు కల్పించావా తండ్రీ. నీకుగా నీవే అభిషేక జలాన్ని ఏర్పాటు చేసుకుని చెరువును త్రవ్విన ఖ్యాతిని నీ భక్తుడికి దక్కించినావా ఈశ్వరా. అయినా తండ్రీ నీ దర్శనభాగ్యం మాత్రం నాకనుగ్రహించలేదేమయ్యా! నేనెంత పాపం చేసియున్నానో తండ్రీ'' అంటూ విలపిస్తాడు.

అప్పుడు నందనార్ ని ఉద్దేశించి ఆకాశవాణి ఇలా పలుకుతుంది. ''మహాభక్త నందనార్... ఈ భూలోకంపైన నీవు చేయవలసిన కార్యాలు ఇంకా మిగిలి ఉన్నాయి. వాటన్నింటిని పూర్తి చేసిన పిదప నీకు ఈశ్వర దర్శనం లభిస్తుంది. ఆ దర్శనంతో నీవు శివైక్యం పొందుతావు చింతిచవలదు. ఇక నీవు నీ ఇంటికి వెళ్ళి నీ కర్తవ్యాలను నిర్వహించు'' అన్నమాటలు వినబడతాయి.

ఆ మాటలు విన్న నందనార్ అమితంగా సంతోషిస్తాడు. ఈశ్వరుడిపై మరింతగా ప్రేమను, భక్తిని పెంచుకుంటాడు. ఆవిధంగా నందనార్ అక్కడినుండి బయలుదేరి స్నేహితులతో కలిసి తన ఊరు చేరుకుంటాడు.

యుక్తవయస్కుడైన తర్వాత పొట్ట గడవడానికి ఒక భూస్వామి దగ్గర కూలివానిగా చేరతాడు. భూస్వామికి ఉన్న పంటపొలాల్లో కూలిపని చేస్తాడు. ఒకరోజు ఆ ఊరికి ఒక స్వామీజీ వచ్చి చిదంబరం గురించి, తిల్లై నటరాజ ఆలయం గురించి గొప్పగా చెబుతాడు. అదిఆలకించిన నందనార్ అక్కడికి వెళ్ళాలని నిశ్చయించుకుంటాడు. అందుకుగాను తనకు 5 రోజులు సెలవు ఇమ్మని భూస్వామిని అడుగుతాడు. అయితే భూస్వామి సెలవు ఇవ్వడు సరికదా నందనార్ తో ఇలా పలుకుతాడు. ''ఒరేయ్ నందనార్ నిమ్నజాతిలో పుట్టిన నీకు అక్కడ ఈశ్వర దర్శనం లభించదురా. అయినా మీకు ఆలయ ప్రవేశం ఉండదు. మాలాంటి గొప్పవారికి మాత్రమే ఆ ఆలయ ప్రవేశం దక్కుతుంది. ఈశ్వరదర్శనం కలుగుతుంది. నీలాంటి వారికి ఆ అదృష్టం దక్కదురా. ఇక ఆ ఆశ మాని బుద్ధిగా నీ పని చేసుకో'' అంటాడు.

భూస్వామి మాటలకు నందనార్ నిరాశ చెందకుండా ప్రతిరోజు సెలవు ఇమ్మని కోరుతుండేవాడు. భూస్వామి చిరాకు పడేవాడు. నందనార్ ని వదిలించుకోవాలనే ఉద్దేశ్యంతో నీకు సెలవు ఇచ్చేది ఎప్పుడో రేపు చెప్తాను అంటూ ఉండేవాడు భూస్వామి.

రేపు రేపు అంటూ సెలవు ఇవ్వడానికి తాత్సారం చేస్తున్న

భూస్వామితో ఒకనాడు నందనార్ ''అయ్యా! రేపు సెలవు ఎప్పుడు ఇస్తారో చెప్తాను అంటూ నన్ను నా స్వామి దగ్గరకు వెళ్ళకుండా అడ్డు పడుతున్నారు. మీరు ఎటువంటి పని చేయమన్నా అది ఎంత కష్టమైనా చేస్తాను. నాకు సెలవు ఇప్పించండి'' అంటూ ప్రాధేయపడ్డాడు.

అంతగా ప్రాధేయపడిన నందనార్ తో ''సరేరా! ఒక పని చెయ్యి. నాకు 40 ఎకరాల ఖాళీస్థలం ఉంది. అది పంటలు ఏవీ పండించకుండా వృథాగా ఉంది. కాబట్టి నువ్వు ఈక్షణమే బయలుదేరి వెళ్ళి 40 ఎకరాల పొలం దున్ని, వరి విత్తనాలు చల్లి రేపటికల్లా ధాన్యం పండించి వాటిని నా ఇంటి గుమ్మంలో పడేస్తే నీకు వెంటనే సెలవు ఇస్తాను. నీ ఈశ్వరుణ్ణి తనివితీరా దర్శించుకోవచ్చు'' అంటాడు.

అంతే. మరొకటి ఆలోచించకుండా నందనార్ భూస్వామి చెప్పిన ప్రాంతానికి పలుగు పార తదితర వ్యవసాయ పనిముట్లతో చేరుకుని 40 ఎకరాల పొలాన్ని దున్నడం ప్రారంభిస్తాడు. దున్ని దున్ని అలసిపోయి అక్కడ ఒక మూలన కూలబడిపోతాడు. అది చూసిన ఈశ్వరుడు చలించిపోతాడు. వెంటనే ప్రమథగణాలను తోడ్కొని వచ్చి భూస్వామి 40 ఎకరాల పొలాన్ని దున్ని విత్తనాలు చల్లి వర్షాన్ని కురిపించి తగిన సూర్యరశ్మితో వరిని పండించి బస్తాలతో ధాన్యాన్ని నింపి వాటన్నిటినీ భూస్వామి వరండాలో వేయమని ప్రమథగణాలను పురమాయిస్తాడు. ఈశ్వరుడి ఆజ్ఞ మేరకు ధాన్యపు బస్తాలన్నీ భూస్వామి వరండాలోకి ఆ రాత్రికల్లా చేరుకుంటాయి.

తెల్లవారి లేచిచూసిన భూస్వామి అచ్చెరువొందుతాడు.

పరుగు పరుగున పొలంలో పడుకుని ఉన్న నందనార్ దగ్గరకువెళ్ళివిషయంచెప్పికాళ్ళపైపడిక్షమాపణఅడుగుతాడు. విషయం తెలుసుకున్న నందనార్ భక్తి పారవశ్యంతో శివుణ్ణి స్తుతిస్తూ ఆ క్షణమే చిదంబరం బయలుదేరి వెళతాడు.

అయితే చిదంబరం వెళ్ళిన నందనార్కి తిల్లై నటరాజ ఆలయాన్ని దర్శించడానికి ధర్మకర్తలు అనుమతి నివ్వరు. అతడి మనసు మాత్రం స్థానభ్రంశం చెందదు. ఎలాగైనా సర్వేశ్వరుణ్ణి దర్శించుకుని వెళ్ళాలని నిర్ణయించుకుంటాడు. ఆ సంకల్పంతోనే ఆ గుడి ముందర నిలుచుని 12 రోజుల పాటు శివుణ్ణి ప్రార్థిస్తూ రాత్రింబగళ్ళు గడుపుతాడు. ఈ తపస్సులో పూర్తిగా అన్నాహారాలు మానివేస్తాడు. ఫలితంగా చిక్కి శల్యమవుతాడు.

నందనార్ని ఆ విధంగా చూసిన తర్వాత ఆలయ ధర్మకర్తలలో ఒకరికి జాలి కలిగినట్లుగా నటిస్తూ ''నందనార్ నీకు ఆలయ ప్రవేశం కల్పించమని ఆ శివుడు నాకు కలలో కనబడి చెప్పాడు. అయితే శుచిగా మారి వస్తేనే ఈ ఆలయ ప్రవేశం కల్పించమన్నాడు. శుచిగా అంటే జలశుద్ధితో పాటు అగ్నితో కూడా శుద్ధిని పొందితేనే నీకు దేవాలయ ప్రవేశం జరుగుతుంది'' అంటాడు.

ఆ మాటలకు పరవశించిన నందనార్ మరుసటిరోజు తను అగ్ని ప్రవేశం చేసిన తర్వాత ఆలయ ప్రవేశం చేస్తానంటాడు (నందనార్కి ఆలయ ప్రవేశం చేయకుండా అడ్డుకోవాలన్న ఉద్దేశ్యంతో ఒక దుష్ట ఆలోచనతో ధర్మకర్తలలో ఒకరిచేత ఈవిధంగా చెప్పిస్తారు). నందనార్ అగ్నిప్రవేశానికి సమ్మతించగానే అందరూ విస్తుపోతారు. అయితేనేమి; నందనార్ అగ్నిప్రవేశానికి అన్ని ఏర్పాట్లు చేస్తారు.

మరుసటి రోజు నందనార్ చెరువు దగ్గరకు వెళ్ళి శుచిగా స్నానమాచరించి నుదుట విభూతి రేఖలు రాసుకుని త్రిపుండ్రంతో ధర్మకర్తల వద్దకు వచ్చి తన అగ్నిప్రవేశానికి వారు ఏర్పాటు చేసిన చితి దగ్గరకు వెళ్ళి ప్రజ్వరిల్లే అగ్నిలో శుద్ధి పొందడానికి సమాయత్తమవుతాడు.

''ఓం నమః శివాయః తిల్లై నటరాజ స్వామినే నమః'' అంటూ పరమభక్తితో వేలమంది జనం చూస్తూ ఉండగా అగ్ని ప్రవేశం చేస్తాడు.

చిత్రం.. మండే మంటల నుండి బయటకు వచ్చినా అతడి శరీరం కాలదు. సరికదా మండుతున్న కట్రలన్నీ పూలహారాలై అతడి మెడను అలంకరిస్తాయి. ఆ క్షణమే వరుణదేవుడు నందనార్ని ఆశీర్వదిస్తున్నట్లుగా చిరుజల్లుగా వర్షాన్ని కురిపిస్తాడు.

ఈ సంఘటనలన్నీ ప్రత్యక్షంగా చూసిన ఆలయ ధర్మకర్తలు ''మహాభక్త నందనార్.. పాహిమాం పాహిమాం'' అంటూ అతడి కాళ్ళపై పడతారు.

భక్తి పారవశ్యంతో తిల్లై నటరాజస్వామి ఆలయ ప్రవేశం చేసిన నందనార్ నటరాజ విగ్రహాన్ని చూస్తూ పరవశిస్తాడు. ఆ క్షణంలోనే అతడికి పరమేశ్వరుని సాక్షాత్కారం లభిస్తుంది. అతడి ఆత్మ అందరూ చూస్తుండగానే శివపరమాత్మలో ఐక్యమవుతుంది.

ఈ విధంగా శివైక్యం పొందిన నందనార్ తమిళంలో ప్రసిద్ధి పొందిన 63 నాయనార్లలో 17వ నాయనార్గా విఖ్యాతి పొందినాడు (నాయనార్ అనగా శివభక్తుడు అని అర్థం). ఇప్పటికీ తిల్లై నటరాజస్వామి ఆలయం దగ్గరకు వెళ్తే నందనార్ కి చితి పేర్చిన ప్రదేశాన్ని ప్రత్యేకంగా రూపొందించి ఇలా వ్రాయబడి ఉంటుంది.

''ఈ స్థలమునందే మహాభక్త నందనార్ అగ్నిప్రవేశం చేసినది. మండే కట్రలు పూలమాలలుగా మారి అతడి కంఠాన్ని అలంకరించినది''.

# మీ ప్రశ్న మా సమాధానం

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు.**
**భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**
**– ఎడిటర్, శ్రీవేంకటేశం**

**నిర్వహణ:**
**డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1.స్నేహ ప్రభావం ముఖ్యంగా ఆధ్యాత్మిక యాత్రలో ఎలా ఉంటుంది?**

జ. పశువులైనా, పక్షులైనా, చీమలైనా, కీటకాలైనా చివరికి మనుషులైనా తమ జాతివారితో లేదా తమకు సరిపడే, తమవంటి స్వభావ లక్షణాలు, అలవాట్లు ఉండేవారి స్నేహంలో ఉండడం, వారితో కలిసి ఉండడం మనం లోకంలో చూస్తూనే ఉన్నాం. జన్మతః మరియు కుటుంబ లేదా స్నేహపరంగా కొన్నిగుణాలు మనల్ని ప్రభావితం చేస్తాయి. సాంగత్య ప్రభావం మనల్ని మారుస్తుంది.

సజ్జన స్నేహం చాలా అవసరం. ఇది మన జీవితాలనీ, ఆలోచనా ధోరణినీ, దృక్పథాన్నీ ప్రభావితం చేస్తుంది.

మనకంటే ఉన్నతంగా ఆలోచించే, జీవించే వారితో మన అభివృద్ధికి దోహద పడేవారితో, సన్మార్గంలో నడిచేవారితో స్నేహం చేయడం చాలా అవసరం. ఆత్మ వికాసానికి సహాయపడేవారితో, వివేక – విచక్షణలు ఉండేవారితో మన స్నేహం కొనసాగాలి. మన ప్రవర్తన, ఆలోచనా సరళి మన మిత్రుల్ని బట్టే ఉంటాయి. ఎలాగంటే మబ్బులు వర్షించగా నేలవైపు దూసుకుని వచ్చే నీటిచుక్క ఎడారి ఇసుకలో పడితే ఎండిపోతుంది. సాగరంలో పడితే ఉప్పు సముద్రంలో భాగమైపోతుంది. పామునోట పడితే విషంగానూ, ఆవునోట పడితే పాలలాగానూ, ముత్యపు చిప్పలో పడితే ముత్యంగానూ, ఆకు చివరన పడితే సూర్యకాంతిని ప్రతిబింబించేదిగానూ, వేడిపెనం పైన పడితే సుయ్ మనే శబ్దంతో ఆవిరిగానూ మారిపోతుంది. అలాగే మనిషి కూడా తానెవరితో ఉంటాడో ఆ వ్యక్తి స్వభావ గుణ గణాలతో, అలవాట్లతో జీవితం గడుపుతాడు.

**2.దేవాలయంలో మనం చేసే ప్రదక్షిణల మహిమను, విధానాలను తెలియజేయండి.**

జ. ప్రదక్షిణానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. దేవాలయాల్లో ప్రవేశించిన తరువాత ముందుగా చేయవలసినది ప్రదక్షిణమే. ప్రదక్షిణం అంటే కుడిచేతిని పరమాత్మవైపు ఉంచి ఆయన



చుట్టూరా చుట్టి రావడం.

**"సర్వపాపహరం చైవ సర్వదాన ఫలప్రదమ్**
**సర్వరోగ ప్రశమనం చ రేత్తస్మాత్ ప్రదక్షిణమ్"**

అంటే పాపములన్నియు హరించడానికి , అన్ని రకముల దానములు చేసిన పుణ్యఫలము లభించుటకు, వ్యాధుల నివారణకు ప్రదక్షిణం చేయవలెను.

**'ప్ర' ఛ్ఛిందంతి భయం సర్వం**
**'ద' కారో మోక్షసిద్ధిః**
**'క్షి' కారాత్ క్షీయతే రోగో**
**'ణ' కార శ్రీ ప్రదాయకః**

" 'ప్ర' అనే అక్షరం సర్వ భయములను పోగొడుతుంది. 'ద' అనే అక్షరం మోక్షప్రాప్తి కలగజేస్తుంది. 'క్షి' అనే అక్షరం సర్వవ్యాధులను పోగొడితే 'ణ' అనేది సకలైశ్వర్యములను అందిస్తుంది" అని భావం.

ప్రదక్షిణం చేసేటప్పుడు అడుగు వెంట అడుగు వేస్తూ నడవడం, చేతులు నమస్కారముద్రలోనే ఉండడం, పెదవులు పరమాత్మనే కీర్తించడం, మనసులో పరమాత్మను తలచుకోవడం చేయాలి.

త్రికరణశుద్ధిగా చేసేదే ప్రదక్షిణం. ఏకాగ్రతతో, భక్తిప్రపత్తులతో శరీరం, మనసు, ఆత్మల శ్రేయస్సు కోసం, లోక కళ్యాణం కోసం ప్రదక్షిణాలు చేస్తే భగవంతుడే మెచ్చి మన మనోభీష్టాలను నెరవేరుస్తాడనడంలో సందేహం లేదు.

# అంత్యకాలములో
# భగవంతుని నామస్మరణ

– కౌతా నిర్మల

శివనామము ఎంతో మహత్త్వం కలిగినది. శివనామ మహిమను గురించిన ఒక కథ పద్మపురాణంలో తెలియజేయబడింది. శ్రీరాముడు రాజ్యపాలన చేసే సమయంలో అశ్వమేధ యాగమును చేశాడు. ఒకసారి శ్రీరాముని వద్దకు విప్రపండితుడు అరుదెంచాడు. ఆ విప్రునికి నమస్కరించి, ''ఓ బ్రాహ్మణోత్తమా! శివుడు భక్తవశంకరుడు, ఆయన నామము జపించడం, పంచాక్షరీ మంత్రాన్ని పఠించడం వల్ల వాటికి ఎంతో మహిమ ఉంటుందనీ, వాటిని ఉచ్చరించినవారు ఎటువంటి వారయినా వారికి శివ కటాక్షం కలుగుతుందనీ, ముఖ్యంగా అంత్య సమయంలో శివుడిని స్మరిస్తే శివ సాయుజ్యం పొందుతారని అంటారు. శివనామాన్ని ఉచ్చరించటం వలన కలిగే లాభాలేమిటో, ఆ నామ మహత్యమేమిటో నాకు విశదంగా తెలియ జేయవలసిందిగా కోరుతున్నాను'' అని అడిగాడు శ్రీరాముడు.

శ్రీరామునికి ఈవిధంగా శివనామ స్మరణ గురించి వివరించసాగాడు ఆ పండితుడు. ''శ్రీరామా! పూర్వ విభృతుడు అనే రాజు ఉండేవాడు. యౌవనంలో ఉన్న ఆ రాజు తనకున్న అపరిమితమైన సిరి సంపదలతో మంచి, చెడు విచక్షణా జ్ఞానాన్ని విస్మరించి, చెడు మిత్రులతో సావాసం చేస్తూ, వారి సాంగత్య ప్రభావంతో పాపపు పనులను చేయసాగాడు. రాజ్యపాలనను నిర్లక్ష్యం చేస్తూ వ్యర్థంగా కాలం గడపసాగాడు. రాజుగారి మంచి, హితవు కోరేవారి మాటలను పెడచెవిన పెడుతూ వారిపట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించేవాడు. భార్యను ఆదరించకుండా జార స్త్రీల వద్దకు వెళ్ళేవాడు. అవినీతి పరులకు, అధర్మపరులకు కానుకలిచ్చేవాడు. పాపపు పనులను చేస్తూ, పాప మార్గాన సంచరిస్తూ ఎంతో పాపాన్ని మూట కట్టుకున్నాడా రాజు. వయస్సు ప్రభావం ఆ రాజును వ్యర్థునిగా చేసింది. ధర్మము, న్యాయము, రాజ్యదక్షత, రాజనీతిజ్ఞత పాటించకుండా తప్పుడు మార్గంలో ఆ రాజు ప్రవర్తించడంతో ప్రజలు కూడా విచ్చలవిడిగా ప్రవర్తించసాగారు. ఆ రాజు బలహీనతల వల్ల, ఆ రాజ్యం పర రాజుల ఆధీనమయింది. ఆ రాజు భికారిగా మిగిలిపోయాడు. స్నేహితులు, పరివారము, సేవకులు అతని కష్టంలో సాయపడకపోగా ముఖం చాటేశారు. విభృతుడు దిక్కుతోచని పరిస్థితిలో అడవులలో తల దాచుకున్నాడు. అడవులలో సంచరిస్తూ, ఆ మార్గంలో పయనించే బాటసారుల మీద దాడిచేసి వారి ధనాన్ని కొల్లగొడుతూ ఆ ధనంతో జీవించసాగాడు. రాజ్యాన్ని కోల్పోయిన ఆ రాజు వేటగాళ్ళతోను, దుష్టజనంలోను కలిసి వారు తెచ్చిన మాంసాన్ని భుజిస్తూ భ్రష్టుడయ్యాడు.

ఆ రాజులో రాజ లక్షణాలు మచ్చుకైనా కనిపించకపోగా మద్యాన్ని సేవిస్తూ, జంతువుల మాంసాన్ని భుజిస్తూ తోటివారితో ప్రహర – అహర అని చెప్తుండేవాడు. ప్రహర, అహర అనే పదాలకు అర్థం 'జంతువుల్ని కొట్టండి, ఆహారాన్ని తీసుకు రండి' అని. ఈ విధంగా విభృతుడు పూర్తిగా భ్రష్టుడై, తాను చేసిన పాపకర్మములను అనుభవిస్తూ కొన్ని సంవత్సరాలు ఆ అడవిలో గడిపాడు. ఆ రాజుకు అంత్య సమయము ఆసన్నమైంది. అతను ప్రహర, అహర అని పలుమారు పలుకుతూ ప్రాణాలు వదిలేశాడు. అతనిని తీసుకెళ్ళటానికి యమదూతలు యమపాశాలతో వచ్చారు. యమభటుల పాశాలు అతనిని బంధించలేకపోయాయి. దండములతో కొడితే అవి విరిగిపోయాయి. శూలములు కూడా విభృతుని గాయపరచలేకపోయాయి. యముని వద్దకు వెళ్ళి యమభటులు ఆ పాపాత్ముని తమ వెంట తీసుకు రాలేకపోయామని విన్నవించారు.

ఆ రాజు ఆయువు తీరిపోవడంతో యముడు మృత్యుదేవతను అతని వద్దకు పంపాడు. మృత్యువు అతి రోషంతో అతని వద్దకు వచ్చి అతి భీకరంగా పలికింది. 'ఓరి పాపాత్ముడా! యమ భటుల నుండి తప్పించుకున్న నువ్వు మృత్యుదేవత అయిన నా కోరల నుంచి తప్పించుకోలేవు' అని అతని మెడకు ఉచ్చు బిగించగా అది ఊడిపోయింది. మృత్యదేవత నిశ్చేష్టురాలై అచేతనంగా నిలబడిపోయింది.

ఇంతలో అక్కడకు ఒక దివ్యరథము వచ్చి ఆగింది. అందులోంచి జ్వాలావక్త్రుడు అనే శివసేవకుడు దిగి, విభృతుని సగౌరవముగా రథమును ఎక్కించి, మృత్యదేవతను బంధించి, పరమేశ్వరుని వద్దకు తీసుకువెళ్ళాడు. తలవంచుకుని నిలబడిన మృత్యుదేవతతో శివుడు అన్నాడు ''ఓ మృత్యుదేవతా! మరణ కాలమున ఎవరైతే నా నామమును పలుకుతారో వారు నా

భక్తులవుతారు. వారి పాపములన్నీ పటాపంచలవుతాయి. వారు నా వద్దకు చేరుకుంటారు. వారిని శిక్షించుట కాని, మీ వెంట తీసుకువెళ్ళడం కానీ సాధ్యం కాదు. నా పూజాభిషేకాలు జేయువారు, కాశీ, శ్రీశైలంలో నివసించేవారు నా సాన్నిధ్యానికి చేరుకుంటారు'' అన్నాడు.

అప్పుడు మృత్యుదేవత ''దేవా ఇతడు ఎన్నో పాపకృత్యాలు చేశాడు. ఉచ్చనీచాలు మరచి ప్రవర్తించాడు. అయినప్పటికీ ఈ జీవి మీ సాన్నిధ్యానికి చేరుకోవటానికి కారణమేమిటో నాకు అవగతం కావడం లేదు'' అన్నది.

''నువ్వన్నట్లే ఇతడు మహాపాపి కావచ్చు. కానీ ప్రాణం పోయే సమయంలో 'ప్రహర, అహర' అనే పదాలు పలుమార్లు వల్లించాడు. అతని ఆంతర్యంలో ఆ పదాల అర్థాలు వేరుగా ఉన్నప్పటికీ ఆ రెండు పదాల్లో ఉన్న హర అనే పదాన్ని స్మరించడం వల్ల పాప రహితుడై నా భక్తుడుగా నా వద్దకు చేరుకున్నాడు'' అని మృత్యుదేవత సందేహాన్ని తీర్చాడు మహేశ్వరుడు.

మృత్యదేవత ఆయనకు నమస్కరించి అక్కడ నుండి వెళ్ళిపోయింది. ఆ తర్వాత విభృతుడు శివుని ప్రమథ గణాలలో ఒకడై శివుని సేవించసాగాడు.

# శ్రీవేంకటేశ్వరస్వామి వారి భక్తులకు ఆహ్వానం

కలియుగ వరదుడైన శ్రీవేంకటేశ్వరుడు ఎంతోమంది భక్తులకు కలలో కనిపించి, దివ్యానుభూతులను కలిగించి వారిని తరింపజేస్తున్నాడు. 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' వారు ప్రచురిస్తున్న 'శ్రీవేంకటేశం' మాసపత్రిక 16వ వార్షికోత్సవం సందర్భంగా పుణ్యాత్ములైన స్వామి వారి భక్తులను సన్మానింపదలిచారు. అటువంటి భక్తులు, వారు పొందిన అనుభూతులను 25-03-2022 తేదీ లోపల మాకు వ్రాసి పంపవలసిందిగా మనవి.

ఈ సందర్భంగా మంచి అనుభూతి పొందిన రచయితలకు ప్రథమ బహుమతి రూ. 5,000/- లు, రెండవ బహుమతి రూ.2,500/-లు, మూడవబహుమతి రూ. 1100/- లతో పాటు స్వామి వారి పవిత్ర పాదాలు ఇచ్చి సత్కరించగలము. మరియు ఒకసంవత్సరం శ్రీ వేంకటేశం మాసపత్రిక ఉచితంగా పంపగలము.

విజేత అనుభూతులు శ్రీవేంకటేశం మాసపత్రికలో వారి అనుమతిచే ప్రచురితమవుతాయి. అనుభూతి పొందినవారికి వయోపరిమితి లేదు. అనుభూతులను నేరుగా / పోస్టు / కొరియర్ / ఈమెయిల్ ద్వారా కాని ఈ క్రింది అడ్రస్‌కు పంపవలెను. మీరు పంపే అనుభూతి తమదేనని, ఎక్కడా ప్రచురింపబడలేదని హామీ పత్రం వ్రాయాలి. విజేతకు బహుమతి వివరాలు ఫోను ద్వారా తెలుపబడతాయి మరియు శ్రీవేంకటేశం మే సంచికలో ప్రచురింపబడును.

**సూచన:**

**విశిష్టమైనవి మరియు ప్రేరణాత్మకమైన అనుభూతులను మాత్రమే పరిగణించబడును. ఈ రకమైన పోటీలు ప్రతి సంవత్సరం ఉగాదికి ఉండగలవు.**

# వ్యాస రచన పోటీలు

**'శ్రీ వేంకటేశం' మాస పత్రిక 16వ వసంతోత్సవము (వచ్చే ఉగాది తేది 2-4-2022) సందర్భంగా 'శ్రీ వేంకటేశ్వరుడు - నవవిధ భక్తులు' అనే అంశం పైన వ్యాస రచనా పోటీలను నిర్వహించుచున్నాము. శ్రీ శుభకృతు నామ సం|| ఉగాది నాడు అనగా తేది 2-4-2022 నాడు మొదటి బహుమతి రూ. 5,000/-, రెండవ బహుమతి రూ. 2,500/-, మూడవ బహుమతి రూ. 1,100/- లను ఆయా విజేతలకు అందించబడును.**

**ఈ పోటీలలో ఆసక్తి కలిగిన అందరూ రచయితలు పాల్గొనవచ్చును. వయో పరిమితి లేదు. విశిష్టమైనవి మరియు ప్రేరణాత్మకమైన రచనలు మాత్రమే పరిగణించబడును. మే నెల సంచికలో విజేతల వివరాలను ఇవ్వబడును. మరియు 'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో ప్రచురితమగును.**

**రచయితలు తమ వ్యాసాలను 12 పేజీలకు మించకుండా రాసి తేది 25-3-2022 వరకు పోస్టు / కొరియర్ లేదా ఈమెయిల్ ద్వారా ఈ క్రింది తెలిపిన అడ్రస్‌కు హామీ పత్రంతో పాటు పంపవలెను.**

**మీరు పంపవలసిన చిరునామా**

**ఎడిటర్, శ్రీ వేంకటేశం**
**ఇ.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సిగూడ, హైదరాబాద్-500007**
**ఫోన్: 040-27175050, Email: srivenkatesham@gmail.com**



# శ్రీవేంకటేశ్వర అష్టోత్తర శతనామావళి

గత సంచిక తరువాయి

– కె.వి.రాఘవాచార్య

## 100. ఓం క్షీరాబ్ధి నాథాయ నమః

పాల సముద్రమునకు అధిపతియైన వేంకటేశునకు నమస్కారము.

భగవన్నారాయణుని పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతారములలో పర రూపము వైకుంఠములో నుండును. వ్యూహరూప మొకటి పాలసముద్రమున శేషశాయియై యోగనిద్రలో నుండును. ఈ వ్యూహరూపమే క్షీరాబ్ధి నాథుడు – రామ కృష్ణాది విభవావతారములకు మూల కారణమని శాస్త్ర వచనము. ఈ విషయమును

శ్లో ॥ ఏష నారాయణః శ్రీమాన్ క్షీరార్ణవ నికేతనః ।
నాగ పర్యంక ముత్సృజ్య హ్యాగతో మధురాం పురీమ్ ॥

పాలసముద్రంలో నివసించి, శేయశాయి అయిన నారాయణుడే తన నాగ పర్యంకము వీడి మధురలో శ్రీకృష్ణుడై అవతరించినాడు అని భాగవతము వర్ణించింది. ప్రపత్తి (శరణాగతి) అనబడు మోక్షోపాయములో అనుసంధించవలసిన ద్వయము శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే । శ్రీమతే నారాయణాయ నమః) అను మహా మంత్రము యొక్క అనుసంధాన సమయములో ధ్యానింపవలసిన భగవత్స్వరూపము క్షీరాబ్ధినాథుని రూపమని పెద్దల మాట. వైకుంఠమునకు పోలేనివారు కూడా తమ కష్టములను విన్నవించి క్షీరాబ్ధినాథుని వలన కృతార్థులగుటకు స్వామి సౌలభ్యగుణము కారణమగుచున్నది. అందువలననే శ్రీకృష్ణావతారమునకు ముందు గోరూపమున వచ్చిన భూదేవి, బ్రహ్మ, దేవతలు ఈ క్షీరాబ్ధినాథుని వద్దకు వచ్చి, తమ బాధలను వివరించి, ఆ స్వామి వలన దుష్టశిక్షణ, శిష్ట రక్షణలను పొంది కృతార్థులైనారు.

శ్రీమన్నారాయణుని వ్యూహరూపమగు క్షీరాబ్ధినాథునిలోని సౌలభ్యాది గుణములు మన వేంకటేశ్వరస్వామిలో కూడ ఉన్నవి. వేంకటేశ్వరుడు భక్తసులభుడు ఆపద మ్రొక్కులవాడు. ఆశ్రిత రక్షకుడు.

## 101. వైకుంఠాచల వాసినే నమః

వేంకటాచలమునకు నామాంతరమైన వైకుంఠాచలమునందు నివసించి యున్న వేంకటేశునకు నమస్కారము.



విష్ణుదేవుడు శ్వేత వరాహ రూపమును ధరించి ఈ కల్పారంభములో భూమండలమును పాతాళము నుండి ఉద్ధరించి పూర్వమువలె యథా స్థితిలో నిల్పినాడు. సృష్టి ప్రారంభమైంది. లోకహితము కోరి వరాహ విష్ణుదేవుడు ఈ కల్పాంతము వరకు భూమిపై నివసింప దలంచినాడు. అంతట గరుడుని ఆదేశించి వైకుంఠమున వున్న తన క్రీడాద్రి వేంకటమను పర్వతమును భూమికి తెప్పించి సువర్ణముఖి నదీ సమీపమున స్థాపించినాడు. పిమ్మట సౌమ్య రూపముతో భూదేవీ సహితుడై స్వామి పుష్కరిణికి పశ్చిమ తీరమున ఒక దివ్యవిమానమున నివసించినాడు. ఈ వేంకటాద్రి వైకుంఠము నుండి తీసికొని రాబడిన పర్వతమగుటచే దీనికి వైకుంఠాచలము అను పేరు కల్గింది. వైకుంఠము నుండి రప్పించిన పర్వతముపై నివసించుట చేత వేంకటేశుడు వైకుంఠాచలవాసిగ ప్రసిద్ధుడైనాడు.

అందరికిని తనతో సంశ్లేషమును కలిగించువాడు కనుక వైకుంఠః అనుబడుచున్నాడు. అతని నివాసము కూడ వైకుంఠమనబడుచున్నది. విగతః కుంఠః యేషాం తే వికుంఠాః అను బహువ్రీహి సమాసమునకు భగవంతునితో విశ్లేషము లేనివారు (నిత్యసూరులు) అని అర్థము. వికుంఠులకు స్వామి అయిన విష్ణుదేవుడు వైకుంఠుడనబడుచున్నాడు. అతని నివాసము వైకుంఠము.

**శ్లో ॥ మయా సంశ్లేషితా భూమి రద్భి ర్వ్యోమ చ వాయునా ।**
**వాయుశ్చ తేజసా సార్థం వైకుంఠత్వం తతో మమ ॥**

నేను భూమిని జలముతో కలిపితిని. ఆకాశమును వాయువుతో కలిపితిని. వాయువును తేజస్సుతో కలిపితిని. కనుక నన్ను వైకుంఠుడందురు అని వైకుంఠ పదమునకు నిర్వచనమును మహాభారతము శాంతి పర్వము చెప్పుచున్నది. విడి విడిగా నుండిన తత్త్వములను కలిపి సృష్టించిన విష్ణుదేవుడు వైకుంఠుడనబడుచున్నాడు.

ఈ నామము విష్ణు సహస్ర నామములలో (406) కలదు. వేంకటాద్రిపై నున్న ఆనందనిలయము వేంకటేశ్వరుని నివాసమగుటచే భూలోక వైకుంఠముగ ప్రసిద్ధి చెందింది. "వైకుంఠాత్ పరమో హ్యేష వేంకటాఖ్యో నగోత్తమః" (వరాహ–35,12) – ఈ వేంకటాచలము వైకుంఠముకంటె ఉత్తమమైనది. మహిమగలది అని వరాహ విష్ణుదేవుని మాట.

## 102. ఓం ముకుందాయ నమః

మోక్షము నిచ్చువాడు – ముకుందుడు – అగు వేంకటేశునకు నమస్కారము.

ఐకాంత్యా గరిమ్ణా ప్రార్థితః స్వయం ముక్తిభూమిం దదాతి ఇతి ముకుందః – నీవు తప్ప మాకు మరేమియు అపేక్షితము కాదు అను విధముగా ఏకాంత బుద్ధితో భక్తులచే ప్రార్థింపబడుచు వారికి తన మోక్ష స్థానమును ప్రసాదించువాడగు విష్ణుదేవుడు ముకుందుడు అని కీర్తింపబడుచున్నాడు. ఈ శబ్దము పాణినిచే వృషోదరాది గుణములో చేర్చబడినది. కనుక దీనికి ప్రకృతి ప్రత్యయ విభాగ రూపమగు ప్రక్రియ లేదు.

శ్రీకృష్ణుడు "వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః" అని చెప్పినట్లు నాకు ధారక పోషక భోగ్య పదార్థములన్నియు భగవంతుడే అని దృఢనిశ్చయము గల భక్తుడు లోకమున అత్యంత దుర్లభుడు. కాని అట్టి అనన్య (ఏకాంత) భక్తులకు మాత్రమే మోక్షప్రదాత ముకుందుడు అనబడు వేంకటేశ్వరుడని భావము. "అహం త్వాత సర్వపాపేభ్యో మోక్షయిష్యామి" అని కృష్ణుడు శరణాగతి చేసిన భక్తులకు మోక్షమును అనుగ్రహించ గలనని శపథము చేసినాడు. కనుక శ్రీకృష్ణుడు ముకుందుడని కీర్తింపబడినాడు. కలియుగమున ఆ కృష్ణుడే వేంకటేశ్వరుడుగ అవతరించుటచే మన స్వామి కూడ ముకుందుడని స్తుతింపబడినాడు. వేంకటాచల మాహాత్మ్యములో వేంకటేశ్వరుడు కుమ్మరి భీముడు, వృషభాసురుడు, తొండమానుడు, నారాయణుడు మున్నగు భక్తులకు మోక్షమును అనుగ్రహించి యున్నాడు. కనుక ముకుందుడు.

ముం చ కుం చ దదాతి ఇతి ముకుందన – మోక్షమును, ఇహలోక సుఖములను అనుగ్రహించువాడు ముకుందుడని మరొక వ్యుత్పత్తి, అర్థము కలదు. ఈ నామము విష్ణు సహస్ర నామములలో (578) కలదు.



# శ్రీవేంకటేశ్వర లీలా వైభవం

బి.రమాదేవి

**కృతేతు నరసింహోఽభూత్త్రేతాయాం రఘునందనః**
**ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకట నాయకః**

కృతయుగంలో నరసింహరూపం, త్రేతాయుగంలో దశరథాత్మజుడైన శ్రీరామచంద్రమూర్తి, ద్వాపరంలో వసుదేవ సుతుడైన వాసుదేవ కృష్ణమూర్తి, కలిలో తిరుమలగిరివాసుడైన శ్రీవేంకటేశ్వరుడు ప్రత్యక్ష దైవాలని శాస్త్రపురాణ ప్రమాణం.

వైకుంఠవాసుడైన శ్రీమన్నారాయణుడు వైకుంఠాన్ని విడిచి భక్తజన రక్షణార్థము తిరుమలగిరి మీద ఆనందవిమాన నిలయుడై వేంకటేశుడై కలియుగదైవం అయినాడు. అందుచేతనే తిరుమలకు కలియుగ వైకుంఠమని పేరు.

సందర్శన మాత్రం చేతనే సకలార్థ సిద్ధులనూ కలిగించేదీ, జ్ఞానదాయకమైనదీ కనుక ''జ్ఞానాద్రి'' అనీ, గరుడుని చేత వైకుంఠం నుండి తీసుకొని రాబడుట చేత ''గరుడాద్రి'' అనీ, కనకవర్ణము కలిగి ఉండుట చేత ''కనకాద్రి'' అనీ శ్వేతవరాహస్వామి ఇక్కడ నివసించుట వలన ''వరాహాద్రి'' అనీ, శ్రీవేంకటేశ్వరుడు ఇక్కడ కొలువై ఉండుట చేత ''వేంకటాద్రి'' అనీ పిలువబడింది. ఆదిశేషుడు సప్తగిరుల రూపాన నిలువెత్తి ఉండడం వలన ''శేషాద్రి'' అని విశ్రుతమైనది.

శుద్ధ తత్త్వమైన పరబ్రహ్మ తత్వాన్ని ప్రతిపాదించే పరమ పావన క్షేత్రమే తిరుమల క్షేత్రం. యుగ యుగాలుగా వేద, ఉపనిషద్, పురాణ ప్రతిపాదితాలైన సృష్టి వైచిత్ర్యాలు పరమాత్మ లీలా నాటకాలు. మహర్షుల తపో–యజ్ఞ–దాన ఫలాలు, ఎందరో పరమ భక్తుల ఆత్మానుభవాలు, ధర్మాలు భక్తుల చేత ప్రమాణాలుగా చెప్పబడినవి, చెప్పబడుతూనే ఉన్నాయి.

వేం = పాపములను కటతీతి దహతీతి వేంకటపతి అని,

''వేం'' అమృత బీజము

''కటము'' బంగారము. అమృతైశ్వర్యాలను దర్శనమాత్రం చేతనే ప్రసాదించేదీ, ఇహ పరానంద సంధాయినీ వేంకటాలమని మనకు మన పూర్తీకులకే కాదు సమస్త ప్రపంచవాసులకూ నమ్మకము కలదీ తిరుమలగిరి శ్రీనివాస సన్నిధానం.

నారము అంటే జ్ఞానము – జలము అని కదా చెప్పబడినది. దానిని అనుసరించి ఈ వేంకటాచలమున అనేక దివ్య తీర్థాలున్నాయి. ఇక్కడి ప్రతి తీర్థమూ దేవతా సంచారమైనదే. అటువంటి పదిహేడు తీర్థాల ప్రసక్తి కడు పవిత్రమై తీర్థస్నాతులైన వారి మనస్సులు

పరమాత్మానుభవంతో జ్ఞాన డోలికలలో ఓలలాడుతయాని, సాక్షాత్మోక్షదాయకాలనీ ఋషుల, అనుభవైక వేద్యుల ఉవాచ. వాటిలో మొదటగా చెప్పవలసినది కపిల తీర్థము.

పూర్వము కపిల మహర్షి శేషాచలమునకు దిగువ భాగమున 17 తీర్థములతో సమ్మిళితమైన కపిల తీర్థము వద్ద ఆశ్రమము నిర్మించుకుని తపమాచరించుచున్నాడట. పూర్వము కపిల మహర్షి పాతాళమున పూజించిన శివలింగమే భూమిని చీల్చుకుని ఇక్కడ కపిలాశ్రమమున పైకి వచ్చినది. పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణానికి దేవతలు అందరూ వచ్చినారు. వివాహ వేడుక పూర్తి కాగానే అందరూ గృహోన్ముఖులు అయినారు. పార్వతీ పరమేశ్వరులు కపిలాశ్రమమునకు వచ్చినారు. కపిల మహర్షి పరమేశ్వరుడు అనుగ్రహించినందున ఆ కపిల తీర్థము కపిలేశ్వర తీర్థముగా ఇహపర సాధనం అయింది.

కపిలతీర్థం ఉపరితలాన శక్రతీర్థం ఉన్నది. ఆ శక్రతీర్థ స్నానం చేత ఇంద్రునకు గౌతమ శాప విమోచనం కలిగింది. ఆపైన విష్వక్సేన తీర్థముంది. వరుణ సుతడైన విష్వక్సేనుడు అక్కడ స్నానమాచరించి తపస్సు చేసి శ్రీహరికి సేనాని అయినాడు. ఎగువనున్న పంచాయుధ, బ్రహ్మ, అగ్ని, సప్తర్షి తీర్థాలన్నీ దిగువనున్న కపిలతీర్థంలో సంలీనం అయి, అధికాధిక ఫలప్రదాతలవుతూ ఉన్నవి. కనుక కపిలతీర్థ స్నానము, ఒకరాత్రి అక్కడ నిద్ర చేయుట సనాతన పద్ధతి.

ఆనంద నిలయమునకు ఈశాన్యమున స్వామిపుష్కరిణి, వాయువ్యమున వరాహస్వామి నిలయము ఉన్నవి. వైకుంఠ వాసుడైన శ్రీమన్నారాయణుని క్రీడాద్రిని భూలోకమున గరుడుడు నిలిపినప్పుడే స్వామి పుష్కరిణిని కూడా భూతలానికి తెచ్చినట్లు పురాణ నిర్వచనమున్నది. ఆకాశగంగ పుష్కరిణిలో అంతర్వాహినిగా ఉన్నది.

**స్వామి పుష్కరిణీ స్నానం సద్గురోః పాపాసనమ్**
**ఏకాదశీ వ్రతం చాపి త్రయమత్యంత దుర్లభమ్**

స్వామి పుష్కరిణీ స్నానము, ఏకాదశీ వ్రతము, సద్గురు చరణ సేవనము అసామాన్యములని ఆర్యోక్తి. మహిమాన్వితమైన ఈ స్వామిపుష్కరిణి సకల తీర్థ రాజము. ఈ పుష్కరిణి గురించి అనేక దివ్య గాథలున్నవి.

పూర్వము శంఖణుడు అనే చంద్రవంశపు రాజు సాంకాస్య రాజ్యానికి అధిపతి. ఒకప్పుడు అతని సామంతులు అంతా ఏకమై ఆయనను రాజ్యభ్రష్టుని చేశారు. శంఖణుడు తీర్థయాత్రలు చేస్తూ దక్షిణకాశిగా పేరొందిన కాళహస్తి చేరి సువర్ణముఖి నదిలో స్నానం చేస్తూ జ్ఞానప్రసూనాంబను సేవిస్తూ ఉండగా ఒక ఆకాశవాణి వినిపించింది.

రాజా! ధైర్యము కూడదీసుకుని వెంటనే వేంకటాద్రికి వెళ్ళి శ్రీస్వామి పుష్కరిణిలో స్నాతుడవైన వెంటనే నీ రాజ్యమును నీవు పొందగలవు అని. వెంటనే వేంకటాద్రి చేరి ఆరు నెలలు పుష్కరిణి స్నాన వ్రతమాచరించాడు. ఒకనాడు పుష్కరిణీ తటమున శ్రియః పతినే ధ్యానిస్తున్న శంఖణునకు పుష్కరిణి మధ్య శ్రీ భూ దేవులతో శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమైనాడు. వత్సా! శంఖణుడా! భక్తి ప్రపత్తులతో నీవు చేసిన స్నానవ్రతము వల్ల నీ సమస్త పాపము నశించింది. ఇంక నీ రాజ్యానికి వెళ్ళి సుఖించుమని అదృశ్యుడైనాడు. తిరిగి రాజ్యానికి చేరిన శంఖణుడు చిరకాలం ప్రజలను కన్నబిడ్డల్లా పాలిస్తూ, వేంకటేశ్వరుని సేవిస్తూ పరమపదం చేరాడు.

తరవాత ఎన్నదగిన పుణ్యతీర్థము ఆకాశగంగ. ఈ తీర్థము స్వామి పుష్కరిణికి ఉత్తర భాగమునన్నది. కీకారణ్యంలోని ఒక గిరి సొరంగంలో నుండి నిరంతర జలధార ప్రవహిస్తూ ఉంటుంది. ఆ జలధార యుగయుగాలుగా భూమిని పునీతం చేస్తున్నదనటానికి ఈ వృత్తాంతం ప్రమాణం. పూర్వము త్రేతాయుగాన కేసరి అను వానరోత్తముని భార్య అంజనాదేవి తనకు సంతానము కలుగలేదని మతంగ మహర్షిని దర్శించినది. తనకు సంతానము కలుగుటకు తగిన మంత్రమును ఉపదేశించమని వేడుకున్నది. మతంగముని ఆమె భక్తి నివేదనను మన్నించి అమ్మా! భూలోకమున వేంకటాచలమునకు ఉత్తరదిశనున్న ఆకాశగంగ తీర్థాలలో స్నానమాడి నిశ్చల మనస్సుతో వాయుదేవుని గురించి తపస్సు చేయుము. మహాబల పరాక్రమాలలో వాయుసమాన పుత్రుని పొందగలవని చెప్పి తగిన మంత్రముపదేశింపగా, దృఢదీక్షతో తపించి ఆంజనేయుని పుత్రుడుగా పొందినట్లు అందుచేతనే ఆ పర్వతమునకు అంజనాద్రి అని పేరున్నట్లు త్రేతాయుగ వృత్తాంతము.

ప్రతి సంవత్సరము చైత్ర మాసమున చిత్తానక్షత్ర యుక్త పూర్ణిమా నాడు ఆకాశగంగ స్నానము చేసిన వారికి సంతానప్రాప్తి, ఐశ్వర్యలబ్ధి కలుగుతాయని అనూచాన విశ్వాసం.

అటు తరువాత పేరులోనే పాపనాశనాన్ని తెలియచెప్పేది "పాపనాశన తీర్థము". పుష్కరిణికి ఉత్తరదిశలో ఉన్న పర్వత లోయలోని పుణ్యతీర్థము. స్నానం చేసినవారి పాపాలను తొలగించుకొని పోతున్నదా అన్నట్లు జలం మీద ఒక కల్మషపు నీడ తేలిపోవటం మనకు దృశ్యమానం అవుతూ ఉంటుంది. ఈ తీర్థమహిమను తెలిపే పురాణ గాథ ఒకటి చెప్పుకుందాం.

సకల వేదవేదాంగవేత్త, సమస్త శాస్త్ర పురాణ సంవేది అయిన భద్రమతి అనే వినయ సంపన్న పండితోత్తముడు

వుండేవాడు. అధిక సంతానము కలవాడు. మహా దారిద్ర్యం చేత పీడింపబడుతూ ఉండేవాడు. ఆలుబిడ్డల పోషణ కూడా బహుభారం అయింది. ఆత్మగౌరవాన్ని విడిచి ఇతరులను యాచించలేక, చింతతో కృశించిపోతున్నాడు. భర్త బాధ గ్రహించిన ఆయన ధర్మపత్ని ఒకనాడు అనునయంగా ఇలా చెప్పింది. స్వామీ నా చిన్ననాట ఒక యతి మా తండ్రిగారితో చెప్పిన మాట నేను విన్నాను. శ్రీవేంకటాచలమున నున్న పాపనాశన తీర్థమున స్నానము చేసి భూదానం చేసినవారికి సమస్త పాపం నశించి సకలైశ్వర్యవంతులు అవుతారని తీర్థమాహాత్మ్యం చెప్పినాడు. కనుక మనం కూడా పాపనాశన తీర్థస్నానంతో వేంకటపతి కరుణతో విముక్తులం అవుదాం అని హెచ్చరించింది.

వెంటనే సకుటుంబంగా వేంకటాచల యాత్రకు బయలుదేరారు. దారిలో సుశాలి అనే పట్టణంలో సుఘోషుడు అనే ధర్మాత్ముని కొంత భూమిని తనకు దానమిమ్మని కోరాడు. అంతటి పండితుడికి భూదానం ఇవ్వటం తన అదృష్టం అని భావించి సుఘోషుడు వెంటనే భూమిని సమర్పించాడు. ఆ పండితుడు పాపనాశనంలో స్నానమాడి చిత్తశుద్ధితో శ్రీహరిని, మహాలక్ష్మిని ధ్యానించి సత్పాత్రుడు, సంతానవంతుడు అయిన బీద బ్రాహ్మణునకు భూమిని దానమీయగా, భద్రమతికి లక్ష్మీనారాయణులు సకలైశ్వర్యాలు ప్రసాదించారు. ఇలలో ఆ పండితుడు సకల భోగాలూ అనుభవించి కడకు హరిసాయుజ్యం పొందాడు.

తరువాత ఇహపర సాధకంగా చెప్పబడేది ''కుమారతీర్థం''. ఎన్నడో కుమారస్వామి తపస్సు చేయటం చేత, కౌండిన్యుడనే శతాధిక వృద్ధుడు ఈ తీర్థంలో స్నానం చేసి కౌమార వయస్కుడు అయినాడనీ స్వయంగా శ్రీవేంకటపతే ఆ వృద్ధుని కుమార తీర్థానికి తీసుకువెళ్ళాడనీ చెప్పబడిన ప్రమాణమే ఆ తీర్థానికి కుమార తీర్థమని యుగ యుగాలుగా సార్థకనామం అని మహర్షుల ఉవాచ. ద్వాపరంలో కురుపాండవ సంగ్రామం తరువాత పాప పరిహారార్థం శ్రీకృష్ణ పరమాత్మ పాండవులను కొంతకాలం శేషాద్రి మీద నివసించమని పంపాడు. వైశాఖ శుద్ధ ద్వాదశీ భానువారం నాడు పాండవులు శేషాద్రికి చేరి ఒక జలాశ్రయం వద్ద నివసించారనీ, అందు చేతనే అది పాండవ తీర్థం అని ప్రసిద్ధి చెందినదనీ ప్రత్యక్ష సాక్ష్యంగా ఎందరో మహనీయులున్నారు.

అలా వేంకటాచలంలోని అణువణువూ తానే అయి పరమాత్మ ప్రాణికోటిని తరింప చేస్తున్నాడనే అనేక ప్రామాణిక ఇతిహాసాలు ఉన్నాయి. ఇవన్నీ ఏదో యుగంలో మాటలు అని అనుకోరాదు. ఈనాటికీ స్వామి కరుణాపాత్రులైన భక్తులకు కొంగుబంగారమే. చిత్తశుద్ధితో వెంకటరమణా నీవే దిక్కని వేడుకుంటే తక్షణమే రక్షించే కలియుగదైవం వేంకటపతి.

భగవంతుని దయాపాత్రులమై పొందే ఫలితాలు కొన్ని అంతర్ముఖమైనవి. (మానసిక) అంటే అలౌకికాలన్నమాట. కొన్ని లౌకికమైనవి. ఈ చర్మ చక్షువులతో మనం చూచి అందరికీ చూపించగలవి. అందుకే వేంకటపతి అందరికీ ఆపద మ్రొక్కులవాడు. సర్వభూతాత్ముడు. పిలిస్తే పలికే శ్రీవేంకటేశుని లీలావైభవాలు భక్తులందరికీ ఎప్పుడు ఒకప్పుడు అనుభవాలవుతాయి. మా కుటుంబం అనుభవాన్ని ఒకదానిని మీతో పంచుకుంటాను.

2002 ఆగస్టు 19వ తేదీన మా కొడుకు కోడలు, 11 ఏళ్ళ మా మనవడు ముగ్గురు మనవరాళ్ళు(13 ఏళ్ళు) తిరుమల చేరాం. మా కోడలు, మనవడు, ఇద్దరు ఆడపిల్లలు కాలిబాట మీదుగా సప్తగిరులెక్కాలని మ్రొక్కుబడి. మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరితే సాయంకాలం 6,7 గంటల మధ్య పైకి రాగలరనీ ఈలోపల మేము కారులో పైకి వెళ్ళాలనీ నిర్ణయించాం. మా అబ్బాయి తాను అంతదూరం నడవననీ పైగా నేను సహాయం లేకుండా మెట్లు ఎక్కలేననీ ఉండిపోయాడు. మెట్లెక్కే భక్తులు చాలామందే ఉంటారులే అని భావించాం. అయినా ఆడపిల్లలతో కోడలు ఒక్కతే వెళ్తున్నదే అని చిన్న చింతా యోచన పొడసూపింది. అయినా స్వామి సన్నిధిలో నీకా ఆలోచన ఎందుకే మూర్ఖునిలా అని మనస్సును మందలించుకున్నాను. కొండకు బయలుదేరేముందు అందరూ నాకు నమస్కరించారు పెద్దదానినని.

**జలే రక్షతు వారాహః**
**స్థలే రక్షతు వామనః**
**అటవ్యాం నారసింహశ్చ**
**సర్వతః పాతు కేశవః**

అనే శ్లోకాన్ని పఠిస్తూ గోవిందా, గోవిందా అని పిలుస్తూ కొండ ఎక్కమని ఆ శ్లోకాన్ని ఒక కాగితం మీద వ్రాసి ఇచ్చి, జాగ్రత్తగా దగ్గర ఉంచుకోండి అదే మీకు రక్ష అని చెప్పాను. వాళ్ళు బయలేదేరారు. కారుమబ్బులు క్షణాల్లో క్రమ్ముకొచ్చాయి. ఉరుములు, మెరుపులు, నింగీనేల ఏకమైనదా అన్నంత వర్షం. కొండలు కనిపించనంత వానధారలు. టాటా సుమో కారు కదలిపోయేంత వాన. కారులో కూర్చున్న మేమే తట్టుకోలేకపోతున్నాం. పిల్లల పరిస్థితి ఎలా ఉందో? అసలే జనం తక్కువగా ఉన్నారు. ఆరోజు తిరుమలలో మగవాళ్ళు తోడులేరు అనుకుని వెంటనే హే చరాచర జగన్నాథా! వేంకటరమణా! ఎవరికెవరు తోడు? అందరికీ సర్వాంతరాత్మవైన నీవే తోడు. వాసుదేవ మంత్రం

(ఓం నమో భగవతే వాసుదేవాయ), నారాయణ మంత్రం (ఓం నమో నారాయణాయ) స్థిరచిత్తంతో పఠించటం మొదలుపెట్టాను. అంతకన్న ఆ తిరువెంకటపతి లీలానాటక రంగస్థలం మీద పాత్రలం మనం ఏం చెయ్యగలం? కాని చిత్రాతి చిత్రమైన ఒక అనుభవం.

కాలిబాట మీద ఒక్క చుక్క వానలేదు. ఆ సమయంలో ఆ బాటమీద నడుస్తున్న వాళ్ళు ఒక వృద్ధ జంట, నలుగురైదుగురు బెంగుళూరు ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థులు. నలుగురైదుగురు పల్లెవాసులు. వాళ్ళు కూడా వేగంగా నడుస్తూ ముందుకెళ్ళి పోయారట. వెనుక దూరంగా విద్యార్థులు, ముందు వీళ్ళు మాత్రం మిగిలారట. మా కోడలు శ్రియఃపతీ నీవే దిక్కని నమస్కరించిందట. అంతా శ్లోకాన్ని పఠిస్తూ గోవిందా అని గొంతెత్తి అరుస్తూ నడుస్తున్నారట. ఆరుగజాల దూరంలో హఠాత్తుగా ముద్దులు మూటకట్టినట్లున్న ఎనిమిదేళ్ళ పిల్లవాడు కనిపించాడు. కనుచూపు మేరలో ఎవరూ లేరు కదా! ఈ పిల్లవాడు ఎక్కడినుండి వచ్చాడని అంతా ఆశ్చర్యపోయారు.

తెల్లనివాడు కాదు. చామన చాయ. కనుమాసిన తెల్లచొక్కా. చామంతిరంగు నిక్కరు. పాలుగారే బుగ్గలు. అందమైన తలకట్టు. గాలికి ఎగురుతున్న ముంగురులు. చురుకైన పెద్దకళ్ళు. చేతిలో పచ్చి చువ్వ బెత్తం. ఒకసారి వెనక్కి తిరిగి రండి అని తల ఊపాడట. అంతే! మంత్రముగ్ధుల్లా ఆ పసివాడి వెంట నడవటం మొదలుపెట్టారుట. అంతలో వెనుకనున్న వాళ్ళు కూడా వచ్చి చేరారట. అందరికీ నడక వేగం హెచ్చింది. ఆ పాదాలకు చెప్పులు లేవు. ముగ్ధమనోహరంగా ఉన్నాయా చిన్నిపాదాలు. అలతి అలతి అడుగులతో కదులుతుంటే చూడబుద్ధి వేస్తోంది. కళ్ళు పాదాల మీద నుండి తిరిగి రావటం లేదు. ఎంతదూరం నడిచినా నాలుగు గజాల దూరంలోనే ఉన్నాడట. ఒక్కసారి మాత్రం క్షణం ఆగి జింకలకు జేబులో నుండి తీసి రెండు కారెట్ దుంపలు పెట్టాడు. అంతే ఒక్కసారి కూడా ఆగలేదు. వెను తిరగలేదు.

ఒక్క వాన చినుకు లేదు. భయం లేదు. అలసట లేదు. మాట్లాడుకోలేదు ఎవరు కూడా. గోవిందా గోవిందా అని మనస్సులో అనుకుంటూ, ఆ ముగ్ధమనోహర రూపమే ధ్యానం గమ్యం అన్నట్లు చూస్తూ అనాయాసంగా నడక పూర్తి అయింది. నాయనా! నీవే మా దైవం. నీవే మాముందు నడిచిన బాలపరమాత్మవు శ్రీవేంకటపతివి అని నమస్కరించిందట మా కోడలు.

మేము బయలుదేరే ముందు కారు కాలిబాట మంటపం దగ్గరకు పంపుతాము అని చెప్పాము. కాని ఈ వాన ఆందోళనలో డ్రైవర్ కి ఆ మాట స్పష్టంగా చెప్పలేదు. డ్రైవరు బస్ స్టాండ్ దగ్గర కారు పెట్టుకుని ఉన్నాడు. ఆ సంగతి వాళ్ళకు తెలియదు. కాని ఆ సర్వాంతర్యామికి తెలుసు. ఆ పిల్లవాడి వెంట వెళ్ళటమే వాళ్ళకు తెలుసు. అయ్యో మంటపం వైపు కాదా వెళ్ళాలి! బస్టాండ్ వైపొచ్చామే. ఇప్పుడెలా కారు అక్కడుంటుంది కదా అని అనుకుంటున్నారు. అప్పుడే క్షణం పాటు కళ్ళు ఆ పిల్లవాడి మీద నుండి మరలినాయి. అంతే ఆ బంగారు తండ్రి హఠాత్తుగా కనిపించలేదు.

అయ్యో! ఏదో పసివాడు! ఇంతదూరం మనని తీసుకువచ్చాడే! తినటానికైనా ఏమీ పెట్టలేదే! క్షణంలో ఎటువెళ్ళాడూ? జనం కూడా లేరే ఎక్కువమంది. చూడండి ఇక్కడే ఎక్కడో ఉంటాడు అని అందరూ అన్నివైపులా వెదికారు. కాని క్షణాల మీద 10 మంది కళ్ళు కప్పి అదృశ్యం అయినాడు. ఇంజనీరింగ్ విద్యార్థులు, పిల్లలు, మా కోడలు అందరి మనస్సులు దిగులు, బాధతో మూగపోయాయి. ఆ పసివాడెవరో? మళ్ళీ ఎలా కనిపిస్తాడూ! అతని ఋణం ఎలా తీర్చుకుంటాం? అని. అంతలో అక్కడ కారు కనిపించింది. ఇదంతా ఆ తిరువేంకటేశుని లీలానాటక హేలా తరంగమేనని అందరికీ అవగతం అయింది. నీవు కన్పించినా గుర్తించలేని అల్పమానవులం. మళ్ళీ నిన్నెలా చూస్తాం! హే విభూ! మామీద నీకెంత దయ! కరుణాంతరంగా! తిరు వేంకట రమణా! అని అందరం చేతులు జోడించాం పదే పదే. నెలరోజులు ప్రతిరోజూ ఆ విషయమే చెప్పుకున్నాం.

అందరూ చెబుతుంటే ఆ రూపం నా మనసులో ముద్ర వేసుకున్నది. నా మనోఫలకం మీద ఆ రూపాన్ని ఆ సంఘటనని అనేకసార్లు చర్విత చర్వణం చేసుకున్నాను. నేను వెంటనే ఆ మహదనుభవాన్ని సప్తగిరి (తి.తి.దే వారి) పత్రికకు మా కోడలు రమణి పేరుతో వ్రాశాను. ప్రచురింపబడింది. ఆ లీలా నాటకం కంటిముందు సదా కదలాడుతూనే ఉంటుంది. ముల్లోకాలనూ తమితో కొలచిన త్రివిక్రముడవు ప్రభూ! కాపాడు! అన్న మొర వినగానే పాదరక్షలు కూడా లేని చిన్ని చిన్ని పాదాలతో, బుడి బుడి అడుగులతో తోడుగా నడిచావా! పుండరీకాక్షా! పురుషోత్తమా! తిరువేంకటాధీశా! కలియుగదైవమా! విశ్వాత్మా! అని భావోద్వేగంతో స్రవించే అశ్రువులతో ఆ చిన్నారి పాదాలు కడిగి 'తవచరణం మమ శరణం' అని శిరసు వంచుతూనే ఉంటాను. నాటికీ-నేటికీ-ఏనాటికీ మనసున్నంతవరకూ ఆ దివ్యచరణాలను భావన చేస్తూనే ఉండాలనీ, ఆ భాగ్యాన్ని ప్రసాదించమనీ ఆ సప్తగిరివాసునికి శ్రీనివాసునికి మ్రొక్కులిడి వేడుకుందాం.

❊ ❊ ❊



# శ్రీ ఆదికేశవ పెరుమాళ్ కోవెల - తిరువట్టార్

- ఇలపావులూరి వేంకటేశ్వర్లు

ప్రపంచ ప్రఖ్యాతి చెందినది శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయం, తిరువనంతపురం. అలాంటి దానిని మరో ఆలయాన్ని చూసి ఆ ప్రకారం నిర్మించారని అంటే ఎవరైనా నమ్ముతారా? కాని అది నిజం. ఆధారాలు, ప్రమాణాలు, ప్రత్యక్ష నిదర్శనాలు తెలిపే వాస్తవం. ఆ వివరాలు తెలుసుకొందాము.

భారత దేశ దక్షిణ భాగాన ఉన్న కన్యాకుమారి ఒక శక్తి క్షేత్రం. దేశ విదేశ సందర్శకులు ఎంచుకొనే పర్యాటక స్థలాలలో తప్పక ఉండేది. ఎందరికో అద్భుత అనుభవాలను ప్రసాదించిన కన్యాకుమారి పరిసర ప్రాంతాలు పౌరాణికంగా, చారిత్రకంగా ప్రసిద్ధి చెందిన ఆలయాలకు మరియు కడ్డాలకు పేరొందాయి. అలాంటి వాటిల్లో ఒకటి ''తిరువట్టారు''.

పరలియార్ లేదా వట్టారు నది ఒక ద్వీపకల్పంగా మార్చిన తిరు వట్టారు చేరనాడు శ్రీరంగం, పరశురామ క్షేత్రం లేదా దక్షిణ వైకుంఠముగా ప్రసిద్ధి.

అనేక పురాతన తమిళ గ్రంథాలలో ఉదహరించబడిన తిరువట్టారు ఆలయం సుమారు పన్నెండు వందల సంవత్సరాలుగా భక్తుల విశ్వాసాన్ని చూరగొన్నట్లుగా అవగతమౌతోంది. సుమారు అరవై అడుగుల ఎత్తులో ఉండే ఆలయంలో కొలువు తీరిన ''శ్రీ ఆది కేశవ పెరుమాళ్'' ఈ ప్రాంతాన్ని పాలించిన తిరువాన్కూర్ రాజులకు, వారి బంధువులైన వేనాడ్ రాజుల ఆరాధ్య దైవం. ఇక్కడికి సమీపంలోని పద్మనాభపురం వీరి ఒకప్పటి రాజధాని. పాత రాజ భవనాన్ని నేటికీ వీక్షించవచ్చును.

ఈ ఆలయ నిర్మాణ శైలిలోనే తిరువనంతపుర శ్రీ అనంత

పద్మనాభస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రాంతం ఎత్తుగా ఉండటానికి, శ్రీ హరి ఆది కేశవ పెరుమాళ్ గా కొలువుతీరడానికి సంబంధించి ఒక పురాణ గాథ వ్యాప్తిలో ఉన్నది. విధాత లోక కళ్యాణార్థం ఒక యాగాన్ని తలపెట్టి, ఈ ప్రాంతాన్ని తగినదిగా ఎంచుకొన్నాడట. కానీ ఆయన తన సతీమణి సరస్వతి దేవి పక్కన లేకుండా యాగాన్ని మొదలుపెట్టడం ఆమెకు ఆగ్రహాన్ని కలిగించిందట. దానితో దేవి పతిదేవుని యాగాన్ని భగ్నం చేయడానికి అనేక ఆటంకాలను సృష్టించినదట. (ఇదే గాథ కంచిలోని పలు విష్ణు ఆలయాలతో ముడిపడి ఉండటం విశేషం).

వాటిని ఎదుర్కోవటంతో కొంత మేరకు యాగం మీద ఏకాగ్రత కోల్పోవడంతో అనుకున్న విధంగా లోక కల్యాణం జరగకుండా లోకకంటకులైన కేశ మరియు కేశిని అనే ఇద్దరు రాక్షస సోదరీ సోదరులు ఉద్భవించారట.

యజ్ఞగుండం నుండి పుట్టటం వలన వారికి చావు లేకపోగా, అనేక శక్తులు కూడా లభించాయట.

వారిరువురూ మునులను, మహర్షులను, సామాన్య ప్రజలను ఇబ్బందులు పెట్టసాగగా, వారంతా కలిసి బ్రహ్మ వద్దకు వెళ్ళగా ఆయన సలహా మేరకు వైకుంఠము వెళ్లారట.

వారి వేదనను విన్న వైకుంఠవాసుడు కేశ కేశిని బారి నుండి లోకాన్ని కాపాడటానికి భూలోకానికి వచ్చినాడట.

స్వామి వారికి కేశకు నడుమ భీకర యుద్ధం జరిగింది. ఎంతో కాలం కొనసాగిన పోరాటంలో వానిని సంహరించలేక తన గదాఘాతంతో మూర్ఛిల్లచేయగా అక్కడే ఉన్న ఆదిశేషుడు వాని మీద పడి తన శరీరాన్ని చుట్టలుగా చుట్టుకొనగా వాటి మీద స్వామి శయనించారట. లోపల బందీ అయిన అసురుడు తన చేతులను బయటికి చాపాడట. అతని శక్తిని సంపూర్ణంగా నిర్వీర్యం చేయడానికి శ్రీమన్నారాయణుడు ఆ చేతుల మీద పన్నెండు శివలింగాలను ప్రతిష్ఠించారట. తిరువట్టారు పరిసర ప్రాంతాలలో ఉన్న ఆ శివాలయాలు వరసగా తిరుమలై, తిరుపరప్పు, తిక్కురుచి, పొన్మనై, పన్నిప్పాక్కం, కాల్కుళం, మెలాన్కోడు, తిరు విదైకోడ్, తిరు విత్తంకోడ్, తిరుప్పన్నియోడ్ మరియు తిరునట్టాలం.

శివరాత్రినాడు స్థానిక భక్తులు ఉదయానే బయలుదేరి వరుసగా పన్నెండు శివాలయాలను సందర్శించి చివరకు శ్రీ ఆది కేశవ పెరుమాళ్ ని సేవించుకొని తమ శివరాత్రి యాత్రను ముగిస్తారు. సోదరుని పరాజయంతో ఆగ్రహించిన కేశిని తన నెచ్చెలి కోదైతో కలిసి నదిగా మారి స్వామి కొలువుతీరిన ప్రాంతాన్ని ముంచేయడానికి వేగంగా రాగా భూదేవి వెంటనే ఆ ప్రాంతంలో తనఎత్తును పెంచుకోగా రెండు నదులూ ఆ స్థలం చుట్టూ తిరిగి ఒకటై విడదీయలేని విధంగా మారిపోయాయట.

నేటికి ఫాల్గుణ మాసంలో వచ్చేఉత్సవాలలో స్వామి వారి "ఆరట్టు" (పవిత్ర స్నానం) ఈ సంగమ క్షేత్రంలో జరుపుతారు.

ఆ విధంగా అసుర సోదర సొదరీల భాధ లోకాలకు లేకుండా పోయిందిట. అలా కేశి కేశినిలను శాశ్విత బందీలుగా మార్చి ఇక్కడ కొలువైన శ్రీ హరి ఆది కేశవ పెరుమాళ్ గా పిలవబడుతున్నారు.

ఎత్తైన ప్రదేశంలో ఉన్న ఆలయానికి చేరుకోడానికి సోపాన మార్గం ఉంటుంది. కేరళ శైలిలో నిర్మించబడిన రెండతస్థుల రాజద్వారానికి అనుసంధానంగా ముప్పై అడుగుల ఎత్తుతో ప్రాంగణానికి నలువైపులా ప్రహరీగోడ నిర్మించారు. మిగిలిన మూడువైపులా ద్వారాలుంటాయి. ప్రాంగణంలో శ్రీ కోవెల చుట్టూ రెండు వందల ఇరవైనాలుగు స్తంభాలతో నిర్మించబడిన "శ్రీ బలిప్పు" గా పిలవబడే రాతి మండపం ఉంటుంది. ఒక్కో స్తంభానికి దీపలక్ష్మిగా పిలిచే దీపం పట్టుకొన్న స్త్రీ శిల్పాలుంటాయి.

ఒక్కో శిల్పానిది ఒక్కో అందం. ఇలాంటి మండపమే తిరువనంతపురం శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయంలో కనపడుతుంది. కానీ అక్కడి మండపం వైశాల్యంలో చాలా పెద్దది.

శ్రీ కోవెలకు ఎదురుగా ఉన్న "ఉదయ మార్తాండ వర్మ మండపం"లో చెక్కిన చెక్క చెక్కడాల సౌందర్యం వర్ణింప లేనిది.

విఘ్ననాథుని ఆరాధిస్తున్న భక్తులు, వివాహానికి తరలి వెళుతున్న బృందం, లక్ష్మణ, ఇంద్రజిత్, వేణుగోపాల, పరాశక్తి, బ్రహ్మ, విష్ణు, కాలభైరవ, నంది, నమ్మాళ్వార్, హనుమంతుడు, మహర్షులు, రతీమన్మథుల విగ్రహాలు అత్యంత రమణీయంగా ఉంటాయి.

చెక్కతో చేసిన పెద్ద గొలుసు నాటి శిల్పకారుల నైపుణ్యానికి మచ్చుతునక. మురళిని వాయిస్తున్న కృష్ణుడు ఆ గానానికి మైమరచిపోయి నాట్యం చేస్తున్న శివ కేశవులు, మృదంగం వాయించే విధాత. సహజ జాతి వైరం మరచి పక్కపక్కనే ఉన్న పులి మేక, పాము ముంగిస ఇలా రకరకాల జంతువులను చెక్కిన తీరు చూపరులను మంత్రముగ్ధులను చేస్తుంది. వందల సంవత్సరాల క్రిందట మండపం గోడలపైన సహజ వర్ణాలతో చిత్రించిన చిత్రాలు కొంత మేరకు రూపం కోల్పోయినా చక్కగా ఉంటాయి.

వర్తులాకార శ్రీ కోవెల ముందు పెద్దదైన "ఒట్టుక్కాల్

మండపం'' ఉంటుంది. దాని మీదకు చేరుకొంటే పడమర ముఖంగా ఆది శేషుని మీద శయనించిన ఆది కేశవ స్వామిని మూడు ద్వారాల నుండి చూడాలి. తిరువనంతపురం లో కొలువైన శ్రీ అనంత పద్మనాభస్వామిని కూడా ఇదే మాదిరి మూడు ద్వారాల నుండి వీక్షిస్తాము. గర్భాలయంలో ఎన్నో దేవీ దేవతా మూర్తులు మరియు మహర్షుల రూపాలు కూడా ఉంటాయి.

మరో నిర్మాణ పరమైన అద్భుతం ఏమిటంటే ప్రతి సంవత్సరం మార్చిలోను, అక్టోబర్ లోను మూడు రోజులపాటు సాయం సంధ్యా సమయంలో సూర్య కిరణాలు నేరుగా మూల విరాట్టు పాదాలను తాకుతాయి. మరో విశేషం ఇక్కడ కూడా ప్రధాన అర్చనా మూర్తికి అభిషేకాలు జరగవు. ఉత్సవ మూర్తులకే అభిషేకాలు. ఖండసారి విధానంలో మూల విరాట్టును పదహారు వేల ఎనిమిది సాల గ్రామాలతో తయారు చేసి, పైన కప్పిన బంగారు కవచానికి వజ్రాలను ఛాతీ భాగంలో అమర్చారు. కాకపోతే ఆది కేశవ పెరుమాళ్ నాభి భాగంలో ఉండే బ్రహ్మ ఉండడు. విగ్రహం కూడా శ్రీ అనంత పద్మనాభ స్వామి అంత పెద్దదిగా ఉండదు.

కొన్ని తరాల పాటు తిరు వట్టార్ శ్రీ ఆది కేశవ పెరుమాళ్ ని కొలిచిన ట్రావెంకూర్ రాజులు వారికి వారు పద్మనాభ దాసులుగా ప్రకటించుకొని తిరువనంతపురానికి రాజధానిని (1745 వ సంవత్సరంలో) తరలించి చిన్నగా ఉన్న శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని భారీగా పునః నిర్మించారు.

ముందుగా చెప్పుకొన్నట్లుగా ఈ రెండు ఆలయాల మధ్య చాలా పోలికలు ఉన్నాయి. ముఖ్యమైన తేడాలు రెండు. మొదటిది తిరువట్టారు మూల విరాట్టు పడమర ముఖంగా ఉండగా తిరువనంతపురం స్వామి తూర్పు ముఖం కొలువై ఉంటారు. రెండవది ఆకారంలో ఈ ఆలయం చిన్నది. ఆ ఆలయం పెద్దది. శ్రీ కోవెల ముందున్న ''ఒట్టుక్కాల్ మండపం'' తిరువనంతపురంలో చిన్నది. ఈ ఆలయంలో శ్రీకృష్ణ, శ్రీ నారసింహ సన్నిధులుండగా తిరువట్టారులో ఉప ఆలయాలుండవు. రెండు ఆలయాలలో పూజలు, ఉత్సవాలు ఒకే రీతిన ఉండటం మరో విశేషం. ప్రధాన ఉత్సవాలకు రాజు స్వయంగా తరలి వస్తాడు. పాలకులైన ట్రావెంకూర్ రాజులు శ్రీ మహావిష్ణువు మీద అపరిమితమైన భక్తి విశ్వాసాలు కలిగి ఉండటమే ఇందుకు ప్రధాన కారణం.

స్వామి వారిని ఆపత్ సమయాలలో ఆదుకొన్నారు అని తెలిపే కథనాలు ఎన్నో ప్రచారంలో ఉన్నా నేటికీ ఆలయ ఉత్సవాలతో, పూజలతో ముడిపడి ఉన్న కొన్నింటిని తెలుసుకొందాము.

తిరువట్టారు శ్రీ ఆది కేశవ పెరుమాళ్ విజయ కారకుడు. ఈ ప్రాంతాన్ని రాజా కేరళవర్మ పాలించే కాలంలో మొఘలాయి సేనలు దండయాత్రకు తరలి వచ్చాయిట. ఇరు దళాల మధ్య జరిగిన భీకర పోరులో కేరళ సేనలకు ఓటమి తప్పని పరిస్థితులలో నాటి సాయంత్రం రాజు ఆలయానికి వెళ్ళి ఆశువుగా పదునాలుగు చరణాలతో కీర్తించారట. అది పూర్తయిన మరుక్షణం గర్భాలయం నుండి ఝుమ్మని శబ్దం చేస్తూ తేనేటీగల గుంపు వచ్చి మొఘలాయి సేనల పైన దాడి చేశాయిట. వారి సేనానితో సహా పెద్ద సంఖ్యలో సైనికులు మరణించడంతో విజయం కేరళ వర్మ ను వరించినది. నాటి నుండి నేటి వరకు సాయం సంధ్యా సమయంలో దీపాలు వెలిగించేటప్పుడు కేరళ వర్మ గానం చేసిన ''పద సంకీర్తన లేదా ఆది కేశవ స్తవం'' పాడతారు.

మరోసారి రాజా మార్తాండ వర్మ రాజ్యం కోల్పోయి శత్రువుల బారి నుండి తనను తాను కాపాడుకునే ప్రయత్నంలో ఒక బ్రాహ్మణ గృహానికి చేరుకున్నాడట. భర్తను కోల్పోయిన పేద విధవరాలు వచ్చినది రాజని తెలియక, అతిథిని ఆకలితో పంపకూడదని ఇంటిలో మిగిలిన అన్నంతో ఉడక బెట్టిన మామిడి కాయ ఉప్పు పెట్టినదట. కేశవ పెరుమాళ్ ని సేవించుకొన్న తరువాత శత్రువులను ఓడించి రాజ్య పాలనను చేపట్టిన తరువాత మార్తాండవర్మ నాటి సంఘటనకు గుర్తుగా స్వామి వారికి అన్నంతో ఉడక బెట్టిన మామిడి కాయ ఉప్పు నైవేద్యంగా పెట్టడం ఆరంభించి అదే విధమైన నైవేద్యం ఆ బ్రాహ్మణ కుటుంబం వారే సమర్పించాలని శాసనం చేసాడట. అది నేటికి కొనసాగుతోంది.

డచ్ వారి మీద విజయం సాధించిన తరువాత విజయ కారకుడైన కేశవ పెరుమాళ్ కు రాజా వీర కేరళవర్మ తన పేరు వచ్చే విధంగా ''వీరళం'' అనే ఒక రకమైన పాయసాన్ని సమర్పించు కొన్నాడట. స్వామివారి విగ్రహంలో ఎన్ని సాల గ్రామాలున్నాయో అన్నింటికీ ఒక్కో దానికి ఇన్ని అని లెక్కకట్టి వందల కిలోల బియ్యంతో ఈ నివేదన తయారు చేస్తారు నేటికీ. ఆలయంలో ఉన్న అనేక తమిళ శాసనాలు ఎందరో రాజులు, ప్రముఖులు స్వామికి సమర్పించుకొన్న కైంకర్యాల వివరాలు తెలుపుతాయి.

శ్రీ ఆది కేశవ పెరుమాళ్ మహత్యాన్ని తెలిపే మరో గాథ 1740 వ సంవత్సర కాలంలో జరిగినట్లుగా తెలుస్తోంది. ఆర్కాటును పాలించే నవాబు ఈ ప్రాంతం మీదకు దండయాత్ర జరిపి విజయం సాధించి తిరిగి వెళుతూ స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని తనతో తీసుకొని వెళ్లాడట. తన రాజ భవనంలో పనికిరాని సామానులు పడవేసే

గదిలో ఆ విగ్రహాన్ని అందునా కావాలని అన్నింటి క్రింద ఉంచారట సేవకులు. కానీ ఆశ్చర్యకరంగా మరునాటి ఉదయానికి మూర్తి అన్నింటికన్నా పైన ఉండేదట. ఎన్నో విధాలుగా విగ్రహాన్ని క్రింద ఉంచాలని చేసిన ప్రయోగాలన్నీ విఫలమయ్యాయిట. అదే సమయంలో నవాబు భార్యకు తీవ్రమైన కడుపునొప్పి వచ్చి ఏ వైద్యానికి లొంగలేదట. సరిగ్గా అప్పుడే ఆలయ పూజారికి స్వామి స్వప్నంలో కనిపించి నవాబు భార్య అనారోగ్యం గురించి తెలిపి, విగ్రహాన్ని తిరిగి ఆలయానికి పంపితే ఆమె ఆరోగ్యం చక్కబడుతుందని ఈ విషయాన్ని నవాబుకు తెలియజేసి విగ్రహాన్ని తెచ్చే బాధ్యత అతనికి అప్పగించాడట.

దేవ దేవుని ఆదేశం ప్రకారం వెళ్లి విషయాన్ని నవాబుకు తెలిపాడట పూజారి. అప్పటికే భార్య అనారోగ్యం వలన మనస్థిమితం కోల్పోయిన ఆయన విగ్రహం పైకి రావడాన్ని పరిగణలోనికి తీసుకొని పూజారి చెబుతున్నది సత్యమే అని నమ్మి మూర్తిని తిరిగి ఇచ్చేసారట. విగ్రహం ఆలయానికి చేరిన మరుక్షణం ఆమె స్వస్థతను పొందినదట. స్వామివారి మహత్యాన్ని పూర్తిగా నమ్మిన నవాబు ఒక బంగారు కలశం, బంగారు పళ్ళెం తన కానుకగా సమర్పించుకొన్నారట. నేటికి నివేదనకు వాటినే వాడుతున్నారు. అంతేకాదు ప్రతి సంవత్సరం ఇరవై ఒక్క రోజుల పాటు జరిగే ''తిరు అల్ల పూజ''ను నవాబే ఆరంభించాడట. ఆలయంలోని చిన్న మండపంలో నిర్వహించే ఈ కలశ పూజలో మహ్మదీయ ఆచారం ప్రకారం ''అరిసె'' నైవేద్యంగా పెడతారు.

ఇవే కాకుండా ధనుర్మాస పూజలు, వైకుంఠ ఏకాదశి, శ్రీ రామ నవమి, జన్మాష్టమి ఇతర స్థానిక పర్వదినాలలో ఆలయం వేలాది భక్తులతో కళ కళలాడుతుంది. తిరువట్టారు శ్రీ వైష్ణవ దివ్య దేశాలలో ఒకటి. శ్రీ నమ్మాళ్వార్ తన పది పాశురాలలో శ్రీ ఆది కేశవ పెరుమాళ్ ని అనేక విధాలుగా కీర్తించారు.

ఇక్కడికి తిరువనంతపురం, కన్యాకుమారి మరియు నాగర్ కోయిల్ నుండి చేరుకొనవచ్చును. ఎలాంటి సదుపాయాలు లభించవు. వాహనాన్ని అద్దెకు తీసుకొంటే సమీపంలోని ప్రదేశాలను తక్కువ వ్యవధిలో సందర్శించే అవకాశం ఉంటుంది.

ఆలయంలో ఎట్టి పరిస్థితులలోను ఫోటోలను తియ్యనియరు. అద్భుత శిల్ప చెక్క శిల్పాల నిలయమైన ఈ ఆలయ సౌందర్యాన్ని నేత్రాలతో చూసి మనస్సులో భద్రపరచుకోవాలి.

!! జై శ్రీ మన్నారాయణ !!



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

**17వ కళ్యాణం: తేది 13-01-2022 వైకుంఠ ఏకాదశి రోజున జరిగింది. ఇది శ్రీమాన్ పిట్ల సిసాల రాజు గారి ఆధ్వర్యంలో పటాన్‌చెరువులో అంగరంగ వైభవంగా జరిగింది. నమో వేంకటేశాయ ఊరేగింపుతో ప్రారంభమైన కళ్యాణ తంతులు, భక్తుల కోలాటాలు, భజనలతో, అన్నమయ్య సంకీర్తనలతో ఎంతో తృప్తిగా జరిగింది. 1500 మంది భక్తులు ఈ కళ్యాణాన్ని వీక్షించి తరించారు. ఇది వైఖానసాగమోక్తంగా జరిగింది.**

**ప్రస్తుతం నెలకొన్న కొవిడ్ 19 నిబందనల కారణంగా నిలిచిపోయిన కళ్యాణాల కార్యక్రమము ఆధ్యాత్మిక సమావేశాలకు ప్రభుత్వము అనుమతించిన వెంటనే తిరిగి ప్రారంభమగును.**

**శ్రీవేంకటేశ్వర పాద సేవకుడు**
**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**

# ఔర్వ మహర్షి




ఔర్వ మహర్షి తండ్రి అప్రవానుడు. తల్లి పేరు ఋచి. హైహయ వంశములోని వాడైన కార్తవీర్యార్జునుని తండ్రి కృతవీర్యుడు అనే మహారాజు యజ్ఞాలు చేసి భార్గవ వంశంలో గొప్ప గొప్ప బ్రాహ్మణులని పిలిచి వారికి గురుదక్షిణగా తన సంపదలన్నీ ఇచ్చేశాడు. కానీ కృతవీర్యుడి పిల్లలు మాత్రం బ్రాహ్మణులే మోసం చేసి వాళ్ళ తండ్రి నుండి సంపదలన్నీ తీసేసుకున్నారని నిందించారు. ఇది హైహయులకీ, ఆర్య బ్రాహ్మణులకీ మధ్య వైరానికి మూల కారణం.

కృతవీర్యుడి కొడుకులు భార్గవ వంశ బ్రాహ్మణుల్ని, వాళ్ళ భార్యల్ని, పిల్లల్ని వెతికి మరీ చంపడం ప్రారంభించారు. వాళ్ళలో ఋచి కూడా ఉంది. ఋచి గర్భంతో ఉందని కూడా చూడకుండా తరుముతూ వచ్చారు. ఆవిడ పరుగెత్తలేక ఒకచోట కూర్చుండిపోయింది. ఆ సమయంలో ఋచి గొప్ప తేజస్సు కలిగిన కొడుకుని ప్రసవించింది. అతడు పుట్టగానే ఆ తేజస్సుకి ఋచిని తరుముకుంటూ వచ్చిన రాజు కొడుకులంతా గుడ్డివాళ్ళయిపోయారు. ఋచికి పుట్టిన ఆ పిల్లవాడే ఔర్వుడు.

కృతవీర్యుడి కొడుకులు ఋచి కాళ్ళ మీద పడి అమ్మా! మమ్మల్ని క్షమించు. బుద్ధి లేక ఇలాంటి పని చేశాము. ధర్మంగా లేని పనులు చేస్తే ఇలాగే అవుతుందని తెలిసి కూడా తప్పు చేశాము. క్షమించమన్నారు.

ఋచి, నాయనలారా! ఇందులో నేను చేసింది ఏమీ లేదు. ఇప్పుడే పుట్టిన ఈ భార్గవ వంశ కులానికి దీపం లాంటి ఈ పిల్లాడే చేసి ఉంటాడు. ఇతను గర్భంలోంచి బయటకు రాకుండానే వేదవేదాంగాలను నేర్చుకున్నాడు. తపస్సంపన్నుడు, సర్వశక్తి సంపన్నుడు. ఈ పిల్లవాడే మిమ్మల్ని శపించి ఉంటాడని అంది. కొడుకు ఔర్వుడితో "నాయనా! తెలియక తప్పు చేశారు. వాళ్ళని క్షమించి వాళ్ళకి కళ్ళు కనిపించేలా చెయ్యమని చెప్పింది. తల్లి అలా కోరిన వెంటనే రాజకుమారులకు పోయిన కళ్ళు తిరిగి వచ్చాయి. రాజకుమారులు ఔర్వుడికి నమస్కారం పెట్టి వెళ్ళిపోయారు.

ఔర్వుడు కొంత పెద్దవాడయ్యాక తన తండ్రితో సహా తన బంధువులు అందరూ రాజుల వలన చనిపోయారని కోపంతో తపస్సు మొదలుపెట్టాడు. అతని తపస్సుకి అందరూ భయపడిపోయారు.

పితృదేవతలు భూలోకానికి వచ్చి నాయనా! నీ తపోబలానికి లోకాలన్నీ భయపడుతున్నాయి. మమ్మల్ని రాజకుమారులు చంపలేదు. మాకు ధనాశ కూడా లేదు. ఉంటే స్వయంగా కుబేరుడే వచ్చి ఇచ్చేవాడు. మా తపస్సు వల్ల మా ఆయుష్షు కూడా ఎక్కువగానే ఉంది.

మాకు మనుష్య లోకంలో ఉండటం ఇష్టం లేదు. చచ్చిపోతే గాని స్వర్గానికి పోలేము. ఆత్మహత్య చేసుకుంటే పుణ్యలోకం రాదు. ఇవన్నీ ఆలోచించుకుని హైహయ రాజులతో శత్రుత్వం పెంచుకుని మాకు మేమే వారివల్ల చచ్చిపోయాం. నువ్వు కోపం విడిచిపెట్టు. దీనివల్ల లోకానికి చెడు చేసినవాడివి అవుతావు అని చెప్పారు.

ఔర్వుడు పితృదేవతలకు సాష్టాంగ నమస్కారం చేసి మీరు చెప్పినట్లే చేస్తాను. కాని నా కోపాన్ని ఉపసంహరిస్తే అది నన్నే దహించేస్తుంది కదా. ఏం చెయ్యమంటారు? అని అడిగాడు. నీ కోపాన్ని నీళ్ళలో విడిచిపెట్టు. ఎందుకంటే నీ కోపాన్ని తట్టుకునే శక్తి నీళ్ళకి ఉందని చెప్పి ఔర్వ మహర్షిని దీవించి వెళ్ళిపోయారు పితృదేవతలు. ఔర్వుడి ఆ కోపాగ్నిని "ఔర్వాగ్ని" అంటారు.

ఔర్వ మహర్షి బ్రహ్మచర్యం తీసుకుని మళ్ళీ తపస్సు మొదలుపెట్టాడు. ఈయన చేసే తపస్సుకి మళ్ళీ లోకాలన్నీ గడగడలాడాయి. మహర్షులు, దేవతలు, రాక్షసులు అందరూ వచ్చేశారు కుమారా! ఇంత చిన్నతనంలో బ్రహ్మచర్యం తీసుకుని ఇంత తపస్సు చేస్తున్నావు. నువ్వు పెళ్ళి చేసుకోకపోతే భార్గవకులం నాశనమయిపోతుంది. నువ్వు వెంటనే పెళ్ళి చేసుకో అన్నారు.

ఔర్వ మహర్షి చిరునవ్వు నవ్వి వేదాధ్యయనం, యజ్ఞం, సంతానం పొందడం ఇవన్నీ గృహస్థులకు ఉండవలసిన ధర్మాలు. నేను అడవిలో ఉండేవాణ్ణి. నాది వానప్రస్థ ధర్మం. అంటే ఉపవాసం. గాలి, నీళ్ళు భోజనంగా తీసుకోవడం నా ధర్మం.

బ్రహ్మచర్యం వల్ల బ్రహ్మగతి వస్తుంది. బ్రహ్మదేవుడు బ్రహ్మచారి అయినా మానసపుత్రులు ఉన్నారు కదా. పిల్లల్ని కనడమే ముఖ్యమనుకుంటే నేను కూడా పెళ్ళి కాకుండానే పిల్లల్ని చూపించమంటారా? చూడండి అని అగ్నిహోత్రంలో తన కాలు పెట్టి ఒక దర్భతో రాశాడు. అతని కాలు నుంచే అగ్నిహోత్రుడే కొడుకుగా బయటకు వచ్చాడు. అతడు అంతకంతకీ పెరిగిపోతుంటే బ్రహ్మదేవుడు వచ్చి ఔర్వ మహర్షీ! నీ కొడుక్కి ఉండటానికి చోటు, ఆహారము నేను ఇస్తాను. అతన్ని నాకు విడిచిపెట్టు అన్నాడు. ఈ అగ్ని కూడా సముద్రములో ఉన్న ఔర్వాగ్నితో కలిసి ప్రళయ సమయంలో నీరుగా మారిపోతుంది అన్నాడు. బ్రహ్మదేవుణ్ణి మీ ఇష్టప్రకారమే కానియ్యండి అన్నాడు ఔర్వ మహర్షి. ఆ కొడుకు రూపంలో ఉన్న అగ్ని సముద్రంలో

కలిసిపోయింది. అందరూ వెళ్ళిపోయారు.

హిరణ్యకశిపుడు మాత్రం ఆగిపోయి ఔర్వ మహర్షికి సాష్టాంగ నమస్కారం చేశాడు. ఔర్వుడు హిరణ్యకశపా! నీకు విద్యమాని అనే విద్యను ఇచ్చాను తీసుకో అన్నాడు. అదే రాక్షస మాయ అంటే. ఈ విద్య నీ వంశంలో వాళ్ళకే ఉంటుంది అన్నాడు.

ఒకసారి ఔర్వ మహర్షి బ్రహ్మచర్య వ్రతంలో ఉండే ఒక కూతుర్ని కూడా పొందాడు. ఆమెకు 'కందని' అనే పేరు కూడా పెట్టాడు. కందని ఎంత అందంగా ఉంటుందో అంత కఠినంగా మాట్లాడుతుంది. కందని పెరిగి పెద్దయ్యాక దూర్వాస మహర్షి గురించి విని దూర్వాసుడితో పెళ్ళి చెయ్యమని తండ్రిని కోరింది.

ఔర్వుడు కందనిని తీసుకుని దూర్వాసమహర్షిని కలవాలని బయలుదేరాడు. కందని అందం వల్ల కలిగిన తేజస్సుతోనూ, ఔర్వ మహర్షి తపశ్శక్తితో వచ్చిన తేజస్సుతోనూ వాళ్ళిద్దరూ కలిసి వెడుతుంటే ఆ దారంతా కాంతితో నిండిపోయింది.

ఔర్వ మహర్షి దూర్వాస మహర్షిని కలిసి కందనిని ఆయనకిచ్చి పెళ్ళి చేయాలని అనుకుంటున్నట్లు చెప్పాడు. దూర్వాసుడు అందుకు ఒప్పుకున్నాక ఇద్దరికీ పెళ్ళి చేయించి ఔర్వ మహర్షి తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

చాలాకాలం కందని, దూర్వాసులు కలిసి ఉన్నారు. ఒకనాడు కందని కటువైన మాటలు భరించలేక దూర్వాసుడు కందనిని కోపంగా చూశాడు. తపశ్శక్తితో ఉన్న ఆ చూపుకి కందని భస్మమైపోయింది. అది తెలిసి ఔర్వుడు అవమానాలతో బాధపడే మనిషిగా పుట్టమని శపించాడు దూర్వాసుణ్ణి.

అయోధ్యా నగరాన్ని పాలిస్తున్న బాహురాజు తన రాజ్యాన్ని పోగొట్టుకుని గర్భవతి యైన భార్యను తీసుకుని ఔర్వ మహర్షి ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్నాడు. సవతి పెట్టిన విషం వల్ల రాజు భార్యకి ఏడు సంవత్సరాలైనా కొడుకు పుట్టలేదు. కాని రాజు పెద్దవాడవడం వల్ల చనిపోయాడు. రాజు భార్య కూడా సతీసహగమనం చేస్తుంటే ఔర్వమహర్షి రాజు భార్యని ఆమె కడుపులో ఉన్న పిల్లాడు గొప్ప చక్రవర్తి అవుతాడని సహగమనం చెయ్యొద్దని చెప్పాడు.

రాజు భార్య పరమేశ్వరుణ్ణి తలచుకుంటూ కాలం గడుపుతోంది. ఒకనాడు ఆమెకి కొడుకు పుట్టాడు. విషంతో కూడా బయటికి వచ్చిన ఆ పిల్లవాడికి ఔర్వ మహర్షి సగరుడు అని పేరు పెట్టి అక్కడే పెంచుతూ ఉన్నాడు. అతనికి ఉపనయనం చేసి వేదవిద్యలు, శాస్త్ర విద్యలు మొదలైన అన్ని విద్యలూ నేర్పించాడు.

ఒకనాడు సగరుడు తల్లితో అమ్మా! మన రాజ్యం ఏమయింది? మనం అడవుల్లో ఎందుకు ఉన్నాం? అని అడిగాడు. తల్లి కొడుక్కి జరిగిందంతా చెప్పింది. సగరుడు గురువుగారి దగ్గర, తల్లి దగ్గర అనుమతి తీసుకుని శత్రువుల్ని జయించి వస్తానని హైహయ వంశ రాజులందరినీ జయించాడు. సగరుడికి భయపడి శక, యవన, కాంభోజ, పారప్లవ దేశాల రాజులు వసిష్ఠుడిని శరణు వేడారు. వసిష్ఠుడు సగరుడికి నచ్చచెప్పి వాళ్ళ రాజ్యాలు వాళ్ళకి ఇప్పించాడు.

తర్వాత సగరుడు అయోధ్యా నగరానికి వచ్చి పట్టాభిషేకం అయ్యాక పెళ్ళి చేసుకున్నాడు. అతని భార్యలు సుమతి, సుకేశి. కాని సగరుడికి పిల్లలు పుట్టలేదు. సగరుడు భార్యలను తీసుకుని ఔర్వమహర్షి ఆశ్రమానికి వచ్చి గురువుగారికి పరిచర్యలు చేస్తూ అక్కడే ఉండిపోయాడు.

ఒకనాడు ఔర్వ మహర్షి సగరుడి భార్యల్ని పిలిచి వంశాన్ని ఉద్ధరించే ఒక్క కొడుకు కావాలా? సామాన్యమైన అరవై వేలమంది కొడుకులు కావాలా? అని అడిగాడు. సుకేశి ఒక్క కొడుకు చాలంది. సుమతి అరవై వేల కొడుకులు కావాలని అడిగింది. ఔర్వ మహర్షి వాళ్ళు అడిగినట్లే అనుగ్రహించాడు. గురువుగారి ఆశీర్వాదంతో సగరుడికి అరవై వేల ఒక్క కొడుకులు కలిగారు.

సగరుడు చాలాకాలం రాజ్యం చేశాడు. ఒకనాడు గురువుగారిని విష్ణువుని పూజిస్తే ఏం ఫలితం పొందవచ్చని అడిగాడు. ఔర్వుడు సగరుడితో రాజా! వర్ణాశ్రమ ధర్మాల్ని శ్రద్ధ, భక్తితో నిర్వహించే వాళ్ళంటే విష్ణుమూర్తికి ఇష్టం. ఇతరుల ధనాన్ని ఆశించకుండా, జీవహింస చెయ్యకుండా, సాధువుల్ని తిట్టకుండా, అహంకారం లేకుండా, గురుభక్తి కలిగి బ్రాహ్మణులని సేవించి అన్ని జీవులలోను భగవంతుడున్నాడని గ్రహించి ఎవరి వృత్తి వాళ్ళు చేసుకునే వాళ్ళంటే విష్ణుమూర్తికి ఇష్టం. అలాంటి వాళ్ళకి విష్ణుమూర్తి ఏదడిగితే అది ఇస్తాడు అని చెప్పాడు ఔర్వ మహర్షి.

గురువర్యా! గృహస్థ ధర్మాల్ని చెప్పమన్నాడు సగరుడు. ఔర్వుడు రాజా! గృహస్థ ధర్మాన్ని పాటించిన వాళ్ళు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ కూడా సుఖంగా ఉంటారు. రాజా! గృహస్థు బ్రహ్మ ముహూర్తంలో లేచి గురువుని స్మరించి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసి తెల్లని మడిబట్ట కట్టుకుని సంధ్యావందనం చేసుకుని సూర్యనమస్కారం చేసి ఇష్టదేవుడి పూజ చేసి అతిథుల్ని ఆదరించాలి. రోజూ చెయ్యవలసిన పనులు చేసుకుంటూ వేద శాస్త్ర ప్రసంగాలతోనూ, ధర్మకార్యాల గురించి మాట్లాడుకుంటూ పగటి సమయాన్ని గడపాలి.

సాయంకాలం సంధ్యా సమయంలో చెయ్యాల్సిన పనులు పూర్తి చేసుకుని భోజనం చేసి తాంబూలం వేసుకుని తూర్పుకు గానీ, దక్షిణానికి గానీ తల పెట్టుకు నిద్రపోవాలి. ఇలా చేస్తుంటే గృహస్థుకి పుణ్యలోకాలు కలుగుతాయని ఇంకా శ్రాద్ధకర్మల గురించి కూడా సగరుడికి చెప్పాడు ఔర్వ మహర్షి.

ఔర్వ మహర్షి నిగ్రహం, అనుగ్రహం, బ్రహ్మచర్యం, మహాతపశ్శక్తి ఉన్నవాడు. ఆయన చెప్పిన గృహస్థ ధర్మాలు అందరూ తప్పక ఆచరించాలి.

నీతిగా, ధర్మంగా, దయగా, పద్ధతిగా గురుభక్తి, దేవుని యందు భక్తి అన్నీ ఉన్నవాడు సాధించలేనిది ఏమీ లేదని ఔర్వ మహర్షి చరిత్ర వల్ల మనకు తెలుస్తోంది.



# శ్రీ విష్ణు మహాపురాణము

- కిడాంబి నరసింహాచార్య

గత సంచిక తరువాయి

## ఐదవ అధ్యాయము – పంచమాంశ

పరాశరుడు చెబుతున్నాడు – విడుదలై వసుదేవుడు నందుడి బండ్లు విడిచే చోటుకి వెళ్ళాడు. నందుడు ఆనందంగా ఉన్నాడు. కారణం ఆతనికి పుత్రుడు కలిగాడు అని. వసుదేవుడు కూడా ఆతనితో అన్నాడు. అదృష్టము, అదృష్టము అని. వృద్ధాప్యంలో కూడా నీకు ఇప్పుడు ఈ కొడుకు పుట్టాడు అని. ఏడాదికొకసారి ఇచ్చే రాజుగారి పన్నును పూర్తిగా ఇచ్చావా అని అడిగాడు. దానికొరకే వచ్చావు. మహాధనవంతులు ఇక ఇక్కడ ఉండరాదు. ఏ పనికొచ్చారో ఆ పని ఐంది కదా. ఇంక ఇక్కడ ఉండడమెందుకు. నందా! నీ గోకులానికి త్వరగా వెళ్ళుము. అక్కడ నాకు రోహిణి యందు ఏ కొడుకు పుట్టాడో వాడిని కూడా, నీ కొడుకు లాగా రక్షించాలి అని పలుకగా నందగోపుడు మొదలైనవారు వెళ్ళిపోయారు. బండ్ల యందున్న బిందెలలోని పన్నును ఇచ్చి ఆ బలవంతులు వెళ్ళిపోయారు. గోకులంలో ఉన్నవారికి పసిపిల్లలను చంపే పూతన నిద్రిస్తున్న కృష్ణుని తీసుకుని రాత్రిపూట ఆతనికి పాలు ఇస్తున్నది. రాత్రిపూట ఆమె ఎవరెవరికి పాలిస్తున్నదో వాడు క్షణంలో చచ్చిపోతున్నాడు. కృష్ణుడైతే తన చేతులతో ఆమె స్తనాన్ని బాగా పీడించి కోపంతో ప్రాణాలతో సహా స్తనాన్ని త్రాగాడు. అది అరుస్తూ ఆమె స్నాయు బంధములన్నీ (ఎముకల బంధనం) విడిపోగా చాలా భయంకరంగా చస్తూ భూమిపై పడింది. ఆ శబ్దాన్ని విని భయపడి ఆ వ్రజమందున్న వారంతా లేచి కూర్చున్నారు ఆ రాత్రి. పూతన ఒడిలో కృష్ణుని చూచారు. చచ్చిన పూతనను చూచారు. భయపడి కృష్ణుని తీసుకున్నది యశోద. ఆవు తోకను కృష్ణుని పైనుండి త్రిప్పి పిల్లవాని మీదుండే గ్రహదోషాన్ని తొలగించింది. తలపై ఆవుపేడను పెట్టుకుని నందగోపుడు కృష్ణునికి రక్ష చేశాడు. ఇట్లా అన్నాడు – సమస్త భూతములకు పుట్టుక స్థానమైన హరి

నిన్ను రక్షించాలి. ఆతని బొడ్డునుండి పుట్టిన తామర నుండే కదా ఈ సృష్టంతా జరిగింది. ఆతని కోరతో ధరింపబడియే భూమి జగత్తును ధరిస్తున్నది. వరాహి రూపుడైన దైవము కేశవుడు నిన్ను రక్షించాలి. చిన్నపాటి గోళ్ళతో శత్రువు వక్షస్థలాన్ని ఛేదించిన ప్రభువు నృసింహస్వామి జనార్దనుడు నిన్ను అంతటా రక్షించాలి. వామనుడు నిన్ను ఎప్పుడు రక్షించాలి. ఆతడే కదా క్షణంలో త్రివిక్రముడై క్రమంగా ముల్లోకాలన్నీ ఆక్రమించినవాడు రక్షించాలి. నీ శిరస్సును గోవిందుడు, కంఠాన్ని కేశవుడు సహనాన్ని జఠర భాగాన్ని విష్ణువు, జంఘులు, పాదాలను జనార్దనుడు రక్షించాలి. ముఖాన్ని, బాహువులను, భుజములను, మనస్సును, సర్వ ఇంద్రియాలను, ఎడతెగని ఐశ్వర్యము గల అవ్యయుడైన నారాయణుడు, మధుసూదనుడు రక్షించాలి. ఆకాశమందు హృషీకేశుడు, భూమియందు భూమిని ధరించిన వాడు రక్షించాలి అని నందగోపుడు కృష్ణునకు రక్ష పెట్టాడు. పరాశరుడు అంటున్నాడు – ఇట్లా కృష్ణునకు మంగళమును నందగోపుడు పలికాడు. పిదప పిల్లవానిని బండి క్రింద చిన్న మంచం మీద పడుకోబెట్టాడు నందగోపుడు. ఆ గోపాలురు పూతన యొక్క పెద్ద కళేబరాన్ని చూచి చచ్చిందని గ్రహించి చాలా ఆశ్చర్యాన్ని, భయాన్ని పొందారు అని శ్రీవిష్ణు మహాపురాణంలో పంచమాంశలో ఐదవ అధ్యాయం సమాప్తం.

## ఆరవ అధ్యాయం

పరాశరుడంటున్నాడు – ఒకసారి బండి క్రింద పడుకున్న మధుసూదనుడు పాలు కావాలని ఏడుస్తూ పాదాలు పైకెత్తాడు. ఆతని కాలి తాకిడితో బండి తలక్రిందులైనది. కుండలు మొదలైన సామగ్రి మొదలైన సామగ్రి ధ్వంసమై తలక్రిందులుగా పడినాయి. గోపాలురు, గోపీజనమంతా హాహాకారాలు చేశారు. అంతా వచ్చి పిల్లవాడు వెల్లకిలా పడివుండటాన్ని చూచారు. గోపాలురు బండిని ఎవరు ఇలా చేశారన్నారు. అక్కడ చిన్నపిల్లలున్నారు. ఈ పిల్లవాడు పడవేశాడని (కృష్ణుడు) అన్నారు. ఏడుస్తూ కాలు తగిలిస్తే ఈ బండి తలక్రిందులైంది. మేము చూచాము. వేరే ఎవరూ చేయలేదు అని. పిదప గోపాలురంతా చాలా ఆశ్చర్యపడ్డారు మనస్సులో. చాలా ఆశ్చర్యపడుతూ నందగోపుడు బాలుని ఎత్తుకున్నాడు. యశోద బండి యందున్న పగిలిన కుండ పెంకులను, శకటాన్ని పెరుగు, పూలు, పండ్లతో అక్షతలతో పూజించింది. వసుదేవునితో ప్రోత్సహింపబడి గోకులంలో గర్గుడు రహస్యంగానే ఆ గోపులకు సంస్కారాన్ని చేశాడు. జ్యేష్ఠునకు రాముడని, చిన్నవానికి కృష్ణుడని నామకరణం చేశాడు. మునులలో శ్రేష్ఠుడైన గర్గుడు బుద్ధిబలంతో రామకృష్ణ అని పేర్లు పెట్టాడు కంసుడు తెలుసుకోకుండా (బలవంతుడొకడు, నల్లనివాడొకడు అని). కొద్దిరోజుల్లోనే వారు గోకులంలో తిరుగసాగారు. వారు మోకాళ్ళతో, చేతులతో భూమిని పీడించసాగారు. పేడ, బూడిద వంటినిండా పూసుకుంటూ అటు ఇటు తిరగసాగారు. వారిద్దరిని యశోద కాని, రోహిణి కాని ఎవరూ వారించలేకపోయారు. గోకులంలో ఆడుకుంటున్న వాళ్ళు దూడలుండే చోటికి వెళ్ళారు. అప్పుడే పుట్టిన దూడ తోకను లాగసాగారు. వాళ్ళిద్దరు ఒకేచోట తిరుగుతున్న వేళ వారిని వారించలేకపోయింది యశోద. అతి చపలురై ఆడసాగారు. యశోద కృష్ణుని నడుముకు తాడు కట్టి మిగిలిన తాడు రోటికి కట్టింది. కోపంతో కృష్ణునితో, అసాధ్యమైన పనులు చేస్తున్న వానితో ఇట్లా అంటూ తన పనులు చేసుకుంటోంది. ఆమె తన పనులలో మునిగి ఉన్నవేళ కృష్ణుడు రోలును లాగుతూ అర్జున (మద్ది) చెట్ల మధ్యనుండి వెళ్ళాడు. చెట్ల మధ్యలో రోలిని లాగుతుండగా ఆ చెట్లు పడిపోయాయి. కట కట మని చెట్లు పడుతున్న చప్పుడు విని గొల్లవాడలోని జనులంతా వచ్చి ఆ పడిపోయిన చెట్లను చూచారు. అప్పుడే పళ్ళు వస్తూ ఉండి, ఆ చిన్ననోటిలో తెల్లని పళ్ళకాంతి గల బాలుణ్ణి చూచారు. ఆ చెట్ల మధ్యనున్న, గట్టిగా నడుముకు తాడు కట్టబడిన వానిని చూచారు. అప్పటినుండి ఆతడు దామోదరుడైనాడు (దామముతో కట్టబడినవాడు). గోపవృద్ధులంతా నందునితో కూడి మహా ఆపదలకు భయపడి చంచల మనస్కులై ఆలోచించసాగారు. మనకు ఈ చోటు పనికిరాదు. మరో అరణ్యానికి పోదాము అని. నాశకారణమైన ఉత్పాతములు ఇక్కడ బాగా కనిపిస్తున్నాయి. పూతన చనిపోయింది. బండి తలక్రిందులైంది. ఏ సుడి గాలి లేకుండానే చెట్లు పడిపోయినాయి. త్వరలో ఇక్కడి నుండి బృందావనానికి పోదాము. ఈ గోకులానికి కదిలే, కదలని వస్తువులతో ఏ రకమైన దోషాలు కలగకముందే దీన్ని వదిలిపోదాము అని తలచి ఆ గోకులంలోని వారంతా పోవడానికి నిశ్చయించుకుని తమ తమ వారందరికీ శీఘ్రంగా వెళ్ళండి ఆలసించకండి అని పరస్పరం అనుకున్నారు. తరువాత త్వరలోనే తమ తమ బండ్లలో గో ధనములతో సహా బయలుదేరారు. దూడలను చూచేవాళ్ళు, గుంపులు గుంపులుగా గోకులంలోని వారు వాటిని నడిపిస్తూ బయలుదేరారు. ఎక్కడైతే ధాన్యము, అన్నము, పాలు, పెరుగు ఉండేదో క్షణంలో అక్కడ కాకుల కాంతితో నల్లగా కాంతి హీనమైంది గోకులము.

భగవంతుడైన కృష్ణుడు దేన్నైనా సులభముగా చేయగలవాడు. గో సమృద్ధిని కోరి తన శుభ సంకల్పంతో బృందావనాన్ని ధ్యానించాడు. ఓ ద్విజశ్రేష్ఠా! ఎండాకాలంలో చాలా కఠినంగా ఉన్నా వర్షాకాలం వలె బృందావనం అంతటా లేత గరికతో నిండిపోయింది. గోకులంలోని వారంతా బృందావనంలో చక్కగా వసతి ఏర్పరచుకున్నారు. చిన్న చిన్న బండ్లతో చుట్టబడి అర్ధచంద్రాకృతిలో వసతి ఏర్పరచుకున్నారు. దూడలను కాపాడేందుకు రాముడు, దామోదరుడు సిద్ధమైనారు. ఒకచోట ఉండి చిన్నపిల్లల ఆటలాడుతూ వారు ఉన్నారు. నెమలి పింఛాన్ని తలపై ధరించి అడవిపూలను తలలో ధరించి గొల్లవారికి తగిన వేణువులతో చేయబడిన మృదంగాది వాద్యాలు కలిగి, ఆకులతో చేసిన వాద్యములతో ధ్వని చేస్తూ, వాటిని వాయిస్తూ ఊదుతూ సిగలు కలిగి కుమారస్వామి అంశలైన శాఖ, విశాఖలవలె ఆ బలరామ కృష్ణులున్నారు నవ్వుతూ ఆనందిస్తూ మహా అరణ్యాన్నంతా తిరిగారు. ఒక్కో చోట ఇతరులను వీపుపై మోస్తూ, తాము ఇతరుల వీపుపై కూర్చుని పరస్పరం ఆడసాగారు. ఇతర గోప పుత్రులతో కూడి దూడలను మేపుతూ తిరుగసాగారు. ఇట్లా కాలం గడవగా, వారు ఏడు సంవత్సరాలు ఆ మహావ్రజం (గోకులం) వాసులైనారు. దూడలను పాలించసాగారు.

వర్షాకాలం వచ్చింది. ఆకాశం అనేక మేఘాలతో కప్పబడింది. దిక్కులను ఏకం చేస్తున్నదా అన్నట్లు వర్షం కురవసాగింది. కొత్తగా గరిక మొలిచింది. భూమి ఇంద్రధనుస్సు కాంతులతో, ఆరుద్ర పురుగులతో నిండింది. పద్మరాగ మణులతో కూడిన మరకతమణి కాంతివలె భూమి ఉన్నది. అంతట నదులు పొంగి ప్రవహించాయి. దుర్వినీతుల మనస్సులు కొత్తగా లక్ష్మిని పొందినట్లు హద్దుమీరాయి నదులు. నల్లని మబ్బులతో కప్పబడి ఆకాశంలో చంద్రుడు ప్రకాశించలేదు. సజ్జనుడు వాదించే వాగ్వాదన మూర్ఖులకు ప్రగల్భమని తోచినట్లు / మూర్ఖుల ప్రగల్భాలతో సద్వాదివాదము వెల వెల పోయినట్లు చంద్రుడున్నాడు. అల్లుత్రాడు వేయకుండానే ఆకాశంలో ఇంద్రధనుస్సు కన్పించింది. మేఘాల వెనుక కొంగల నిర్మల సమూహము ప్రకాశిస్తున్నది. చెడ్డవాని దగ్గర సత్కులజాతుడైన వాని చక్కని నడక వలె ఉన్నదిది. అతి చంచలమైన మెరుపు ఆకాశంలో ఉండలేకపోయింది. దుర్జనుని స్నేహము, శ్రేష్ఠ పురుషునితో నిలువలేనట్లుగా ఉంది. గడ్డి, గరిక వీటితో నిండి త్రోవలన్నీ స్పష్టంగా తెలియటంలేదు. బాగా మూర్ఖులైన వారి మాటలు చెప్పదలచిన అర్థాన్ని కాక మరో అర్థాన్ని తోచుచున్నట్లుగా చెప్పినట్లుందిది. ఆ కాలంలో ఆ వనంలో మదించిన నెమళ్ళు, లేళ్ళు తిరుగుతున్నాయి. గోపాలురతో కూడి ఆనందంతో రామకృష్ణులు సంచరించారు. ఒక్కోసారి గోవులతో కూడి ఆనందిస్తూ ఉన్నారు. ఒక్కోసారి చాలా చల్లని వృక్షముల నీడలో చేరి ఉన్నారు. ఒక్కోసారి కదంబ పూలను మాలను ధరించి అందంగా ఉన్నారు. మరోసారి నెమలి ఈకల మాల కల్గి ఉన్నారు. ఒక్కోసారి రకరకాలైన గైరికాది ధాతువులతో పూసుకోబడి ఉన్నారు. నిద్రపోదలచి ఒకసారి ఆకులు పరచుకుని పడుకున్నారు. ఒక్కోసారి మేఘం గర్జిస్తుంటే హాహాకారాలు చేశారు. ఒక్కోసారి పాటపాడే గొల్లపిల్లలను ప్రశంసించారు. నెమలి ధ్వనిని అనుకరిస్తూ గోప వేణువును ఊదారు. ఇట్లా రక రకాల భావాలతో గొప్ప ఆనందాన్ని పొందారు. మానసిక ఆనందంతో ఆడుతూ ఆ అడవిలో వారు తిరిగారు. వర్షం లేని వేళలో గోవులతో, గోపాలురతో కూడి విహరించి, సమయానికి ఇంటికి చేరేవారు. గోపాలురతో సమానంగా అయిన వారితో కూడి దేవతలూ ఆడుకున్నారు. ఇలా రామ కృష్ణులు అక్కడ ఉన్నారు.

**ఆరవ అధ్యాయము సమాప్తము**

# గజల్ ప్రక్రియలో నా ప్రార్థన

ఏడుకొండలెక్కి నిన్ను దేహముతో కొలిచేదనూ
ఎన్నెన్నీ జన్మలనీ గాయముతో కొలిచెదనూ
మాయలోన ఉన్నామూ దారిచూపు రామయ్యా
మనసారా నిన్ను నేను రాగముతో కొలిచెదనూ
వింతైనా రోగాలను రూపుమాపు గోవిందా
నీ కృపకై ప్రతిదినమూ దైన్యముతో కొలిచెదనూ
కలియుగమున నీ మహిమా చూపించవ శ్రీనివాస
భక్తుల కాపాడెదవని ధైర్యముతో కొలిచెదనూ
మా ఆపద మొక్కులనూ తీర్చవయ్య వెంకటేశ
దీనురాలి దీవించవ కంఠముతో కొలిచెదనూ

**– యలమర్తి చంద్రకళ**

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో "శ్రీనివాస కళ్యాణాలు" అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము.

భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున (పుట్టినరోజు, పెండ్లిరోజు, షష్టిపూర్తి... ) 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**

**(ఈ శ్రీనివాస కళ్యాణాల కార్యక్రమము ప్రభుత్వము వారు ఆధ్యాత్మిక సమావేశాలకు అనుమతించిన వెంటనే తిరిగి ప్రారంభమగును.)**

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈరాశి స్త్రీ పురుషులు ప్రయాణములలో ప్రత్యేకముగా శ్రద్ధ తీసుకోవాలి. ప్రయాణ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నవి. మంచి శకునంతోపాటు, ఘాతుక దోషాలు ఉంటాయి. ఆరోజున ప్రయాణాలు వాయిదా వేయండి. ప్రతినిత్యం పూజలు చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈరాశి స్త్రీ పురుషులకు విందు వినోదములు. బంధుమిత్రుల కలయిక ఆకస్మిక ధనాదాయం. సంఘంలో గౌరవ మన్ననలు. విజయపథంలో ముందుకు సాగండి. మీ విశ్వాసమే మీకు రక్ష.. నమ్మండి. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధన వలన కోరికలు తీరును.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆర్థికంగా చాలా బాగుంటుంది. విందులు, వినోదములు శుభకార్యములు పట్టుకొనిన పనులు నిర్విఘ్నంగా జరుగుతాయి. సంఘంలో గౌరవ మర్యాదలు, వ్యాపారాభివృద్ధి, పాత బాకీలు తీర్చగలరు. తొందరపాటు లేకుండా మసలుకోవాలి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలతగా ఉంటుంది. వ్యాపార లాభము. ఆకస్మిక ధన సంపాదనకు అనుకూలం. వస్త్ర వాహన యోగం. సంఘంలో గౌరవ మర్యాదలు, శుభకార్యములు, విందు వినోదములు. భార్య ఆరోగ్యములో శ్రద్ధ తీసుకొనగలరు. ఆయుర్వేదముతో నివారణ.

## సింహరాశి

**మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆకస్మిక ధనలాభం ఆకస్మిక ఖర్చులు, శుభకార్యములు, బంధుమిత్రుల కలయిక. పంతాలకు పట్టింపులకు చోటు ఇవ్వరాదు. అందరితో కలిసి మెలిసి కార్య విజయం పొందండి. గ్రామదేవత పూజలు అవసరం. ఆదివారం చేయండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు సంతృప్తికరమైన రోజులు, ఆడంబరములకు దూరంగా ఉండండి. ఇతరులతో ఏ విషయం చెప్పరాదు. వివాహ శుభకార్యములు నెరవేరగలవు. అవసరానికి డబ్బు అందుతుంది. పిల్లల అభివృద్ధి మీరు ఆరోగ్యంలో కొన్ని జాగ్రత్తలు తీసుకొనక తప్పదు. ఆయుర్వేదంతో తగ్గును.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు బంధుమిత్రులతో శుభకార్యములు విజయవంతంగా జరుపుకొనగలరు. మీ అవసరానికి డబ్బు సమకూరుతుంది. శ్రీ అన్నవరం వీరవేంకట సత్యనారాయణ స్వామి వ్రతం శాస్త్రోక్తంగా జరిపించిన చాలా సంతృప్తికరంగా ఉంటారు.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు విందు వినోదములు. శుభకార్యములు. బంధుమిత్రుల కలయిక. అకాల భోజనం. అనారోగ్య సమస్యలు కలిగి ఉన్నారు. ఆంజనేయ స్వామి చుట్టు ప్రదక్షిణలు చేయండి. తమలపాకులతో పూజ.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆకస్మిక ధనలాభం. ప్రతి విషయంలో అనుకూలత. ఏనాటి నుండి కాని పనులు నెరవేరగలవు. కోర్టు కేసులు పరిష్కారమునకు అనుకూలత. ప్రతీది ఇష్టంగా సులువుగా పూర్తి చేస్తారు. సూర్యభగవానుడికి పూజలు చేయండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా సంతృప్తి విందు వినోదములు, బంధుమిత్రుల కలయిక శుభకార్యములు అవసరానికి డబ్బు సమకూరుట వలన చాలా ఆనందం. వృత్తి ఉద్యోగములో అనేక అభివృద్ధి కార్యక్రమములు, అంతరాయం లేకుండా సాగిపోగలవు. దైవారాధనలు తప్పనిసరి.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సిద్ధాంత పరంగా చాలా అనుకూలత చక్కగా వనరులు సమకూర్చుకొన్న ప్రతి విషయంలో ఆలోచన పరంగా జాగ్రత్తలు పాటించిన ఫలితము ప్రక్కనే ఉంటుంది. మీ నిజాయితీకి ఒక అవకాశం కార్యరూపం దాల్చగలదు.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా సంతృప్తి కరంగా ఉంటుంది. గ్రామ దేవతకు పూజలు చేయండి. పాత మొక్కులు తీర్చండి. మీరు బయటకు వెళ్లినప్పుడు ఎవరిని ఏమి అనరాదు. ఇంట బయట విజయం వరించగలదు. కనకధారాస్తోత్రం చేయండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




**శ్రీ వేంకటేశం**

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సిగూడ, హైదరాబాద్-500007,

ఫోన్: 040-27175050

Email: srivenkatesham@gmail.com


**ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.**

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. హాహా హూహూ అనే గంధర్వునికి శాపమిచ్చిందెవరు?
2. శ్రీరామునికి ఇలవేలుపు ఎవరు?
3. మురారి అనే భక్తుడు – ఎవరి అవతారం?
4. సగరుని భార్యలెవరు?
5. బ్రహ్మాశ్రమం ఎక్కడుంది?
6. సగరుని పుత్రులు ఎవరి కంటి మంటకు భస్మమైపోయారు?
7. గోదాదేవి ఎవరి అంశ?
8. శ్రీవారికి కనకాభిషేకం చేయించిన భక్తుడెవరు?
9. పూరీ జగన్నాథమునకున్న మరోపేరు ఏది?
10. ఋష్యశృంగ మహర్షి ఎవరి కొడుకు?
11. విష్ణుమూర్తి ఘంటాసురుని సంహరించిందెక్కడ?
12. అయ్యప్ప ఆలయంలోని మొదటి మెట్టుకి అధిదేవత ఎవరు?
13. స్వామివారి, ముఖమును, పాదాలను ఒకేసారి చూడలేని ఊరేది?
14. గాయత్రీ మంత్రంలోని ఏ అక్షరంలో భూదేవి ఉంటుంది?
15. శ్రీవారు ఒక్కరే ఊరేగే వాహనం ఏది?

1. ______________________
2. ______________________
3. ______________________
4. ______________________
5. ______________________
6. ______________________
7. ______________________
8. ______________________
9. ______________________
10. ______________________
11. ______________________
12. ______________________
13. ______________________
14. ______________________
15. ______________________

పేరు: ______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్: ______________________

ఫోన్: ______________________

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. వాయుదేవునితో; 2. విష్ణువు; 3. కుమ్మరి భీముడు; 4. 20-5-1894; 5. అగస్త్యుడు; 6. దేవాలయం; 7. చీకటిని హరించాడు కాబట్టి; 8. మధుసూదనుడు; 9. విష్ణులోకం ప్రాప్తిస్తుంది; 10. స్త్రీ రూపంలో; 11. ఒక పూట మాత్రమే భోజనం చేయటం; 12. బ్రహ్మదేవుడు; 13. నహుషుడు; 14. బ్రహ్మమానస పుత్రుడు; 15. కుమ్మరి భీముడు

## సరైన సమాధానాలు రాసినవారు

1. బులుసు బాబూరావు, 2. పి. యశోద, 3. ఎం. అహల్యాదేవి, 4. సూరి సౌభాగ్యలక్ష్మి, 5. కె.ఎస్.ఎస్. లక్ష్మి, 6. టి. సాయి సుకుమార్

**లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత**

## టి. సాయి సుకుమార్



Postel Registration No.
HSE/879/2022-2024

Published on 28th and Licenced to
Post On 29th & 30th of Every Month

RNI No.
APTEL/2008/23122

# శ్రీ వేంకటేశం



If Un delivered please return to:

**SRI VENKATESHAM**, **(Sri Venkateshwara Maha Maha Peetham)**
H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.readwhere.com లో చదవండి
Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq